

వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

సంపుటి : 24 సంచిక : 4
ఫిబ్రవరి - 2021
'శార్వరి' పుష్య మాఘాలు

సంపాదకులు
సాగి కమలాకర శర్మ

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 9347971177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


| | |
|---|---|
| మూసీ సాహిత్య ధార | 6 |
| అవిశ్రాంత సాహితీపథికుడు - పద్మశ్రీ "ఆశావాది"...అన్నమరాజు ప్రభాకరరావు | 7 |
| జానపద హాస్యగేయాలు - అధ్యయనం ... డా. బొలుగాని శోభన్‌బాబు | 11 |
| మూసీ పదవినోదం - 26 ... డా. తాడేపల్లి పతంజలి | 16 |
| అశ్మక జనపద నాణాల పరిచయము ... కందకుర్తి యాదవరావు | 17 |
| తెలుగు పరిశోధన - వర్తమాన స్థితిగతులు ...ఆచార్య వెలుదండ నిత్యానందరావు | 19 |
| గ్రంథాంతరంగం - ఆంధ్ర వాఙ్మయ చరిత్రము ... శ్రీ ఘట్టమరాజు | 23 |
| కవిత్రయ భారతం - సార్వకాలీన ధర్మాలు ... ఏ. మారుతిశివ | 27 |
| సాహిత్యంలోనే ఒక కోహినూర్ - దాశరథి 'బాల్యం' ... డా. తిరునగరి | 29 |
| ఆరు దశాబ్దాల సాహిత్యపు మావి.. మన పీ.వీ ... డా. వొజ్జల శరత్ బాబు | 31 |
| పద్య మనోహరం -17 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు | 34 |
| తెలంగాణ యోగులు - శ్రీ జ్ఞానేశ్వరానందగిరి స్వామి ... డా. రంగి కమల | 35 |
| తెలుగు బోధన నైపుణ్యాలు - తెలుగు లిపి బోధన ...ఆచార్య వై. రెడ్డి శ్యామల | 39 |
| కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 10 ... టి. లక్ష్మీనారాయణ | 43 |
| తృప్తి (సాహిత్యవ్యాసం) ... గరిశకుర్తి రాజేంద్ర | 48 |
| భారతీయ సంగీతం - 50 ... సామల రాజవర్ధన్ | 49 |
| శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి | 53 |
| 'రచన'కు అర్ధ శతాబ్దం ... నల్ల భూమయ్య | 55 |
| కొండవీటి సత్యవతి కొన్ని మెరుపులు-ఉరుములు ... ఆవుల రేణుక | 58 |


### కవితలు

రథసప్తమి ...యెలుగూరి వెంకటరెడ్డి - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్-6; కొన్ని చూపులు ...తిరునగరి శరత్‌చంద్ర -15; సరస్వతీ ప్రాతఃస్మరణ ... డా.డి. కామేశ్వర రావు-18; పేదరికమా చచ్చిపో ... పులుమద్ది సత్యనారాయణ - 30; మెరుస్తుంది గగనాన ... కరాదుల అరుణకీర్తి పతాకరెడ్డి-37; అతడే అన్నదాత ...ఎన్. పవన్‌కుమార్ - 39; వేళ్ళ రక్తం వేణువు మీద ... దుర్గాప్రసాద్ అవధానం-42; గణతంత్రమా వందనం ... అనిత దావత్ -52, శరణు దేవీ! శరణు! శరణు...డా. వొజ్జల శరత్ బాబు-60; తెనుగు భారతీ! ... ఆచార్య శ్రీవత్స - 62

### సమీక్షలు



| | |
|---|---|
| దినకరుని హృదయాన్ని పరచిన శతకరాజం ...సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు | 59 |
| స్వీకృతి ... | 61 |


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

## పట్టింపు

అన్నీ పట్టించుకోవాలి... అంటూ చిన్నప్పటి నుండి మనకు నేర్పుతూనే ఉంటారు. దేనిని పట్టించుకోవాలి, దేనిని వదులుకోవాలో సమయానుకూలంగా చెపుతుంటారు. మనం కొన్నింటితో మమేకమై వాటిని వదులుకోవడానికి ఇష్ట పడం. ఈ పట్టింపులు ఎందుకు... అంటూ మూర్ఖత్వానికి సంకేతంగా కూడా వాడుతుంటారు. శరీరానికి కూడా నూనె పట్టించుకుంటాం. పిండి కొట్టడానికి కూడా పట్టించుకొని రమ్మంటారు. దానంతట అదే కాకుండా మన ఇష్టంతో పూసుకోవడమే పట్టింపు. అన్నీ పట్టించుకుంటే ఎలా? అంటూ మళ్ళీ దీర్ఘాలు కూడా మనమే తీస్తాం. పట్టూ విడుపులు ఉండాలంటాం. పట్టిన పట్టు విడవకుండా ముందుకు వెళ్తేనే ఏదైనా సాధించగలం అంటూ చెప్తాం. ఈ భావాలన్నీ కొంత అస్తవ్యస్తంగానే కనిపిస్తుంటాయి. మన మార్గం విషయంలో అనుమానాలను కలిగిస్తుంటాయి.

ఏదైనా పైకి ఎదగాలంటే పైన ఉన్న దానిని గట్టిగా పట్టుకోక తప్పదు. భూమితో మమేకమైన వృక్షంలోని వేరు భూమిని గట్టిగా పట్టుకుంటే తప్ప తన మనుగడ సాధించలేదు. చేతితో పట్టుకునేవి, నోటితో పట్టుకునేవి, కాలితో పట్టుకునేవి ఎన్నో ఉంటాయి. విషయాన్ని బట్టి, వ్యవహారాన్ని బట్టి. ఏదైనా క్రింద పడకుండా ఉండడానికి మాత్రమే. అయితే దేనిని పట్టుకోవాలి, దేనిని విడిచి పెట్టాలి అనే విషయంలో విజ్ఞత ఉపయోగించని వానికి మాత్రం ఈ పట్టింపులు అన్నీ జీవితాన్ని అధోగతికి పంపుతాయి. తగిన జ్ఞానం కావాలి లేదా అధ్యయనం చేయాలి.

భూమి తన చుట్టూ తాను తిరుగుతూనే సూర్యుని శక్తిని పట్టుకుంటుంది కాబట్టే గొప్ప శక్తిని పొంది తన పిల్లలమైన మనందరికీ ఆహారాన్ని అందిస్తుంది. అంటే మనకన్నా ఉన్నతమైనది, ఉత్తమమైన దానిని ముందు గుర్తించి దానిని పట్టుకోవడం కావాలి. గుర్తించడానికి తగిన జ్ఞానం కావాలి, లేదా పెద్దలు, అనుభవజ్ఞులు, జ్ఞానులు చెప్పినదైనా వినాలి. తర్వాత వదలకుండా పట్టుకోవాలి. ఒకదానిని గట్టిగా పట్టుకుంటే చాలు, మిగిలినవేవీ మనని ఇబ్బంది పెట్టని స్థితికి ఎదగాలి. పట్టుకుంటే అంతగా నిష్ఠతో, భూమి లాంటి క్రమశిక్షణతో పట్టుకోవాలి.

శక్తివంతమైన దానిని పట్టుకుంటే మనకూ శక్తి వస్తుంది. అనవసరమైన దానిని పట్టుకుని కూర్చుంటే దానికోసం మన శక్తి వ్యర్థం అవుతుంది. శక్తి వచ్చిన వాడిని సమాజం పట్టుకుంటుంది. శక్తి లేనివాడిని ఎవ్వరూ గుర్తించరు. అయస్కాంతం చుట్టూ ఇనుము తిరిగీ, తిరిగీ అయస్కాంతంగా మారుతుంది. భ్రమర కీట న్యాయం మనకు తెలిసిందే. గ్రహాలు సూర్యుని చుట్టూ తిరిగితే, తమ చుట్టూ ఉపగ్రహాలు తిరుగుతాయి. శాశ్వతమైన దానిని తెలుసుకుని గుర్తించి, పట్టించుకోవడానికే ఈ జన్మ వస్తుంది. తెలివి కోసం అధ్యయనం.

ఉన్నతమైన, ఉత్తమమైన దానిని పట్టుకోవడం ద్వారా గుర్తింపు సాధ్యం అవుతుంది. అన్నింటి కన్నా బాగా పట్టుకునేది మన శరీరాన్నే. దానితో అనుబంధం మనకు చాలా ఎక్కువ. చివరివరకు దానితోనే. పూర్ణమైన నిద్రలో ఈ శరీరం లేనివాళ్ళం కదా! లేచినప్పటి నుండీ వేరు వేరు పాత్రలు పోషిస్తూ వాటిని పట్టించుకుంటాం. ఉన్నత మైన, మూలమైన శక్తిని బలంగా పట్టుకుంటే, అనవసరంగా పట్టుకున్నవన్నీ వదిలిపోతాయి. బలంగా పట్టుకోనంత కాలం... ఈ ఇబ్బందులు తప్పవు. శక్తిని గుర్తించాలి. జ్ఞానంతో గుర్తించాలి. దానిని వదలకుండా పట్టుకోవాలి. అజ్ఞానం వదులుతుంది. అనవసరమైనవన్నీ దూరమవుతాయి. ఆనందం చేరువ అవుతుంది. కడుపులో ఉన్నదాన్ని పట్టుకొని ఉండలేము కదా! వదలడమే విస్తరణకు, ఎదుగుదలకు సంకేతం.

# రథ సప్తమి





దినకరుడంబరాన తను దిర్గెడి మార్గము ఉత్తరార్ధమై
జనుటకు నిర్ణయించుకొని జక్కగ పశ్చిమ కొండలందు తా
తనువును గప్పివేయ భువి తాలిమి జేయక బాటసారియై
మునుపటివోలె తూర్పుదిశ ముచ్చట గొల్పును బాలభానుడై

ఉదయము ఆరుగంటలకు వుద్భవ మందుట నిత్యకృత్యమై
ముదమును గూర్చ కన్నియలు ముగ్గులు దీర్చగ ప్రాంగణమ్ములో
పడపడి వేడి దృక్కులట పర్చగ భూస్థలి కాకలీనగన్
ముదిమిన నున్నవారు తమ మోమును కొంగున గప్పుటొప్పగన్

ఉదయాద్రిన రవిబింబము
రథయాత్రను అంబరాన రంజిల జేయన్
ఉదకము దోసిట బట్టియు
యదునందనుడర్ఘ్యమిచ్చె యాదిత్యునికిన్

ప్రొద్దున శాంతిరూపు సరిపొద్దుకు భానుడు రౌద్రమూర్తియై
హద్దును మీరకుండ తన ఆకృతి నెల్లను చల్లబర్చుచున్
మద్దెమ మార్గమెన్నుకొని మాపున పశ్చిమ కొందలందు తా
సద్దుమణంగి చల్లబడి సాగుదయాద్రి కదృశ్యరూపుడై

సూర్యుడు పుట్టిన దినమును
ఆర్యులు రథసప్తమంటు ఆరాధింపన్
కార్యంబులు ఫలప్రదమగు
ధైర్యం బొనగూడు భానుదర్శనమందన్

రథ సప్తమి యన జెల్లును
పృథివిన రవికిరణదీప్తి పెంపరయంగన్
విధిగన్ యుత్తర ముఖుడై
పదగామిగ పయనమౌను పశ్చిమ దిశకున్

ఆదిత్యుని పూజించిన
వ్యాధులు వుపశమనమొందు వరదానముగన్
నది జలమున గాయత్రిని
పదిలము పఠియింప పుణ్యఫలమొనగూర్చున్

రవిబింబము కనుపింపగ
ప్రవహించెడు జీవనదిన పరిశుద్ధుండై
పవమానుని పూజించిన
భవరోగ నివృత్తి జరిగి భాగ్యంబొదవున్


దేవుడున్న తావు తెలియగ పనిలేదు
సెలవులేని కొలువు చేయు దినము
పగటి సమయమెల్ల పయనించు గగనాన
చేతులెత్తి మ్రొక్క క్షేమయరయు

కాంతి నిచ్చు భువికి కాపాడు జీవుల
అంధకారమందు గుందకుండ
పశ్చిమమున గ్రుంకు ప్రభవించి వుదయాద్రి
విశ్వమాయ నెరుగ వశము కాదు


**యెలుగూరు వెంకటరెడ్డి**
రంగారెడ్డి గూడెం, పెదవూర మండలం, నల్లగొండ జిల్లా.
ఫోన్ : 9492359949

# మూసీ సాహిత్య ధార - 28

## కావ్యశాస్త్రం - మౌలికాంశాలు





నిరంతర పరిశోధన స్రవంతి... మూసీ సాహిత్యధార.. అంతర్జాలం ద్వారా సాగుతూనే ఉంది. ఇరవై ఎనిమిది మాసాలుగా వివిధ విషయ నిపుణులతో ప్రసంగ పరంపర కొనసాగుతుంది. సాహిత్యంలో ప్రత్యేకంగా పరిశోధన దృష్ట్యా అన్ని కోణాలలో ఈ ఉపన్యాసాలు సాగుతున్నాయి. ఈ మాసం ప్రత్యేకంగా పరిశోధన అనగానే ప్రాతిపదికగా గుర్తుకువచ్చే ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు ప్రసంగించారు. వీరు 'పరిశోధన - అనుభవాలు' అనే శీర్షిక కింద వారి అనుభవంతో పాటు ఆచరించాల్సిన అంశాలను, పాటించాల్సిన పద్ధతులను, పరిశీలించాల్సిన కోణాలను విశ్లేషించారు. ఇప్పటి పరిశోధనల మీద కొంత ఆవేదనను వ్యక్తపరిచనప్పటికీ, ఇప్పటి పరిస్థితుల రీత్యా కొన్నింటిని అంగీకరించక తప్పదంటారు. పరిశోధనను ప్రత్యేక అంశాలమీద మాత్రమే కాకుండా కొన్ని పదాలు, కొన్ని పద్యాల మీద కూడా చేయవచ్చునంటూ సోదాహరణంగా తెలియజేసారు. గంటకుపైగా సాగిన ఈ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎప్పటిలాగే ఈ వేదిక మీద పరిశోధక విద్యార్థులు మాట్లాడే స్వీయ పరిశోధనలో భాగంగా అంకం మారుతి ప్రసంగించారు. వీరు 'భారతం సార్వకాలీన ధర్మాలు' అనే అంశం మీద పరిశోధన చేస్తున్నారు. భారతం ద్వారా ధర్మాన్ని ఎన్ని రకాలుగా పేర్కొన్నారు వంటి విషయాలను తనకు వెచ్చించిన సమయ పరిధిలో విశ్లేషించారు. మరో విద్యార్థి వక్త ఆవుల రేణుక. వీరు సత్యవతి కథా సంపుటిని గురించి సమీక్షించి పర్యవేక్షకుల మన్ననలు పొందింది. కవితాపఠనం చేసిన పులుమద్ది సత్యనారాయణ, తిరునగరి శరత్ చంద్రలు చక్కని వస్తుశిల్పాలు గల కవితలు చదివి అందరి ప్రశంసలు అందుకున్నారు. సమావేశాన్నంతా సమీక్షించిన డా॥ ఎస్.రఘు గారు, 2021 సంవత్సరంలో భాగంగా మొదటి సమావేశం నూతనంగా సాగిందంటూ మునుముందు ఇదే స్థాయిలో సాగాలని కాంక్షించారు. వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, మూసీ మాసపత్రిక పరివారం పాల్గొని విజయవంతం చేసినారు.

# తుకారాం అభంగం

నీ పాదములే మాకు కాశీ
పోదామందురెవరిక కాశీ

నీరూపు నీ ధ్యానము
ఇదే మాకు అనుష్ఠానము

నీ పాదములే మాకు గయా
విడిస్తిమి గయకు పోవునాశ

తుకా పలికే సకల తీర్థములు
నీ పాదముల నివాసముండగ




**అనువాదం : మంత్రి శ్రీనివాస్**
**పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.,**
**ఫోన్ : 83283 33720**

# అవిశ్రాంత సాహితీ పథికుడు - పద్మశ్రీ "ఆశావాది"

**అన్నమరాజు ప్రభాకర రావు,** హైదరాబాద్. ఫోన్ : **94402 58292**



**డా. ఆశావాది ప్రకాశ రావు గారికి 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించిన సందర్భంగా ...**

### పుట్టుపూర్వోత్తరాలు

ఒక ఉత్తమ ఉపాధ్యాయుడు, ఒక అవధాని, ఒక అవధానాచార్య, ఒక భాషావేత్త, ఒక మాతృభాషాసేవకుడు, ఒక కళారత్న, అన్నిటికీ మించి ఒక వినయమూర్తి, ఒక మానవతావాది. దేనికదే విశిష్ట లక్షణం కదా ! కానీ అన్నీ ఒకరిలోనే ఉంటే – ఒక అద్భుతం. ఒక ఆశావాది ప్రకాశరావు గారు. మనకు పూర్తి అవగాహన కలగాలంటే ......

ఆంధ్రప్రదేశ్ లోని అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లా సింగనమల మండలం పెరవలి గ్రామంలో ఒక నిరుపేద దళితకుటుంబానికి చెందిన శ్రీ పక్కీరప్ప శ్రీమతి కుల్లాయమ్మ దంపతులకు ఆగష్టు 2 వ తేదీ 1944 నాడు ఆశావాది గారు జన్మించారు.

వీరి విద్యార్థి జీవితమంతా అనంతపురంలోనే జరిగింది. మొదటి నుండి చివరిదాకా ఉపకారవేతనాలతో వసతిగృహాలలోనే కొనసాగింది. మొదట పట్టభద్రత పొంది ఏలూరు లోనే ఫ్లడ్ కంట్రోల్ గుమాస్తాగా కొంతకాలం పనిచేశారు. ఆ తరువాత ఆం. ప్ర. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా శాశ్వత తెలుగు పండిత ఉద్యోగం జిల్లాపరిషద్ ఉన్నతపాఠశాలలో పొందినారు. ఆ తరువాత స్నాతకోత్తర పరీక్షలో ఉత్తీర్ణులై ఆంధ్రోపన్యాసకులుగా పదోన్నతి పొందినారు. తదుపరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులుగా పదవీ విరమణ చేశారు.

### అవధాన జీవితం

వీరి తండ్రి గారైన శ్రీ పక్కీరప్ప గారు ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు. వీరు కందపద్యాలు వ్రాసేవారు. హైస్కూల్ విద్యార్థిగా నున్న ఆశావాది గారు ఈ విషయం తెలుసుకొని తాము కూడా తండ్రి వలె, వీలైతే వారిని మించిన పద్యాలు వ్రాయాలని అప్పుడే నిర్ణయించుకొని ఆ దిశగా ప్రయత్నించటం మొదలు పెట్టారు.

వసతిగృహాలలో ఉన్నప్పుడు కూడా సహవిద్యార్థులకు పద్యాలు వ్రాసి వినిపిస్తూ ఉండేవారు. ఇదే అలవాటు వారు డిగ్రీ చదువుతున్న రోజుల్లో కూడ ఉండింది. చుట్టూ విద్యార్థులను కూర్చోబెట్టుకొని నిషిద్ధాక్షరి, ఆశువు, వర్ణన, దత్తపది, సమస్య వంటి వాటిని అడిగించుకొని పూరించి ధారణ చేస్తూ ఉండేవారు. ఈ విషయం తెలిసిన ఆనాటి తెలుగు శాఖాధ్యక్షులుగా నున్న శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు గారు వీరిని తమ గదికి పిలిపించి "బాగా ప్రదర్శనలు చేస్తునట్లున్నావు. ఏదీ నేనొక సమస్య నిస్తాను పూరించు చూస్తాను" అని **"ప్రశ్న కు ప్రశ్నయె జవాబు భామిని పల్కెన్"** అనే కందపద్య పాదాన్ని ఇచ్చారు. ఇక్కడ దుష్కరప్రాస. అంతేకాక, "శ్న" అనే అక్షరం గల పదాలు చాలా అరుదు. అయినా ఆశావాది గారు తడుముకోకుండా **" ప్రశ్నలపై పది ప్రశ్నలు / ప్రశ్నించెడు తనదు భర్త భావంబేమో / ప్రశ్నించుచు తన యెదలో / ప్రశ్న కు ప్రశ్నయె జవాబు భామిని పల్కెన్"** అని పూరించారు. నండూరి వారు ఆశ్చర్యానందాలతో **"నీకు ఉపాయం ఉంది. అవధానిగా రాణించగలవు. తీరిక సమయాల్లో నేను శిక్షణ నిస్తాను"** అని యథాశక్తి అవధానవిద్యలోని మెళకువలు ఆశావాది గారికి నేర్పించారు. తరువాతి కాలంలో వీరు శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు గారి వద్ద "నిషిద్ధాక్షరి"లో మెళకువలు నేర్చుకున్నారు. ఆ తరువాత, వీరు అవధానారంగంలో తిరుపతి వేంకటకవుల తరువాత అంతటి ప్రశస్తి పొందిన శ్రీ సి.వీ. సుబ్బన్న శతావధాని గారిని ఆశ్రయించి, అవధానంలోని సమస్తమైన కిటుకులతో పాటు, అవధాన పద్యాల్లో కవితాంశాను చొప్పించటం, అవధానపద్యాలు క్షణికానందం కలిగించే విధంగా కాకుండా కలకాలం నిలవాలంటే పద్యనిర్మాణం ఎలా ఉ

ండాలనే విషయాన్ని కూడా సంపూర్ణంగా ఒంటబట్టించుకున్నారు. వీరు సుబ్బన్న గారు ఎక్కడ అవధానం చేస్తే అక్కడ ప్రత్యక్ష మయ్యేవారు. ఎంత దూరమైనా సరే. ఒక్కొక్కసారి కాలినడకన కూడా. అలా పూర్తి శ్రద్ధాభక్తులతో ఎంతో శ్రమకోర్చి అవధానారంగంలో తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకొని సుస్థిరపరచుకొన్నారు ఆశావాది గారు. ఆ క్రమంలో వీరు 170 అష్టావధానాలు ఒక ద్విగుణిత అష్టావధానం చేశారు. ఇవన్నీ వీరు రాష్ట్రంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా చేసి మెప్పించారు.

సభను కట్టిపడవేసే కవితాశక్తి, భాషా పాటవము, సమయస్ఫూర్తి, హాస్యచతురత, గానమాధుర్యము వీరి ప్రత్యేకతలు. వీరు శతావధానానికి ప్రయత్నించినా, అభిమానులు అష్టావధాన ప్రదర్శననే కోరుకున్నందువలన వీరు శతావధానం చెయ్యలేదు.

**వీరి అవధాన చాతుర్యానికి ఒకటి రెండు ఉదాహరణలు :**

(1) 1971 లో అనంతపురం లో వీరికి **"చీరనెత్తగ కన్పడెన్ సుమధురశ్రీ యుక్త సౌందర్యముల్"** అనే శార్దూల పాదమీయబడినది. అర్థము సుబోధకమే. ఆశావాది గారెంత చతురతతో ఇందులోని అశ్లీలతను తొలగించారో చూడండి. "స్మేరాంకూరము మొగ్గ దొడ్డ ననగా చిత్రంబులందీర్చి, యా / సారస్యంబులు జూప నొక్కెడ సభన్ సంధించి, రా కార్యమున్ / ప్రారంభింపగ వచ్చిన మంత్రివరు డా ద్వారంబునన్ వ్రేలు మేల్ / చీరనెత్తగ కన్పడెన్ సుమధురశ్రీ యుక్త సౌందర్యముల్" అని పూరించారు. చిరునవ్వులొలికే అందమైన స్త్రీల చిత్రపటాలను వ్రాసి ప్రదర్శనకు పెట్టారట, ఆ చిత్రకళాప్రదర్శనను ప్రారంభించటానికి వచ్చిన మంత్రిగారు ద్వారమున నున్న చీరె (పరదా – కర్టెన్) పైకెత్తగా అద్భుతమైన (చిత్రకళా) సౌందర్యాలు కనిపించినాయట. ఎంత సమయస్ఫూర్తి, ఎంత చాతుర్యమో కదా.

(2) అలాగే ఒక దత్తపదిని చూద్దాము. అనంతపురంలోనే 1988 లో ఒక అవధానంలో "హీరో, జీరో, సారో, న్యారో" అన్న ఆంగ్లపదాల నిచ్చి అన్యార్థంలో ఆంధ్రభాషాయోషాను వర్ణింపుమన్నారు. వెంటనే వీరు **"హీరోదంచిత భాసమాన ముఖమై, హృద్యాతిశాయిత్వ మం / జీరోత్పన్న నినాదయాన పదమై, శృగార సందీప్తమై / సారోదార నిగూఢ భావభరమై, సత్యాశ్రయ స్నిగ్ధ మా / న్యారోప స్ఫుటపీఠమైన తెనుగే నర్చింతు నెక్కాలమున్"** అని చంపకమాలలో పూరించారు. హీరో వజ్రం, మం"జీరో" కాలి పట్టాలు, "సారో"దార నిండైన, "మాన్యంఆరోప సంస్తుతి పాత్రమైన. అంతే. అయిపోయింది.

వీరి పద్యకవితాప్రతిభను ప్రశంసిస్తూ వీరి గురువులైన శ్రీ నందూరి వారు **"పద్యకవితలోన ప్రతిభుం దాశావాది / పంచమస్వరాన పలుకుచుండు / ఆతడారితేరె నవధాన కళయందు / శ్రీ ప్రకాశరావు చిన్మయుండు"** అన్నారు. ఇటువంటి "గురుప్రశంస" కంటే మించిన దేముంటుంది.

**రచనలు**

డా. ఆశావాది గారి ప్రతి రచనా ఒక పరమ పరాప్రయోజనాన్ని ఆశించి చేసిన ప్రయోగమే. ఇతరులకు భిన్నంగా, వీరు నిర్వహించిన అవధానాలను గానీ, ప్రసంగాలను గానీ వీరు గ్రంథస్థం చేశారు. ఇవి కాక వీరు స్వతంత్రంగా చేసిన రచనలు. ఒక్కసారి వీటిని పరిశీలిద్దాం.

తొలుత వీరు ఎం.ఏ.విద్యార్థిగా నున్నప్పుడు వెలువరించిన "వరదరాజశతకం" మొదటిది. ఇది తరువాతి కాలంలో "లోకలీలా సూక్తం" గా రూపాంతరం చెందింది. "శ్రీరామకథకలశం" ఆశు ప్రక్రియకు చెందింది. తరువాత గ్రంథరూపాన్ని సంతరించుకున్నది. మిగిలినవి ఇలా ఉన్నాయి.

(1) అవధాన సంపుటులు – స్వీయ అవధానానుభవాలు (2) మెరుపు తీగలు – పండితారాధన (3) చెళ్లపిళ్లరాయచరిత్రము – తాళపత్ర పరిశోధన సిద్ధాంత గ్రంథము (4) ఘోషయాత్ర – పూర్వకవి కృతి పరిష్కరణము (5) ప్రహ్లాదచరిత్రము – ఎఱ్ఱన పోతన తులనాత్మక పరిశీలన (6) చిత్రకవితావతంస మొదలైనవి – సాహిత్యవిమర్శనము (7) సమారాధన – సాహితీమూర్తుల పరిచయాలు (8) జ్యోతిస్సుప్రభాతము, పోతనభాగవతము – అనువాదాలు (9) అంతరంగతరంగాలు (హిందీ లోనికి అనువదించ బడింది) – వచనకవితా సంపుటి. (10) విద్యాభూషణ, బి.ఆర్.అంబెద్కర్ ఆలోచనాధార, వివేకపునీత నివేదిత (పద్యకావ్యం) –జీవిత చరిత్రలు (11) మాలదాసరి – భక్తి రసము (12) సంత్ రవిదాస్ సందేశ సంహిత, నారాయణశతకము – తాత్త్విక గ్రంథాలు (13) తెలుగు పద్యకవిత ప్రస్థానం (14) శ్రీ హనుమత్ స్తోత్రమంజరి, శ్రీ సుబ్రహ్మణ్య స్తోత్ర కదంబం – స్తోత్రసంకలనాలు (15) సుబోధినీ వ్యాకరణము (16) ప్రత్యూష పవనాలు, ప్రసారకిరణాలు – ఆకాశవాణి ప్రసంగాలు (17) సువర్ణగోపురం – సభాముఖంగా చేసిన ప్రసంగాలు. ఇవి కాక, కేవలం భాగవతం మీద చేసిన ప్రసంగాలనే "భాగవత సౌరభాలు" గా ప్రచురితం అయింది. ఇది ద్వితీయ ముద్రణ కూడా పొందింది. ఇంకా శ్రీ చెప్యాల రామకృష్ణారావు గారి భర్తృహరి వైరాగ్యశతి పద్యానువాదానికి తాత్పర్యవ్యాఖ్య చేసినారు. ఇవన్నీ కూడా తెలుగు విద్యార్థులకు పద్యకవులకు, అవధానులకు, అంతెందుకు తెలుగు సాహితీలోకంలో ప్రవేశించి నిలద్రొక్కుకోవాలనుకొనే ప్రతివారికీ కరదీపికలు. వీరు స్వయంగా 62 గ్రంథాలు వ్రాయగా, వీరి మీద, వీరి సాహిత్యం మీద 20 కి పైగా గ్రంథాలు వచ్చినాయి. వీనిలో తలమాణికమైనది శ్రీ మంకాల రామచంద్రుడు గారు (ఇప్పుడు కీర్తిశేషులు) పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంతగ్రంథానికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము వారు పి.హెచ్‌డి. పట్టా ప్రదానము చేసినారు.

**సాహిత్యసేవ**


వీరు ఉద్యోగరీత్యా వెళ్లిన ప్రతి ఊరిలోనూ సాహిత్య కార్యక్రమాలను చేపట్టే వారు. ప్రతిచోటా క్రొత్తగా సంస్థలను స్థాపించటమో లేదా అప్పటికే ఉన్న సంస్థలలో చేరి వాటిని పరిపుష్టం చెయ్యటమో చేసేవారు. ఏమైనా వీరు ఎదో ఒక సంస్థ ద్వారా సాహితీ కార్యక్రమాలు నిర్వహించకుండా ఉండలేరు. వీరు ప్రథమంగా 1970 లో అనంతపురంలో "రాయలకళాగోష్ఠి" అనే సంస్థను స్థాపించి చాలా విజయవంతంగా నిర్వహించినారు. తామెక్కడ ఉన్నా తమ సలహాలూ సూచనలను తగు విధంగా అందజేసి సంస్థ కార్యక్రమాలు కుంటుపడకుండా చూసేవారు. ఇలా దాదాపు 20 కి పైగా సంస్థలను స్థాపించారు. ఈ సంస్థల ద్వారా వారు గుర్తింపునకు నోచుకోని చాలామంది విద్వత్కవుల రచనలను ప్రచురించి ఆవిష్కరించి వారిని ప్రోత్సహించేవారు. ఎప్పుడూ కూడా వీరు తమ స్వంత పుస్తకాలు ముద్రణ చేయించుకోలేదు. వీరు స్వయంగా తమ కుటుంబం పక్షాన **"ఆశావాది సాహితీ కుటుంబం"** అనే సంస్థను స్థాపించి ప్రతియేడు ఒక రచయితను, పద్యకవిని, ఆధ్యాత్మిక వేత్తను, మహిళా రచయిత్రిని సన్మానిస్తూ ఉంటారు. ఆర్థికస్థోమత లేని వారి గ్రంథాలను ఆవిష్కరింపజేస్తూ ఉంటారు. తమ స్వగృహంలోనే కొన్ని వేల పుస్తకాలను ఉంచి, ప్రరిశోధక విద్యార్థులకు అందుబాటులో ఉంచారు.

వీరి "తనువునందారూఢి యున్నప్పుడే", మస్తిష్కం ఇంకా చురుగ్గా ఉన్నప్పుడే, ధారణాశక్తి పటిష్టంగా ఉన్నప్పుడే, పూర్తి శక్తియుక్తులతో అవధానం చేసి సభలను రంజింపజేయగల్గి నప్పుడే, వీరు అవధానాలను మాని వేశారు. కారణం చాలా చాలా ఆశ్చర్యకరం. తాము చేస్తున్న సాహిత్యసేవకు – సాహిత్యసంస్థలను స్థాపించటం, వర్థిష్ణువులైన కవుల గ్రంథాలు ప్రచురించటం, ఔత్సాహికులను అవధానులుగా, పద్యకవులుగా తీరిదిద్దటం, నిరుపేద కవుల గంథాల ప్రచురణ, ఆవిష్కరణ మొదలైన వాటికి తమ అవధానవ్యాసంగము అడ్డు వస్తున్నాయని భావించి వీరు తమ 55 వ యేటనే అవధానాలు మానివేశారు. కానీ అవధానారంగం నించి నిష్క్రమించలేదు. అవధాన సభలకు అధ్యక్షత వహిచటం వంటివి చేస్తూ ఉండేవారు. పరులకు గ్రంథరచనలో తోడ్పడుతూ ఉన్నారు. ఇటీవల వెలుగు చూసిన రాపాక ఏకాంబరాచార్యుల వారి "అవధాన విద్యా సర్వస్వము" అనే పరిశోధనాత్మక (సిద్ధాంత) గ్రంథ నిర్మాణంలో వీరి కృషి ఎంతైనా ఉంది.

వీరు సరస్వతీ కటాక్షము పొందిన వారు. తమ విద్య తమతోనే ఆగిపోకుండా అనేకులను అవధానులుగా తయారు చేసినారు. నా వంటి కొన్ని వందలమందిని పద్యకవులుగా దిద్దినారు.

### సభలు / సత్కారాలు / సన్మానాలు / బిరుదులు

వీరు వెయ్యికి పైగా సభలలో అవధానిగానో, అధ్యక్షులుగానో, సంచాలకులుగానో, విశిష్ట / ఆత్మీయ అతిథి గానో, సన్మాన గ్రహీతలు గానో పాల్గొన్నారు.




వీరికి వందలకొలది సన్మానాలు, పురస్కారాలు లభించాయి. వీరు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలనుండి పాతికకు పైగా బిరుదుల నందుకొన్నారు. అయినా, వీరికి ఇప్పటిదాకా ఇష్టమైనవి (1) ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ వారి "ఉత్తమ ఉపాధ్యాయ" (2) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి "కళారత్న" (3) పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము వారి "డాక్టరేట్ (డి.లిట్), బద్దెన కళాపీఠం (బద్వేల్) వారి "అవధానాచార్య" మాత్రమే. ఇప్పుడు కేంద్రప్రభుత్వం వారు ప్రకటించిన **"పద్మశ్రీ"**.

### ముగింపు

ఒక చేతిలో బ్రీఫ్కేసుతో మరొక చేతిలో పుస్తకాల సంచీ మోసుకుంటూ **మానవాకృతి నొందిన సత్త్వగుణమో, సరస్వతీ దేవియో నడుస్తున్నట్లుగా కన్పించే అలుపెరుగని "అనంత" సాహితీ మార్గగామి శ్రీ ఆశావాది ప్రకాశరావు గారు.** తెలుగు సాహిత్యరంగంలో స్వయంగా లబ్ధప్రతిష్టులైనా, కవిగరిష్ఠులైనా, అవధాన వరిష్ఠులైనా, ప్రతి ఒక్కరినీ తన, పర వత్యాసం చూపకుండా మధురదరహాసంతో, ప్రియవచనాలతో పలుకరించే "పూర్వభాషి", అమృత హృదయులు, సాధు, స్వాదు మనస్వి. నేటికీ సంప్రదాయ కవిత్వానికి తెలుగునాట నిలువెత్తు నిదర్శనం శ్రీ ఆశావాది.


పూర్వకవులను, పితృసమకాలికులను, నిజసమకాలికులను, కుమార సమకాలికులను ఆరాధనాభావంతో స్మరించటం, మెచ్చుకొనటం, ఆశీర్వాద ప్రోత్సాహాల నందించటం వీరి జీవలక్షణం. "మెరుపుతీగలు" అనే ఒక ప్రత్యేక గ్రంథాన్ని సంతరించటమే వీరి యీ లక్షణానికి ఒక ప్రబల సజీవ తార్కాణం.

వీరు దాదాపు తమ 30 వ యేట నుండే తాము చిరకాలం సాహితీ లోకంలో గౌరవ పురస్కారాలతో మనగలగాలంటే ఎటువంటి కవిత్వం అవసరమో, ఎటువంటి జీవనవిధానం అవసరమో లోకంలో, పండితలోకంలో తమ పాత్ర యేమిటో, తాము చేయవలసిన సేవ ఎటువంటిదో గుర్తించి ఒక నిర్ణయానికి వచ్చిన మహానుభావులు. అప్పటినుండి దాదాపు అర్ధశతాబ్దం పాటు ఆ రీతిలో, ఒకే రీతిలో, ఆ దారిలో, ఒకే దారిలో రవంతైనా తొణకకుండా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా బెణకకుండా జీవించటం సాధనచేసి దాన్నే










తమ లక్షణంగా మలచుకున్నారు. ఇప్పటికి వీరిని ఒక జాతీయస్థాయి ప్రభుత్వ పురస్కారమైన "పద్మశ్రీ" వరించింది. ఈ పురస్కృతిని గాంచిన శిష్యులు, అభిమానులు పరమానంద భరితులైనారు. ఇది సహజం. సమకాలము బారు, ప్రత్యేకించి అవధానారంగం లోని వారుకూడా ఈ పురస్కారం తమకే దక్కినట్లుగా పారితోషించినారు. ఇది శుభపరిణామం.

**సీ. సంఖ్యకు మిక్కిలి సమ్మానము లతని -**
**జేరి మున్నెఱుగని పేరుగాంచె,**
**సంఖ్యకు మిక్కిలి సభ లతడుండుట -**
**జేసి సభ్యత నంది వాసికెక్కె,**
**సంఖ్యకు మిక్కిలి సచ్ఛాత్రు లతనిదౌ -**
**దేశికత్వాన సత్తేజులయిరి,**
**సంఖ్యకు మిక్కిలి సద్గుణాఢ్యు లతని -**
**వినయమారసి సద్వివేకులయిరి,**
**తే.గీ. సర్వదైవీగుణ విభావసరణి బూని**
**సర్వమానవ సమతయె నిర్వివాద**
**జీవలక్షణముగ గురుశ్రీ యుతులగు**
**గురులకు గురు దాశావాది కూర్మి గొలుతు**

**తే.గీ. అట్టి సద్యశుడౌ గురు ననుభవంబు**
**సాహితీసేవ, శిష్యపోషణ, మమోఘ**
**వినయ సౌశీల్యములు నేడు వినుతికెక్క**
**కోరి చేరె " పద్మశ్రీ" యె వీరి నిపుడు**

**కం. ఇట్టివి, ఇంతకు మించిన**
**యట్టివి మా గురు పదముల నంటును నికపై**
**నెట్టెన, పండితులందరు**
**గట్టిగ పొగడంగ నొక్కొకటిగన్ వరుసన్**

ఈ సందర్భంగా మా గురువుగారిని గురించి యీ వ్యాసం వ్రాసే సదవకాశం కలిగినందులకు అమితానందమొందుతూ, కల్పించినందులకు "మూసీ" పత్రిక యాజమాన్యానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

**(ప్రముఖ సాహితీవేత్త, అవధాని డా. ఆశావాది వారికి ప్రభుత్వం 'పద్మశ్రీ' ప్రకటించిన సందర్భంలో ...అభినందన శతం... మూసీ..)**

---

**ఒక్కడివై పోతావు**

పోయినవాడు చెప్పకుండా పోతున్నాడు
ఉన్నవాడు వాడికోసం ఏడుస్తున్నాడు
రేపు వీడూ పోతాడు
అందరూ ఇలా పోతే వీళ్ళకోసం
ఇక దేవుడొక్కడే కూర్చుని ఏడవాలి తన బిడ్డలకోసం!

**సమస్య**

తండ్రిలేనివాడు తల్లిని చూచుకొని
తృప్తి పడుతాడు
తల్లి లేనివాడు భార్యను చూచుకుంటాడు
కానీ ఒకే వ్యక్తి తల్లీ – చెల్లీ –
తండ్రి – భార్య కావటమే అసలు సమస్య

**ఓ దీపమా!**

ఓసి! మనోజ్ఞ కుంతల మహోజ్జ్వల కోమల దివ్యదీపమా!
వేసవిలోన చల్లనగు వీవనలిచ్చిన చంద్రతాపమా!
భాసుర మానవీయ కులపాలికవౌ శక్ర చాపమా!
నీసరి యేరి భవ్యరమణీమణి! సంగమతీర్థజా! ఉమా!

**అందుకొనుమా!**

అర్హతలేని నాకెటుల అందలమబ్బును! నిర్జనావనీ
బర్హిసటింపగా పికము పాడిన నెవ్వరు చూతురయ్యా – నా
గర్హ మయంబు జీవనము – కాంచనరేఖవు నీవు ఓ ఉమా!
అర్హణ మందుకొమ్ము సుమహారము చందన పల్లవంబుతో..

**(ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ ...**
**చందనశాఖి.. స్మృతి కావ్యం ... నుండి)**

# జానపద హాస్య గేయాలు - అధ్యయనం

డా॥ బొలుగాని శోభన్ బాబు, హైద్రాబాద్. ఫోన్ : 9701181271

"వాక్య రసాత్మకం కావ్యం", "విశ్వశ్రేయః కావ్యం" అనునవి అలంకార శాస్త్ర మర్యాదననుసరించి వెలువడిన వాక్యములు. రసానందంతో పాటు సందేశాత్మకత ఇమిడి ఉండటం జానపద సాహిత్య లక్షణం. జానపద హాస్యగేయాలు కూడా ఇందుకు ఏమాత్రం తీసిపోవు. జానపద హాస్యగేయాలను కేవలం రసానందం కొరకే కాక వివిధ కోణాలలో పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలియజేయటం ఈ వ్యాసరచన ప్రధానోద్దేశం.

**యేమాయావో పెండ్లి కొడుకా యెంత కీరితి తెస్తివీ**
**పొంత కాగిన నీళ్ళు మేము పోసి చూస్తామంటిమీ ॥యే॥**
**తొట్టిలోని ముసురు నీళ్ళూ నాకి కావలెనంటివీ**
**సన్నబియ్యం కోడిపెట్టా మేము పెడతామంటిమీ ॥యే॥**
**రాగిముద్దా వులవచారా నాకి కావలెనంటివీ**
**తూగుటుయ్యెల వొరుగు దిండూ మేము యిస్తామంటిమీ॥యే॥**
**పాతచాపలు పంచటరుగులు నాకి కావలెనంటివీ**
**పట్టెమంచం లేవు దిండూ మేము యిస్తామంటిమీ ॥యే॥**
**నులకమంచం కమిటికోరీ నాకి కావలెనంటివీ**
**పచ్చిబోగం చిన్నదాన్నీ పక్కనేస్తామంటిమీ**
**యెంట జాకిన గుల్లి కుక్కా నాకి కావలెనంటివీ ॥యే॥**

బువ్వం బంతి సరసాలలో ఇది ఒక విసరు. పెండ్లి కుమారుని యందు ఇటువంటి అల్పబుద్ధులను ఆరోపించి పెండ్లి కుమార్తె వంక పేరంటాండ్రు వియ్యపు మేలములాడుదురు. ఇందులో పెండ్లి కొడుకు ఆలంబన విభావం. అతడి విపరీత చేష్టలు ఉద్దీపన విభావాలు. పెండ్లికొడుకు పొంత కాగిన నీళ్ళకు బదులు తొట్టిలోని ముసురు నీళ్ళు కోరడం, సన్నబియ్యం కోడిపెట్టకు బదులు రాగిముద్దా వులవచారు కోరడం, తూగుటుయ్యెల వొరుగు దిండుకు బదులు పాతచాపలు, పంచటరుగులు కోరడం, పట్టెమంచం లేపుదిండులకు బదులు నులకమంచం కమిటీకిరీ (చీలికలు పేలికలయిన కంబలి) కోరడం, పచ్చిబోగం చిన్నదానికి బదులు యెంట జాకిన (సాకిన) గుల్లికుక్కను కోరడం ఆ విపరీత చేష్టలు. అందుకే ఆ పెండ్లికొడుకు అపకీర్తికి ఆటపట్టయినాడు. నిజంగా ఇవి వింత చేష్టలు. అతని అల్పబుద్ధికి తార్కాణాలు. కాబట్టి హాస్యరసం ఉత్పన్నమయింది.

జానపదులు తమకున్నా లేకున్నా అల్లుళ్ళకు ఇచ్చే అతిథి మర్యాదలు ఈ గేయంలో ప్రతిబింబించాయి. నిజానికి ఈ గేయం వాచ్యార్థం హాస్య జనకమైనా వ్యంగ్యార్థం ఎంతో సందేశాత్మకం. పెండ్లి కొడుకుకు ఆపాదించిన అల్పబుద్ధులు అతని నిరాడంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనాలు. అతని అలవాట్లను కొన్నింటిని



మనం ఆచరించవలసిన అవసరం ఉందని ఈ గేయం పరోక్షంగా తెలియచేస్తుంది.

వేన్నీటి స్నానం కంటే చన్నీటి స్నానం ఆరోగ్య ప్రదాయిని. అలాగే సన్నబియ్యం అన్నం కంటే రాగి సంకటి మిక్కిలి ఆరోగ్యప్రదాయిని అని నేడు తరచుగా వినవస్తున్న మాట. ఎందుకంటే రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, జొన్నలు మొదలైన వాటిలో పీచు పదార్థాలు అధికం. తద్వారా అవి మంచి జీర్ణకారులు. జీర్ణాశయాన్ని ఎప్పటికప్పుడు అవి శుద్ధి చేస్తాయి. జీర్ణాశయమొక్కటి సరిగా ఉంటే మిగతా వ్యాధులన్నీ మటుమాయమవుతాయి. సన్నబియ్యం మనం వదిలించుకోలేని జాడ్యం. రాగి సంకటి, కొర్రబియ్యం, జొన్నరొట్టె మొదలైన ఆహార పదార్థాల ప్రస్తావన హాస్య గేయాలలో తరచుగా కనిపిస్తుంది.

జానపదులు తమ తమ బంధువులకిచ్చే అతిథి మర్యాదలలో మాంసాహారం కూడా ఒకటి. ఈ గేయంలో కోడిపెట్ట మాసం ప్రస్తావన ఉంది. కూతపెట్టి ఈడు వచ్చిన పుంజు మాంసం మంచి ఆహారం. శుభ్రమైన రక్తమును పుట్టించును. వాతరోగమును, కడుపునొప్పిని పోగొట్టును. సమశీతోష్ణముగా ఉండును. నీరసంగా ఉన్నవారికి, జబ్బుపడి కోలుకుంటున్నవారికి అనుకూలంగా ఉండి

బలము చేకూర్చును. యౌవనంలో ఉండే కోడిపుంజు మాంసం అధిక సత్తువ, వీర్యవృద్ధి, దేహకాంతి, బుద్ధిబలాన్ని ఇచ్చును. కోడిపెట్ట మాంసం చమురు కలిగి రుచిగానూ, గురుత్వము గలిగి శ్లేష్మములను పోగొట్టును. వీర్యమును పుట్టించును. కండ్లకు మంచిది. అదేవిధంగా ఉలవలు మిక్కిలి కాక, పైత్యము చేయును. ఉలవలు నేరుగా తినడం కంటే చారు చేసుకొని తినడం శ్రేయస్కరమని సకలవస్తు గుణదీపిక చెప్తుంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్లు మోతాదు మించిన ప్రతిదీ హానికరమే. మొత్తానికి తమ సంతానం సత్వగుణ సంపన్నులు కావాలనుకొనేవారు సాత్వికాహారం తీసుకోవడం శ్రేయస్కరం. రజోగుణ భూయిష్టాలైన మాంసాహారానికి దూరముండటం మంచిది. అదేవిధంగా మిగతావాటిని అన్వయించుకోవచ్చు. తూగుటుయ్యెలపై కంటే చాప వేసుకొని నేలపై పడుకోవడం ఆరోగ్యదాయకమని అందరికీ తెలిసిన విషయమే.

ఇక చివరగా నులకమంచం. పట్టెమంచాలకు అలవాటు పడ్డాం మనం ఈరోజుల్లో. వాటికి తోడు ఎత్తైన దిండ్లు. నులకమంచం అంటే తెలియనివాళ్లు నేటికాలంలో చాలామంది ఉన్నారు. నవారు మంచం నులకమంచాన్ని మింగివేసింది. పట్టెమంచాలు నవారు మంచాలను మింగివేసాయి. నులకమంచం గొప్పతనం తెలియాలంటే నులకమంచమే మంచి ఉదాహరణ. నా అభిప్రాయం ప్రకారం నులకమంచం సర్వరోగ నివారిణి. అది ఆక్యుప్రెషర్, రిఫ్లెక్సాలజీలను తనలో గర్భీకరించుకొన్నది. చైనీయులు, జపనీయులు మొదలైన ఇతర దేశీయులు తమ తమ ఆరోగ్యం కోసం ఉపయోగించే ఆక్యుప్రెషర్ వంటి వైద్యవిధానాలను ప్రత్యేకంగా చేయాల్సిన పని లేదు. నులకమంచంలో నిద్రిస్తే చాలు. అలాగని ఎత్తైన బొంతలు పరచకూడదు. చాలా పలుచని వస్త్రాలు మాత్రమే పరచాలి. ఈ విషయమే ఈ గేయంలో తెలుపబడింది.

ఇక ఈ గేయంలోని చివరి చరణాలు మితిమీరిన శృంగారం మంచిదే కాదనే విషయాన్ని నొక్కి చెబుతున్నాయి. కుక్క మాత్రమే కాదు ఏ జంతువయినా ఋతుమంతి కాలంలోనే కలుస్తుంది. కాని మానవులు అందుకు అపవాదు. 'యెంట జాకిన గుల్లి కుక్కా నాకి కావలెనంటివి' అని అనడంలో ఎంత నవ్వొస్తుందో 'కుక్క దానం పట్టి ఐనా కుటుంబాన్ని పోషించాలి' అనే సామెతను దీనికి అన్వయించుకుంటే అంత ఆశ్చర్యం వేస్తుంది. వీటిననుసరించి ఆ పెండ్లికొడుకు కీర్తి తెచ్చినవాడే. ఈవిధంగా ఈ గేయంలో సందేశాత్మకత ఎంతో.

మరొక గేయాన్ని చూద్దాం. అనుకొనని వంచనమున కూడ వికృతి కలిగి నవ్వు పుట్టును. మొదట ప్రియవచనములుగా తోచి తరువాత మెల్లగా అప్రియములు భాసించిన సున్నితమగు హాస్యము పుట్టును. ఇటువంటి వాక్చమత్కారమును 'ఛల'మందురు. 'అన్యార్థమేవ వాక్యం ఛలమభిసంధాన హాస్య రోషకరమ్' అని భరతనాట్యశాస్త్రం పేర్కొంది. ఛలము గల జానపద గేయమునకు ఉదాహరణ.

**"అంతే నాకు చాలు తమ్మలపాకు తొడిమే పదివేలు**
**అందరివోలె అడిగేదాన్ని కాను, కొందరివోలె కొసరేదాన్ని గాను"**

మొదటనే ప్రియరచనములాడిన స్త్రీ ఎంతో సౌశీల్యవతి అనుకొందుము. తర్వాత మెల్లగా ఆమె అప్రియములను దొరకొనును.

**"ముక్కుకూ ముక్కెర లేక, ముక్కు చిన్నబోయినాది**
**నీ ముగ్గురూ బిడ్డాలనమ్మీ, ముక్కుకూ ముక్కెర తేరా ॥అంతే॥**
**చేతులకు చెండీలు లేక, చేతులు చిన్నబోయినాయి**
**నీతోడి చెల్లెండ్లనమ్మీ, చేతులకు చెండీలు తేరా ॥అంతే॥**
**కాళ్ళకూ కడియాలు లేక, కాళ్ళు చిన్నబోయినాయి**
**నీ కన్నతల్లి నమ్ముకోని, కాళ్ళకూ కడియాలు దేరా ॥అంతే॥**
**నడుముకూ వడ్డాలం లేక నడుము చిన్నబోయినాది**
**నీ నల్గురూ కొడ్కులానమ్మి, నడుముకు వొడ్డాలం దేరా ॥అంతే॥**
**మెడకు కంటేను లేక మెడ చిన్నబోయినాది**
**నీ మేడలన్నీ అమ్ముకోని, మెడకు కంటేలు దేరా ॥అంతే॥**
**పట్టెమంచం పరుపూ లేకా మనసు చిన్నబోయినాది**
**నీ సూటుబూటు నమ్ముకోని, పట్టెమంచం పరుపుదేరా ॥అంతే॥**

చివరి చరణంలో సూటుబూటులుండుటచే ఈ పాట ఆధునికమై ఉండును. లేదా ఈ భాగము ప్రక్షిప్తమై ఉండును. తమలపాకు తొడిమయే పదివేలుగా భావింతునని తొలుత ప్రియములు పల్కిన స్త్రీ తర్వాత తనకు కావలసిన భూషణాలు, వస్తు వాహనాలు పెద్ద పట్టికగా నిచ్చి వాటికై బిడ్డలను తల్లిదండ్రులను వేడ మిద్దెలనమ్ముమని అప్రియములాడుతున్నది. ఇట్టి ఛలము మనకు నవ్వు పుట్టించునని బిరుదరాజు రామరాజుగారు (పుట. 559) ఇచ్చిన వివరణ శిరోధార్యం. ఇదే గేయం కొద్దిపాటి మార్పులతో రుక్నుద్దీన్‌గారి గ్రంథంలో (పుట. 283) కలదు. గమనించగలరు.

హాస్య రచనల్లో అధిక్షేప రచన గొప్పదంటారు. వ్యక్తినో, జాతినో అతి సున్నితంగా అవహేళన చేయడం వీటి పని. అయితే జానపద గేయాల్లో ఇటువంటి ఉదాత్త హాస్యాన్ని ఆశించడం అత్యాశే అవుతుంది. జానపదుల హాస్యం ఉదాత్తమైంది కాకున్నా సజీవమైంది. (పు. 77) అని ఆర్వీయస్ సుందరంగారు పేర్కొన్న విషయాలు ఇక్కడ స్మరించుకోదగినవి.

జానపదుల హాస్యంలో అధిక్షేపం ఎంతవరకు ప్రతిఫలించిందో లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. పై గేయంలో అధిక్షేపం వేయి విధాలుగా విస్తరించింది. ఇదే గేయాన్ని వివిధ కోణాలలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నేను ఇవ్వబోయే వివరణలకు విపరీతార్థాలు తీయకుండా విజ్ఞులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఈ గేయానికి ఒక జారిణి ఆలంబనం అనుకుంటే సామాజిక రుగ్మతలు ఉద్దీపన విభావాలు. స్త్రీ కాముకత పురుషుడు వదిలించు కోలేని జాడ్యం. విటులు స్త్రీమాయలో పడకూడదనే సామాజిక సందేశం ఇందులో ఉంది. అంతేకాకుండా వ్యసనపరుడు ఎంతవైనా దిగజారుతాడనడానికి ఈ గేయం నిలువెత్తు సాక్ష్యం. రావణుడికున్న స్త్రీ కాముకత అతడు పతనమయ్యాడు. కాని నింద మాత్రం అతడి చెల్లెలైన శూర్పణఖకు దక్కింది. బహుశా దీనిని అనుసరించే కాబోలు జానపదులలో **'చేసిన చేష్టలు ఎవరూ చూడరు కాని, కోసిన ముక్కు అందరూ చూచినారట'** అనే సామెత వెలువడి ఉంటుంది. ఈ సామెత శూర్పణఖ పర పురుష వ్యామోహాన్ని కూడా తెలియజేస్తుంది. మొత్తానికి రామరావణ యుద్ధం 'ముక్కు + ఎర' మూలంగా సాగింది అని రామాయణ కథా సారాన్ని రంగరించి నిక్షిప్తం చేశాడు కాబోలు జానపదకవి (మొదటి చరణంలో).

ఇక్కడ రావణుడిని కూడా తప్పు పట్టాల్సిన పని లేదు. సీతను చెరపట్టినా బలాత్కరించని ఉత్తముడు రావణుడు. అటువంటి రావణుడు శూర్పణఖ పరపురుష వ్యామోహాన్ని సహించి ఉంటాడా! ఆలోచించాల్సిన విషయం. ఏదేమైనా చెల్లెలి ముక్కు కోసినందుకు ప్రతీకారంగా రామలక్ష్మణులతో యుద్ధం చేశాడు. తన పుత్రుడైన మేఘనాథునితో పాటు పుత్రతుల్యులైన తమ్ములిద్దరిని (కుంభకర్ణుడు, విభీషణుడు) దూరం చేసుకున్నాడు. రావణుడికి చెల్లెలుపై గల వాత్సల్యం అంతటిది. (రాక్షసులలోను మమతానురాగాలున్నాయి. మనుషుల్లోను కరువవుతున్నాయి). తద్వారా రామాయణం అవశ్య పఠనీయమని సందేశం. ఈ లెక్కన ఈ గేయం కదళీపాకమని చెప్పక తప్పదు.

ఇంకా చెప్పాలంటే కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పులు ఇందులో ప్రతిబింబించాయి. బిడ్డలనమ్మడం, కూతుళ్ల నమ్మడం కన్యాశుల్కంపై అధిక్షేపం. కొడుకులను అమ్మడం వర విక్రయంపై అధిక్షేపం అనవచ్చు.

ఎవర్నీ గుడ్డిగా నమ్మకూడదు అని ఈ గేయం మనకిచ్చే మరో సందేశం. కూతురు అని కుంచెడిస్తే - కన్నతల్లి అని కంచెడు పెట్టిందట; కొడుకు కలిగినంత కులముద్ధరించునా; అత్త లేనమ్మ ఉత్తమురాలు - మామ లేనమ్మ మరీ భాగ్యశాలి; దీపమున్నపుడె ఇల్లు చక్కబెట్టుకోవాలి; తన సొమ్ము అల్లం - పెరవారి సొమ్ము బెల్లం; మొదలైన సామెతలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటే ఈ గేయ సౌందర్యం మరింత ఇనుమడిస్తుంది.

ఇదే గేయాన్ని మరో కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. కుటుంబ నిర్వహణలో భర్త బాధ్యత ఎంత ఉంటుందో భార్య బాధ్యత కూడా అంతే ఉంటుంది. సోమరిపోతైన తన భర్తను దెప్పి పొడుస్తూ ఒక గడుసైన ఇల్లాలు ఇలి పల్కింది కావచ్చు. ఆ భర్త కుటుంబంలోని అందరి మీదా ఆధారపడతాడు కానీ ఎటువంటి పని చేయడు కాబోలు.



అందుకే ఈ గేయం అనుకుందాం. నా ముక్కెరను అమ్మినావు, చెండీలు అమ్మినావు, కడియాలు అమ్మినావు, వొడ్డాలం అమ్మినావు, ఇలా అన్నింటినీ అమ్మినావు. నిన్నేమీ అనకపోతే కూతుళ్లనమ్ముతావు, చెల్లెల్లనమ్ముతావు, చివరికి నన్ను అమ్ముతావు అని దెప్పి పొడిచిందేమో ఆ ఇల్లాలు. ఈవిధంగా ఇందులోని వస్తుధ్వని ఇంతని ఇదమిత్థంగా చెప్పలేము. ఈ సందర్భంలో హాస్యానికి రౌద్రరసం అంగరసంగా భావించవచ్చు. "పరువు దప్పిన బతుకురోత, సతికి చాలని పురుషుని బతుకు రోత" అనే సామెతను ఈ సందర్భంలో గుర్తు చేసుకుంటే ఈ గేయ సౌందర్యం మరింత ఇనుమడిస్తుంది.

ఇంకా చెప్పాలంటే ముక్కెర పోతే పోయింది, ముక్కు పచ్చలారని బిడ్డలను పట్టించుకోవు. చెండీలు పోతే పోయాయి. చెల్లెల్ల పెళ్ళిళ్లు చేయవు. కడియాలు పోతే పోయాయి. కన్నతల్లి పాదాలను నమస్కరించవు. ఒడ్డాలం పోతే పోయింది, కొడుకుల ఆకలి తీర్చవు. (రుక్నుద్దీన్‌గారు పేర్కొన్న గేయంలో 'నాగటీ రెండెడ్లనమ్మి నడుముకు వొడ్డాలం దేరా' అనడంలోనూ ఇదే వ్యక్తమవుతుంది. కడుపు నిండుగా ఉండటం అసలైన ఆభరణం. చాలా చక్కటి భావన). కంటె పోతే పోయింది. కట్టుకున్నదాన్ని కనుకరించవు. ఇల్లిల్లు తిరుగుట మానవు. నాతో సరసమాడవు. ఆయా స్త్రీలు నీ ఆస్తిపాస్తులు, అందచందాలు, ఆభరణ విశేషాలు చూసి మోహించారు. కానీ నాకు మాత్రం నీ గుణగణాలు మాత్రమే ముఖ్యం అని ఆ ఇల్లాలు పడే వేదన వర్ణనాతీతం. ఈవిధంగా ఇందులోని రసధ్వనితో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని స్వీకరించాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంలో కరుణ అంగరసం.

ఇదే గేయాన్ని ఒక ఆదర్శగృహిణి పల్కులుగాను భావించవచ్చు. జానపదుల జీవితాలలో ఉమ్మడి కుటుంబాలు సహజం. స్త్రీ సహజమైన ఆభరణాలపై మోజు ఈ గేయంలో పేర్కొనబడింది. ఉమ్మడి కుటుంబ విలువలకు ప్రాధాన్యమిచ్చే స్త్రీ బంధుప్రీతికి తప్ప మిగతా వస్తువాహనాలపై ఆశ పెంచుకోకూడదనే వ్యంగ్యార్థం ఈ గేయంలో ఇమిడి ఉంది. తమలపాకు తొడిమే పదివేలు అనడంలో అంతరార్థమిదే. సాధారణంగా తమలపాకు కొసలు, తొడిమెలు విసర్జనీయాలు. తొడిమె, ఈనె, కొసలలో విష పదార్థం ఉంటుందని

ఆయుర్వేద శాస్త్రజ్ఞులు, పెద్దలు చెబుతారు. కాబట్టి ఆమె కోరుకుంటున్న కోరికల వెంట అనర్థాలెన్నో దాగున్నాయని ఈ గేయం చెబుతుంది. తల్లితండ్రులకు తమ కుటుంబ సభ్యులే సహజమైన ఆభరణాలు. వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. వారిని సన్మార్గంలో నడిపించాల్సిన అవసరముందనుట ఇందులోని మరో వ్యంగ్యార్థం.

ఒకవేళ ఆభరణాలే ముఖ్యమనుకుందాం. ఆ ఆభరణాల వెనుక ఆరోగ్య సూత్రాలెన్నో. జానపదులు వాడే ప్రతీ ఆభరణం త్రిదోష హరాత్మకమే. ఈ ఆభరణాలు ఆక్యుప్రెషర్ వైద్య విధానానికి సంబంధించినవి కూడా. ఈ గేయాన్ని అనుసరించి ముక్కెర కఫ సంబంధ దోషాన్ని హరిస్తుందని చెప్పినట్లు తెలుస్తుంది. గేయంలోని బిడ్డల ప్రస్తావన ఇందుకు ఉదాహరణ. సాధారణంగా చిన్న పిల్లలకు శ్వాసకోశ సంబంధ వ్యాధులధికం. అందుకే వారికి ముక్కు కుట్టిస్తారు. యౌవనంలో గాజులు, చెండీలు, మంగళసూత్రం (ఈ గేయంలో కంటె) వొడ్డాలం మొదలైన వాటి ప్రయోజనం వెలకట్టలేనిది. పైత్యం, గర్భ సంబంధ వ్యాధులను నివారిస్తాయి. అంతేకాకుండా ఇవి కామోద్దీపకాలు. అందుకే భర్త చనిపోయాక వీటిని తొలగించాలంటారు. వృద్ధాప్యంలో వాత సంబంధ వ్యాధులధికం. కాళ్ళ కడియాలకు ఈ దోషాన్ని హరించే గుణముంది కావచ్చు.

ఇదే గేయంలోని మరొక కోణాన్ని దర్శిద్దాం. సహజంగా స్త్రీకి భర్తే అన్నీ. భర్త బాధ్యత కూడా వెలకట్టలేనిది. ఇటు పిల్లలను చూసుకోవాలి. అటు తల్లిని చూసుకోవాలి వంటి బరువు బాధ్యతలెన్నో అతనిపై ఉంటాయి. అటువంటప్పుడు భర్త తన భార్యను విస్మరించే అవకాశం కలదు. అందుకే ఆ స్త్రీ బహుశా తన భర్త ప్రేమను ఆశిస్తుంది కాబోలు. ఈ సందర్భంలో కొంతవరకు విప్రలంభ శృంగారం అంగరసంగా భావించవచ్చు.

ఇదే గేయంలో సంభోగ శృంగార కాంక్షను దర్శించచ్చు. ప్రేమకు, కామానికి వయసుతో నిమిత్తం లేదు. ముగ్గురు బిడ్డలు, నలుగురు కొడుకులున్నా 'చింత చచ్చినా పులుపు చావని శృంగారిణి' ఆ గృహిణి. తన భర్త అంటే ఆమెకు ఎనలేని ప్రేమ. ఎన్నోమార్లు చిలకలు చుట్టి భర్తకు అందించి తానుమాత్రం తొడిమలతోనే సంతోషపడేది. ఇక గేయం లోతుల్లోకి వెళితే ఎలా ఉంటుందో చూద్దాం. తన భర్తను పట్టె మంచం మీదికి ఆహ్వానించడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. ముద్దులతో ముంచెత్తమంటుంది, కౌగిలింతలు కాంక్షిస్తుంది. ఇలా మిగతావాటిని ఊహించుకోవాలి. ఇదంతా ఎందుకంటే తన నడుముకు వొడ్డాలం కావాలట. అంటే తాను గర్భవతి కావాలనుకొంటుందన్న మాట. ఎంత చక్కని భావన. ఈ విషయం అందరివలె అడగలేను. (నడి వయస్సు, అందులోనూ, ఉమ్మడి కుటుంబం కదా!) అని తన కోరికను వెలిబుచ్చింది. కొందరి వలె కొసరబోను అని తన హక్కును ప్రకటించింది. ఇంతకంటే వివరణ ఏం కావాలి.

ఇదే గేయంలోని వియోగ దుఃఖాన్ని దర్శించాల్సిన అవసరం ఉంది. భర్త చనిపోయిన స్త్రీ వేదన ఇది. తనకున్న ఆభరణాలన్నింటిని తొలగించడం అందుకు సాక్ష్యం. భర్త జ్ఞాపకాలుగా బిడ్డలు, కొడుకులు, అత్త మరదళ్ళు, మిద్దె మేడలు, సూటుబోటులు మిగలడం ఇందుకు మంచి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఏ ఆకతాయి ఆమెను అల్లరి చేశాడో పాపం.

ఒకే గేయాన్ని ఇన్ని విధాలుగా వివరించడం వల్ల పాఠకులకు విసుగు రావచ్చు గాక, జానపదుల మేధోవిజ్ఞానం మేరలేనిదని చెప్పటం నా ఉద్దేశం. ఇంకా చెప్పాలంటే కథకైనా, కవితకైనా సంఘటన, సందర్భం మొదలైనవి ప్రాణభూతాలు. ఈ గేయం ఏ సందర్భంలో వెలువడిందో తెలియదు కాబట్టి ఇన్ని వివరణలు. మొత్తానికి అనాగరికులుగా కనిపించే జానపదులలో అంతులేని ఆలోచనలున్నాయి. అనుభవాల దొంతరలున్నాయి. వారిని అనాగరికులుగా భావించడం మన అనాగరికత. మోటుహాస్యం ద్వారా కూడా మోక్షమార్గం చూపగల చతురులు వారు. చివరగా ఈ గేయంలోని ఆధ్యాత్మిక చింతనను తెలియజేస్తాను. ఈ సందర్భంలో 'అమ్ము' అనే క్రియను స్వీకరించకుండా యథాతథంగా 'నమ్ము' (సంధికార్యం జరుపకుండా) అనే క్రియను స్వీకరించాల్సిన అవసరం ఉంది. అంటే సభంగ శ్లేషకు బదులు అభంగ శ్లేషను స్వీకరించడం సమంజసమనుకుంటాను.

'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ' అన్న భగవద్గీతా వాక్కులు ఈ గేయానికి ప్రేరణ కావచ్చు. భగవంతునికి ప్రీతికరమైన ఆకులలో తమలపాకులు ఒకటి. పత్రిలేని పూజ, పత్రం లేని అపప్పులాంటిదని జానపదులు బలంగా విశ్వసిస్తారు. తమలపాకునే కాదు, నిష్ప్రయోజనమైన దాని తొడిమను కూడా స్వీకరించగల కరుణామూర్తి పరమాత్మ. ఇక్కడ 'నాకు' అంటే 'నేను' అని అర్థం. అహం బ్రహ్మాస్మి, అయమాత్మా బ్రహ్మ మొదలైన వేదవాక్యాలను అనుసరించి నేను అంటే పరమాత్మ. భక్తితో ఏది ప్రసాదించినా స్వీకరిస్తానని గీతలో శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. వీటిననుసరించి ఈ గేయంలోని పల్లవిలో భక్తియోగం ఉంది. ఆ భక్తి ఎలా ఉండాలి? అంటే చాలురా అంటే భక్తుడు లయమవ్వాలి. సూటిగా చెప్పాలంటే అంతులేనంత ఉండాలి.

ఇక ముక్కుకు ముక్కెర లేక.... అనే మొదటి చరణాన్ని అనుసరించి ప్రాణాపాయం తెలియచేయబడింది. ఇక్కడ ముగ్గురు బిడ్డలు. ఇడ, పింగళ, సుషుమ్నా నాడులు. లేదంటే కుంభకం, పూరకం, రేచకం కావచ్చు. ముక్కు చిన్నపోవడమంటే సుషుమ్నా

నాడి మూసుకుపోవడం. రెండు, మూడు చరణాలు హఠయోగానికి సంబంధించినవి. ఇందులోని చేతుల ప్రస్తావన ముద్రలకు సంబంధించినవి. ఇక్కడ కన్నతల్లి ప్రస్తావన కుండలినీ మాతనుద్దేశించి అంటే ఇది కుండలినీ యోగ సాధన.

ఇకపోతే వొడ్డాలం ప్రస్తావన నాదయోగానికి సంబంధించినది. ఈ నల్గురు కొడుకులు నాలుగువేదాలు. దేహంలో నాదయోగం మొదలయ్యాక వేదాలతో పనిలేదని ఉపనిషత్ సారం. రుక్నుద్దీన్‌గారు పేర్కొన్న గేయంలోని 'నాగటి రెండెడ్ల నమ్మీ' అనుటలో కూడా చుట్టచుట్టుకోవడిన సర్పాలు వ్యంజింపబడినవి.

మెడ ప్రస్తావన విశుద్ధ చక్రానికి సంబంధించినది. అంటే మంత్రయోగానికి సంబంధించినది. ఏ మంత్రమైనా కంఠంతోనేగా జపిస్తాం. ఆ విషయమే ఇక్కడ చెప్పబడింది. అలా కాకున్నా మరొక విషయాన్ని గమనించవచ్చు. సాధారణంగా మణిపూరక చక్రం దాటగానే అష్టసిద్ధులు సాధకున్ని వర్తిస్తాయి. కాని ఆత్మ సాక్షాత్కారం కోరుకునే సాధకుడు. అష్టసిద్ధులపై మోహాన్ని వదులుకోవాలి. ఈ గేయంలోని మిద్దెమేడల ప్రస్తావన అష్టసిద్ధులను వ్యంజింపచేయును.

అదేవిధంగా పట్టెమంచం, పరుపుల ప్రస్తావన ధ్యానం, ధారణలకు సంబంధించినవిగా భావించవచ్చు. మనసు చిన్నపోవడమంటే సమాధి కుదరకపోవడం. సమాధి కుదిరితే దక్కేది పరమాత్మ దర్శనం. అదే పదివేలు అనడం సహస్రదళ పద్మంలోని పరమాత్మను సూచించడం. ఈ లెక్కన ఈ గేయం ప్రతీకాత్మకం, నారికేళ పాక సమన్వితం.

ఇన్నివిధాలైన యోగసాధనా విధానాలున్నాయి. ఉపాసనా మార్గాలున్నాయి. వీటిలో మనం ఏ ఒక్క యోగ సాధనకైనా పూను కుంటున్నామా! ఆలోచించాల్సిన విషయం. ఈ విధంగా ఈ గేయాన్ని ఇంకా విస్తృతంగా వివరించుకోవచ్చు. ఇంతటితో విరమిస్తున్నాను.

నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడటం జానపదులకు వెన్నతో పెట్టిన విద్య. నవ్వుతూ నవ్విస్తూ మాట్లాడే జానపదుల మాటల్లోని నగ్నసత్యాలను గుర్తించడం అంత తేలికైన విషయం కాదు. చూడటానికి అమాయకంగా కన్పించినా వారి అంతరంగాల లోతుల్ని కొలవడం అంత సులువు కాదు. వివిధ విషయాలపై వారికున్న పరిజ్ఞానం మేరలేనిది. ఇలా చెప్పుకుంటూ పోతే జానపద హాస్య గేయాలలో విశేషాంశాలు కోకొల్లలు వెలువడుతున్నాయి. మచ్చునకు రెండింటిని మాత్రమే తెలియజేశాను. మిగతా వాటినన్నింటినీ ఇంకా విస్తృతంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కొన్ని చూపులు

కళ్ళను నడిపించే కాళ్ళు
ప్రపంచాల అంచుల్ని తాకేలా
వెర్రిగా అరిచే నోళ్ళు
చూపులు...
క్షణాల రహదారుల వెంట
గాబరాగాబరాగా పరుగులు తీస్తుంటాయి
వింతవింతగా గంతులేస్తుంటాయి
కొన్ని చూపులు
ఎవ్వరికీ చిక్కవు-
అందినట్లే అంది జారిపోతుంటాయి
వెలుతురును వెలివేసి
చీకట్లోనే తిరుగుతుంటాయి
నిప్పుల కుంపటిని ఒంటికెక్కించుకుంటాయి
కాసేపు పదునుగా
మరి కాసేపు కరుకుగా ఉంటాయి
ఎగిరి ఎగిరి దారం తెగి
ఎక్కడో చెట్టుకొమ్మన ఇరుక్కొని
ఊగిసలాడే గాలిపటాల్లాగా
కొన్ని చూపులు కొట్టుమిట్టాడుతుంటాయి
దృశ్యాల జాతరలో కొన్ని చూపులు
తప్పిపోతుంటాయి
అసహనాన్ని తొడుక్కొని
ఆపై సహనాన్ని కొంత పులుముకొని
పిచ్చిగా పిలుస్తుంటాయి
అలసిపోతుంటాయి
అలిగి పోతుంటాయి
అలిగి నవ్వుతుంటాయి
సూదంటురాయిలా అతుక్కుపోతుంటాయి
సూదికంటే సూటిగా దూసుకుపోతుంటాయి
కొన్ని చూపులు అంతే
వాటి తీరు అసలే అర్థంకాదు.

**తిరునగరి శరత్ చంద్ర**
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఫోన్ : 630 987 3682

# మూసీ పదవినోదం - 26

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 ఉ | 3 | 4 | ల | 6 గా | 7 | | X |
| 2 | ల | | | మ | | X | 9 క |
| 5 తా | | ల | ్ర | X | 8 | ర | ణ |
| 6 | జ | తు | | X | 10 ను | | |
| 11 చి | | X | X | 15 | X | 16 | ణ |
| 13 తా | | X | 14 | టి | 17 | డ | |
| 12 | గ | 19 దూ | | X | 18 ర | | ను |
| వి | X | 20 సి | | | | దు | X |

**ఆధారాలు (అడ్డం)**

1. ఈ గారెలు తినటం వలన ఆరోగ్య సమస్యలు రావు (7)
2. ఈ పక్షిని క్షేమమా? అని ఒక సినీకవి ప్రశ్నించాడు (6)
5. తెలంగాణ వ్యవహారంలో స్నానాల గది (4)
6. ఉర్దూలో సంతోషం చెదిరిపోయింది (4)
8. ఈ పదానికి దొంగిలించటమనే కాదు, బిడ్డకిచ్చు కానుక అని కూడా అర్థం (3)
10. ఇప్పటి తరంలో చాలామందికి తెలియని మంచమల్లే త్రాడు (3)
11. చైనా కాదు పిల్లలిని పిలుచుకొనే ముద్దు పేరు (2)
12. పాలు త్రాగు దూడ (4)
13. వేసవికలంలో వచ్చేది దీర్ఘాలు పోయింది (2)
14. మెట్లవడ్లలో ఒక రకము (5)
16. గరిక, బాణము వదలు సామర్థ్యము గల వింటినారి (2)
18. బలపముతో గాని, ఆకురాయితో గాని బంగారముపై రాసినపుడు రాలు బంగారము మొదలగువాని పొడి (3)
20. అది --------------- కాదు

**ఆధారాలు (నిలువు)**

1. ఇవి ఈ కాలంలో ఎక్కడ ఉన్నాయని ప్రశ్న 98)
3. "స్త్రీల కడగంటి చూపులు" అను అర్థం వచ్చు ఈ సమాసాన్ని రామరాజ భూషణుడు, అన్నమయ్య ఇద్దరూ ముచ్చటపడి ప్రయోగించారు (7)
4. న్యాయవాదికి వాదించటానికిగాను అప్పజెప్పే వ్యవహారం, ప్లీడరీ(4)
6. చిన్న చీమ (2)
7. ఆస్కార్ అవార్డు అందుకొన్న సంగీత దర్శకుడు అటు ఇటయ్యాడు(4)
9. బాగా వెలుగుట (6)
14. కుమారుని భార్య (3)
15. సమానం (2)
17. ముఖమును కప్పు వస్త్రము (3)
19. చిత్తూరు ప్రాంతంలో దుమ్మును ఇలా పిలుస్తారు (2)

**(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)**

నిర్వహణ

**డా. తాదేపల్లి పతంజలి**

**ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.**

**ఫోన్ : 98666 91587**

## సత్సంగం

### పుణ్యం, పాపాన్ని తుడిచి పెట్టి వేయలేదా?



"నేను చేస్తున్నా"ను అనే భావమున్నంత వరకూ మంచి పనులకైనా, చెడు పనులకైనా ఫలితాలను అనుభవించాల్సిందే. ఒక పనితో మరొక పనిని ఎట్లా ముడిపెట్టటం? "నేను చేస్తున్నా"నే భావం లేకపోతే మనిషిపై ఏ ప్రభావమూ ఉండదు. ఆత్మసాక్షాత్కారమయితేనే గాని "నేను చేస్తున్నా"ననే భావంపోదు. ఆత్మ సాక్షాత్కారమయిన వానికి జపమవసరమేమిటి? తపస్సు అవసరమేమిటి? ప్రారబ్ధబలం వల్ల జీవితతం కొనసాగిపోతుంది. కాని ఆత్మసాక్షాత్కారం పొందిన వాడు దేనినీ కోరడు. ప్రారబ్ధ కర్మ మూడు రకాలు – ఇచ్ఛ, అనిచ్ఛ, పరేచ్ఛ అని – అంటే స్వయంగా కోరుకున్నది, కోరిక లేనిది, ఇతరుల కోరికల వల్లనయేది.

ఆత్మసాక్షాత్కారమయిన వానికి ఇచ్ఛా ప్రారబ్ధముండదు. కాని మిగిలిన రెండూ ఉంటాయి. జ్ఞాని ఏమి చేసినా, ఇతరుల కోసమే. ఇతరుల కోసమేదైనా చేయవలసి వస్తే చేస్తాడు. కాని ఫలితాలు అతనినేమీ ప్రభావితం చేయవు. జ్ఞాని చేసిన పనులకు పుణ్యం కాని, పాపం కాని అంటవు. జ్ఞాని ఏమి చేసిన లోకం దృష్టిలో ప్రామాణికము, ఉచితమూ అయినదే చేస్తాడు.

ఈ జన్మలో తమ ప్రారబ్ధం ప్రకారం కొన్ని అనుభవించి తీరాలి అని తెలిసిన వాళ్ళు – ఆ అనుభవాల వల్ల ఏ వ్యాకులపాటునూ చెందరు. నీ సంకల్పమున్నా, లేకపోయినా, నీవనుభవించాల్సింది నీ మీద తప్పకుండా పడుతుంది. దీనిని గ్రహించు.

# అశ్మక జనపద నాణాల పరిచయము

**కందకుర్తి యాదవరావు,** చరిత్ర పరిశోధకులు, నిజామాబాద్, ఫోన్ : 9640411849

భారతదేశములో చరిత్ర ప్రారంభ కాలమున మహారాజులు అరుదుగా యుండిరి. ప్రజల మన్ననతో ఏర్పడిన స్వతంత్ర జనపదాలు 16 చరిత్రలో ప్రసిద్ధి గాంచి యున్నవి. వీటి దాఖలాలు జైన, బౌద్ధ పురాణాలలో, మన వివిధ పురాణాలలో ఆధారాలతో ఉన్నవి. ఇతర చరిత్రకారులు కూడా వ్రాసినారు, ఆధారాలు చూపినారు. 16 జనపదాల్లో 15 ఉత్తర భారతంలో గలవు. దక్షిణ పీఠభూమిపై ఉన్న ఏకైక జనపదం అశ్మక జనపదంగా ప్రసిద్ధి చెందింది. దీని చరిత్ర విస్తారంగా, సంపూర్ణంగా ఇంకా వెలుగులోకి రాలేదు. కొందరు దీనిని చరిత్రలో చూపినారు. మరాఠీలో దీనిపై స్వతంత్ర గ్రంథం మెడిక్ సర్జన్ డా. సుధాకర్ దేశ్‌ముఖ్‌గారు వ్రాసినారు. వారికి నేను తోడుగా యుంటిని. దీనిని హిందీలో 2018లో వ్రాసినాను.








**రాజధాని :** జైన పురాణాల ఆధారంగా ప్రథమ తీర్థంకరుడు ఋషభనాథ్ రెండవ కుమారుడు బాహుబలి. రాజధాని నేటి బోధన్ ఉండెను. దాని ఆధారం పంప భారతంలో కూడా కలదు. బహుధాన్య పురం ఏకచక్రనగరం. పద్మపురంగా వర్ణించబడింది. అశ్మకుల రాజ్య కాలంలో పోతన, పోతలిగా కలదు. ఇది నేటి తెలంగాణాలోని నిజామాబాద్ జిల్లాలో పేరుగాంచిన బోధన్ అని ఆంధ్ర, మహారాష్ట్ర చరిత్రకారులు అందరూ ఏకీభవించినారు. ఈ రాజధాని గురించి విభేదాలు ఏమీ లేవు.

**రాజ్యకాలం :** మహాభారత యుద్ధంలో పాల్గొన్నది మరియు భీష్మ శర పంజరం సమయాన అశ్మకులు అచ్చట గల దాఖలా మహాభారతంలో ఉంది. అప్పటినుండి శాతవాహనుల రాజ్యపాలన వరకు వీరి రాజ్యం కొనసాగియుండెను. నేటి చరిత్రకారులు క్రీ.పూ. 700 గా చెప్పుచున్నారు.

**రాజ్యవిస్తారం :** వీరి రాజ్యం దక్కన్ పీఠభూమి కేంద్రంగా కొనసాగినది. అంటే మరఠ్వాడాలో బీడ్, ఉస్మానాబాద్, లాతూర్, నాందేడ్ ఇంకా బీదర్ నేటి జిల్లాలు, మన ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పాత జిల్లాలపై రాజ్యం విస్తరించి యుండెను. అదేవిధంగా విదర్భపై కూడీ వీరి చలామణి కనబడుతుంది. అక్కడ భద్రావతి స్థలంలో ప్రభుత్వ త్రవ్వకాలలో వీరి రాజముద్ర దొరికినది.

**నాణాల ప్రాప్తిస్థానం :** నాందేడ్ నగరం వద్ద సిద్ధనాథ్ టెకడి (హిల్) వద్ద ప్రజలు మట్టి త్రవ్వకాలలో ఒక చిన్న మట్టి భాండములో ఒక కిలో వరకు గల నాణాలు బైటపడినవి. (1986) అచ్చటి పనివారి బుద్ధిహీనత వల్ల అవి నాశనం ఐనవి. నా మిత్రుడు చరిత్ర పరిశోధకుడు నాందేడ్ నివాసి అయిన శ్రీ సముద్ర గుప్త పాటిల్ గారికి తెలిసి ఎంతో ప్రయత్నముతో అందు నుంచి 12 నాణాలు వీరికి దొరికినవి.

**ప్రచురణ :** దొరికిన వానికి వారు నాకు చూపిరి. మేము ఇద్దరం కలిసి బిర్లా న్యూమిస్టీ సొసైటీ నాసిక్ వద్ద అంజనేరి వద్ద వారి పరిశోధన, ప్రచురణ కేంద్రం గలదు. వారికి ఇచ్చినాము. వారు దీనిని పరిశోధించి ఇవి అశ్మకుల పంచమార్క నాణాలని వారి ఇంగ్లీష్ డైజెస్ట్‌లో సముద్ర గుప్త పాటిల్ పేరిట ప్రచురించారు. దీనికి ముందు కొన్ని నాణాలు లభించినవి. కానీ పెద్దమొత్తంలో ఇవే అని భావించాలి. నాందేడ్, బోధన్, జోడు కలిసి ఉన్న ప్రదేశం ఉంది.

**నాణాల ఆకారం :** దొరికిన నాణాల ఆకారాలు ఒక నిశ్చిత రూపంలో లేవు. సాధారణంగా ఉండే ఆకారంలో లేవు. చౌకోన్, కొన్ని పొడవు, కొన్ని చతుష్కోణాకృతి, కొన్ని అండాకృతిగా గలవు. వీరి పూర్తి కొలతలు, ఆకారం మాత్రం 1 సెం.మీ. నుండి1.6 సె.మీ. సైజులో గలవు. బరువు 1.5 నుంచి 1.73 గ్రాముల్లో ఉన్నాయి.

**బొమ్మ చిత్రాల గుర్తులు :** ప్రతి నాణ్యంపై బొమ్మ వైపు రెండు గుర్తులు బొరుసు వైపు, రెండు గుర్తులు ఉన్నాయి. ఏనుగులు ప్రతి నాణంపై ఉండి, ఎడమవైపు తొండం గలవి (9) మరియు కుడివైపు 3 గలవు. చెట్టు కొమ్మ గుర్తు ప్రతి నాణంపై బొరుసు వైపు తప్పక ఉంది. అంటే ఏనుగు మరియు చెట్టు గుర్తులు అన్ని నాణాలపై ఉన్నాయి. మిగతా రెండు గుర్తులు ప్రతి నాణెంపై వేరు వేరుగా ఉన్నాయి. ఒకే గుర్తు జత రెండువైపులో ఉన్నాయి. ఇవి క్రీ.పూ. 7వశతాబ్దం లోని జనపదం అని ప్రచురణకర్త వ్రాసినారు.

**నా మాట :** అశ్మక జనపదంలోని నాయకులు సైన్యం ప్రముఖులు నాందేడ్ భోగవర్ధన జనులు, పెటనికులు = పైఠన్ జనులు, మూలకులు, అంధకులు, ఆది వివిధ విభాగముల వారు ఉన్నారు. వీరు కలిసి రాజ్యం సాగించారు.

అశ్మకులు = గోదావరి, ఆసనా నది మధ్య ప్రదేశము వారు కావుట వలన అశ్మకులు అనబడిరి. అదేవిధముగా పైఠన్, మూలకులు, అచ్చటి మూలానది. తీరవాసి ఉన్నారు. అంధకులు = తెలుఉవారు. నాందేడ్, యువతమాళ ఆదిలో వనవాసులు ఆదిమజాతివారు. వారు ఇప్పటికీ ఆదివాసులుగా జీవించుచున్నారు. నేడు వారికి ఇచ్చట రిజర్వేషన్ గలదు. వారి సభలకు నేను వెళ్ళినాను. వీరిని గురించి మరాఠీ భాషలో వ్రాసి ఉంది. వారిని గురించి నా మనస్సులో ఇట్లా ఉంది. వీరి ప్రారంభ కాలంలో మాతృభాష స్థానిక ప్రాకృతం ఉండేది. అంధకుల ప్రాకృతం నుండి సంస్కృతం తదుపరి తెలుగు భాషగా వికసించినది అని నా భావన. నేటి మరాఠి మరియు తెలుగు ఆనాటి ప్రాకృతం నుంచి పుట్టినవే. ఈ ప్రదేశం నుంచి వాడి నేటి రూపం దాల్చినవి అని నా మనవి.

# సరస్వతీ ప్రాతః స్మరణ

ప్రాతః స్మరామి మనసా చతురాస్య రాజ్ఞీం
దేవీం శివాచ్యుత నుతాం సురలోక వంద్యాం
పూర్ణేందు కోటి వదనాం భువనైక రాజ్ఞీం
క్షీరాభ శుక్ల వసనాం సుమనోహరాంగీం

ప్రాతర్నమామి శిరసా స్వర రాగ రమ్యాం
వేదార్థ శాస్త్ర నిలయాం శ్రుతిసార గమ్యాం
వీణా సుపుస్తక లసద్విభవైక పాణిం
వాగీశ్వరీం భగవతీం ప్రణవ స్వరూపాం

ప్రాతర్భజామి వచసా ప్రణతార్తి నాశాం
భక్తాంతరంగ సదనాం శ్రిత భక్తి హాసాం
శక్తిం త్రిలోక జననీం సకలాఘ హంత్రీం
సర్వాత్మికాం శుభకరాం భవ మోక్ష దాత్రీం

శ్లోక త్రయ మిదం వాణ్యాః
యః పఠేద్భక్తిమాన్నరః
విద్యాం శ్రియం యశోవృద్ధిం
జ్ఞానం మోక్షమవాప్నుయాత్

**డా. డి. కామేశ్వర రావు**
ఫోన్ : 98487 99648






మూసీ సాహిత్యధార
ప్రధాన ప్రసంగం

# తెలుగు పరిశోధన – వర్తమాన స్థితిగతులు

**ఆచార్య వెలుదండ నిత్యానందరావు,** తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం,
ఫోన్ : 9441 666 881

విశ్వవిద్యాలయాల్లో తెలుగు భాషా సాహిత్యాల మీద పరిశోధించి ఎం.ఫిల్, పిహెచ్.డి. డిగ్రీలు పొందడం మొదలై ఇప్పటికి 90 ఏళ్ళు అయింది. తెలుగు భాషా పరిణామాలు, కవుల జీవితం – రచనలు –వ్యక్తిత్వాలు, సాహితీ విలువలు, ఛందోవ్యాకరణాంశాలు, భిన్నభిన్న ప్రక్రియా వికాసాలు, చరిత్ర, గ్రామనామాలు, జానపద గిరిజన విజ్ఞానాంశాలు, కథలు, నవలలు, తులనాత్మకాలు, అనువాద వివేచనలు ఇలా ఎన్నెన్నో అంశాల మీద పరిశోధనలు జరుగాయి. ఒక్క మాటలో చెప్పాలంటే **"కాదేదీ పరిశోధన కనర్హం"** అని పరిశోధకులు తేల్చారు. దాదాపు 6 వేల దాక చిన్న పెద్ద డిగ్రీలు ప్రదానం చేయబడ్డాక ఇప్పుడు తెలుగుపరిశోధన మీద పునస్సమీక్షణం, పునర్మూల్యాంకనం చేస్తున్నారు.

తెలుగు పరిశోధన ఏ దిశలో సాగుతోంది? సక్రమ పథంలో సాగుతోందా? ప్రామాణిక విలువలు కలిగి ఉందా? నూతనాంశాలు వెలికి వస్తున్నాయా? దాని మీద ఉపకార వేతనాల పేరుతో భారీగా వ్యయిస్తున్న ప్రజాధనానికి జవాబుదారీతనం ఎంత మేరకు ఉంది? అన్న అంశాల మీద అసంతృప్తికర వ్యాఖ్యానాలు అంతటా వినవస్తున్నాయి.




ఆరోగ్యాన్ని గురించి అందరిదీ ఒకే మాట. వివరించడానికి ఏమీ ఉండదు. కాని అనారోగ్యానికే చాల పేర్లు. చాల కారణాలు. చాల రకాలైన చికిత్సలు. అనారోగ్యానికి ప్రధాన కారణాలు తినే తిండిలో, పీల్చేగాలిలో, తాగే నీటిలో కాలుష్యం, రోగనిరోధక శక్తి తగ్గుతుండడం, వ్యాయామాలు చేయకపోవడం, మానసిక ఒత్తిడులు, ఇవేకాక మరిన్నో. పరిశోధనలు బాగా లేకపోవడానికి కూడ ఇంచుమించు ఇవే కారణాలేమో! చదివే పుస్తకాల్లో కాలుష్యం, ప్రామాణికత లేనివి. మూలగ్రంథాలు చదవక పోవడం. పైపై మెరుగులే ప్రధానమనుకోవడం, చిన్నప్పటి నుండి సాహిత్యపఠనంతో ఎదిగి పరిశోధనలోనికి రాకపోవడం, రచనాపరమైన అభ్యాసం పూర్తిగా కొరవడడం, ఉద్యోగాది కెరీరిజం లక్ష్యంగా జీవితం సాగడం, కాలానుగుణమైన చిన్నచూపు, నిర్లక్ష్యం జీవితాన్ని ఆవహించినట్లే పరిశోధనను ఆవహించడం – ఇలా తెలుగు పరిశోధన తిరోగమనానికి సవాలక్ష కారణాలు.

తెలుగు పరిశోధన పతనంలో సమాజం, ప్రభుత్వం, పర్యవేక్షకులు, పరిశోధనాంశాలు, పరిశోధకులు, పరీక్షకులు అందరూ భాగస్వాములే. అయితే పరిశోధన రంగం ఒక్కటే చెడిపోయింది. దేశమంతా బాగుందన్నట్లు అభాండాలు వేయడం సబబు కాదు. ఈ దుస్థితి తెలుగుకు మాత్రమే పరిమితం కాదు. అన్ని భాషలు, శాస్త్రాలకు వర్తిస్తుంది. కాకుంటే పద్ధతులు, పాళ్ళు వేర్వేరు కావచ్చు. ఆచార్య ఆకురాతి పున్నారావు గారొకసారి అన్న మాటలు జ్ఞాపకం వస్తున్నాయి. "ఈ ప్రమాణాలు పడిపోవడం అనే ఆవేదన కేవలం ఈ తరం వారిదే కాదు. దాదాపు అన్ని తరాల వారూ కొందరు ఈ భావనకు గురైనట్లు తెలుస్తుంది. మాకు బోధించిన వారు తమతరం వారి అభినివేశాలూ, శ్రమ శీలాలూ తమ విద్యార్థులలో లేవని విచారించే వారు. అయితే వారి ఆచార్యులూ వారిని అదే విధంగా అనలేదని చెప్పలేం. కాగా ఈ ప్రమాణాల పతనమో, రాహిత్యమో ఇలాంటివి ఏనాడు తప్పనివే అని గ్రహించాలి. కాకపోతే నేడు మారిన సాంఘిక పరిస్థితుల వల్ల చదువరుల సంఖ్య బాగా (పాత కాలంతో పోలిస్తే) పెరిగిన కారణాన ఆ పెరుగుదల ప్రమాణానికి అనుగుణంగా ఈ పతనాల ప్రమాణమూ పెరిగి ఉండవచ్చు. అది అనివార్యం గదా! అవమానకరమైన పరిస్థితుల్లో మన చదువుల్ని మన పరిశోధనల్ని ఉంచుకోవడం విషాదకరమైన పరిణామమే. ఆ పరిణామానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనమూ కొంతవరకు మన పూర్వులూ బాధ్యులే! కాని వాస్తవమేమిటంటే ఈ పరిణామం ఈ దేశాన ఏ ఒక్క విభాగానికో, యూనివర్సిటీకో పరిమితమై లేదు.

తెలియవచ్చినంత వరకు పరిశీలిస్తే, ఈ జాతి అన్ని చర్యల్లోనూ ప్రస్ఫుటంగా ప్రతిఫలించక తప్పదు. ఆ వెలితి ఒక విద్యారంగానికే ఇక్కడ పరిమితమనలేము. అది పరిపాలనా వ్యాపార వాణిజ్యాది వివిధ జాతి జీవన ప్రక్రియలకు కూడా వ్యాపించే ఉంది కాగా భగీరథీ గంగతో పాటు భారతీయ జీవన గంగను (ముఖ్యంగా విద్యాధికులను) కూడ ప్రక్షాళన చేయవలసిన అవసరం పుష్కలంగా ఉంది. అప్పుడు గాని అన్నిటి మాలిన్యాలతో పాటు విద్యారంగ మాలిన్యమూ తొలగిపోదు".

**ప్రభుత్వం**

అసలు విశ్వవిద్యాలయ వ్యవస్థ ఎలా ఉండాలన్న దాని పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ కానీ, పట్టింపులు లేవు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల సంఖ్య వారి శక్తి సామర్థ్యాల లాగే నానాటికీ తీసికట్టుగా ఉంది. విశ్వవిద్యాలయాలను నిర్మూలించాలని స్పష్టంగా నిర్ణయించుకుంటే పోస్టులు నింపకూడదు. కొత్త విశ్వవిద్యాలయాలు నెలకొల్పకూడదు. విశ్వవిద్యాలయాలను పటిష్ట పరచడమే గమ్యమనుకొంటే ఎప్పటికప్పుడు పోస్టులు నింపాలి. కాని ప్రభుత్వం అధ్యాపక ఖాళీలు సకాలంలో నింపడం లేదు. రిటైరు అయ్యేవారు అవుతున్నారు. కొత్తవారు రావడం లేదు. రాష్ట్ర రాష్ట్రేతర విశ్వవిద్యాలయ తెలుగుశాఖలో పట్టుమని డెబ్బై మంది అధ్యాపకులు లేరు. శాశ్వతస్థాయి అధ్యాపకుడు ఒక్కరు కూడ లేకుండా కొన్ని కొత్త విశ్వవిద్యాలయ తెలుగుశాఖలు నడుస్తున్నాయి. పిహెచ్.డి. పరీక్షకుల జాబితా తయారు చేయడానికి మనుషులు కరువవుతున్న దుస్థితి ఉంది. ఉన్న ఈ కొద్దిమంది అధ్యాపకుల్లో కొందరు విశ్వవిద్యాలయ పాలన నిర్వహణ బాధ్యతల్లో తలమునకలవుతున్నారు. సెమిస్టర్ పరీక్షలు కావడంతో పరీక్షలు నిర్వహించడం, పేపర్లు దిద్దడం ఫలితావ్వడమే గాక ఇతర విశ్వవిద్యాలయాల పరీక్ష వ్యవహారాలు కూడ చూడక తప్పదు. ఇక పట్టణీకరణ సమస్య, కుటుంబ బాధ్యతలు, మానసిక ఒత్తిడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాజకీయాలకు, పైరవీలకు, వ్యాపారాలకు వీరు మాత్రం అతీతులు కాలేరు గదా! ప్రభుత్వం పాత విశ్వవిద్యాలయాలకు కొత్త పోస్టులు ఇవ్వాల్సిన పని లేదు. ఖాళీ పోస్టులు నింపితే చాలు. ఒక వంద మంది రాగలరు.

**సామాజిక కారణాలు**

తెలుగులో పిహెచ్.డి చేయడానికి ఎం.ఏ (తెలుగు) చేసిన వారు కావాలి. బాగా చదువుకున్న కుటుంబాల వారు ఆర్థికంగా నిలదొక్కుకున్న వారంతా చాలమటుకు కంప్యూటర్ వైపు, ఎం.బి.ఏ., వైపు, ఇంజనీరింగ్ వైపు వెళ్ళిపోతున్నారు. ఓ మోస్తరు విద్యార్థులు ఎం.ఏ. (ఇంగ్లీషు) ఎం.ఏ. (సామాజిక శాస్త్రాలు) ఎం.ఎస్.సి. లకు వెళ్తున్నారు. ఆయా ప్రవేశపరీక్షల్లో సరియైన ర్యాంకులు రాక వాటిలో చేరలేక పోయినవారు ఎం.ఏ (తెలుగు) లో చేరుతున్నారు. ఏ మాత్రం విద్యాత్మక, ఆర్థిక నేపథ్యం లేని నిరక్షరాస్యులు, అట్టడుగు స్థాయి వారి పిల్లలు ఎం.ఏ తెలుగులో చేరుతున్నారు. చిన్నయసూరి బాల వ్యాకరణం, గురజాడ కన్యాశుల్కం, శ్రీశ్రీ మహా ప్రస్థానం పుస్తకాల పేర్లు ఏ మాత్రం వినని విద్యార్థులు వారు. ఇంట్లో ఓ పది, ఇరువై సాహిత్య సంబంధ పుస్తకాలు లేనివారు వీరు – ఇది సామాజికంగా హర్షించదగిన పరిణామమేమో! కాని సరియైన పిహెచ్.డి చేయడానికి ప్రతిబంధకమే.

**ఎం.ఏ. పాఠ్య ప్రణాళిక**

ఎం.ఏ.లో చేరాక ఎవరో రాసిన నోట్స్‌ను జిరాక్స్ చేసి చదువుకొని ఉత్తీర్ణులవుతున్నారే కానీ నాలుగు పుస్తకాలు ముందుంచుకొని నోట్సురాసుకుంటున్న పాపాన పోవడం లేదు. ఉద్యోగ సముపార్జన కోసం పోటీ పరీక్షలకు పుస్తకాలు బట్టీ పట్టడం తోనే, వారి సమయమంతా హరించుకుపోతోంది.

ఎం.ఏ.లో బోధన మీదనే దృష్టి ఉంటుంది. పాఠ్యాంశాలు ఎప్పుడు పూర్తి చేయాలి? ఎలా పూర్తి అయిందనిపించుకోవాలన్న మీదనే ధ్యాస ఉంటుంది. కాని రచనా పరమైన నైపుణ్యాలు వెంపొందించే ప్రణాళిక ఏదీ లేకపోవడం విషాదకరం. యు.జి.సి. ప్రాజెక్ట్ వర్క్ ఉండాలని నిర్దేశించింది. కాని అది సరిగా అమలుకు నోచుకోవడం లేదు. ఎం.ఏ. పాఠ్యప్రణాళికను, పరీక్ష పద్ధతిని నిశితంగా గమనిస్తే పరీక్ష పత్రం సులువుగా కళ్ళముందు మెదలుతుంది. నోట్సు సిద్ధంగా ఉంటే నాలుగు రోజుల్లో పరీక్షలకు తయారు కావచ్చు. ఇది స్థితి. ఇప్పుడు విద్యార్థులు ఇదే చేస్తున్నారు.

ఎం.ఏ. లో చేయాల్సిన పిహెచ్.డి. కి సంబంధించిన అవగాహన ఏదీ ఎం.ఏ. పాఠ్యప్రణాళికలలో లేక పోవడం గమనార్హం.

**నిర్బంధ ప్రవేశ ప్రక్రియ :**

అవసరం ఉండనీ, అవసరం లేకపోని ప్రతి సంవత్సరం కొంత మందికి పిహెచ్.డి.లో ప్రవేశాలు కల్పించాల్సిందే. ఓ రెండు సంవత్సరాలు వాయిదా వేద్దామనుకొనే స్వేచ్ఛ కానీ ప్రవేశాలు బాగా తగ్గిద్దామనే స్వేచ్ఛ కానీ ఎవరికీ లేదు. రచనా పరమైన మెళుకువలు ఏమేరకు ఉన్నాయో గ్రహించ వలసిన విద్యార్థులకు ఓఎమ్ ఆర్ షీట్లను నలుపు చేసే పద్ధతిలో లేదా ఎ,బి,సి,డిలను జవాబులుగా రాసే పద్ధతిలో ఎన్నుకోవలసి రావడం మన అస్తవ్యస్త ఆలోచనా రీతికి ప్రతిఫలనమే.

ప్రతి పర్యవేక్షకుడికి నిర్దేశిత సంఖ్యను మించరాదన్న నిబంధనను తుంగలో తొక్కి అడ్డదిడ్డంగా అధిక సంఖ్యలో ప్రవేశాలు కల్పించడానికి కారణం మంత్రులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినాయకులు, ఇలా అందరి బెదిరింపులు అన్నీ చోటుచేసుకోవడం వల్లనే కదా !

అసలు ఓ పదేళ్ళ పాటు పిహెచ్.డి. ని నిషేధిస్తే కొంపలంటుకొని

9505056316



పోతాయా? ఉద్యోగానికి పిహెచ్.డి. అదనపు అర్హతనే తప్ప ఎం.ఏ.నే అసలు అర్హత. ఫెలోషిప్పుల పేరు మీద వచ్చే ఆదాయం పోతుంది గదా అని విద్యార్థులు అనవచ్చు. ఆ ఫెలోషిప్పు ఉన్న ఐదేళ్ళ కాలం డిగ్రీ కళాశాలల్లో నిర్బంధంగా పని చేయిస్తే సరి. పోస్టులు ఎట్లాగూ నింపడం లేదు. కనుక ఈ విద్యార్థుల వల్ల ప్రభుత్వానికి లాభం. ఒకవేళ ఈ విద్యార్థులలో కొందరికి పర్మినెంట్ పోస్టు వస్తే వారికీ లాభం. వారి స్థానంలో మరి కొందరు ఫెలోషిప్పులు పొందిన విద్యార్థులు రానే వస్తారు.

**నిర్లక్ష్యం**

చేసే పని పట్ల గౌరవం లేకపోవడం, ఏం రాసినా చెల్లిపోతుందన్న ధీమా. నాలుగేళ్ళు పోటీ పరీక్షలతో కుస్తీ పట్టడంతోనే జీవితం ముగిసిపోతుంది. చివరికి వాక్య నిర్మాణ దోషాలతో, అసమగ్ర వివేచనంతో హడావుడితో అయుందనిపించడం. ఏది ఎంత మేరకు చెప్పాలి. అన్నది తెలియక పోవడం. ఒక నాలుగయిదు పిహెచ్.డి పుస్తకాలయినా చదవక పోవడం. అంశాన్ని ఎన్నుకోవడం దగ్గరే పప్పులో కాలు వేయడం, అవగాహన లేకపోవడం...

ఒక రచయిత జీవితం – రచనలు అని చేసిన డాక్టరేటు గ్రంథంలో ప్రాథమిక సమాచారం లేనివి కూడ దృష్టికి వచ్చాయి. ఎత్తి పోతల పథకాలు తయారయ్యాయి. కత్తిరింపులు – అతికింపులు, మూలరచయిత తన అనుబంధాలను, అనుభవాలను పేర్కొంటే వాటిని సైతం "కాపీ" చేసిన మహానుభావులున్నారు. ఇక దయ్యపు రాతల సంగతి సరేసరి.

**దయ్యపు రాతలు** (Ghost writings)

సిద్ధాంత గ్రంథ రచనలో తమకు తెలియని అంశాల గురించి తెలిసిన వారితో చర్చించి, తెలుసుకొని రాసుకోవడం తప్పదు. కాని ఏకంగా సిద్ధాంత గ్రంథాలు రాయించేసుకొంటున్నారు. విశ్రాంతోపన్యాసకులకు, మరి కొందరికి అదొక కుటీర పరిశ్రమ అయింది. రాయించుకోవడం ఒక తప్పు. రాయించుకొన్న దాన్ని ఓ నాలుగుసార్లు చదివి జీర్ణం చేసుకోకపోవడం మరో ఘోరమైన తప్పు. అంతేకాదు ఇస్తానన్న డబ్బులు ఎగవేసి రచ్చ చేసుకోవడం మరో తప్పు. స్పష్టంగా బయటపడిన వాటి మీద ఏం చర్య తీసుకున్నారు. అంటే ఏమీ లేదు. మహా పండితుడు, సాహిత్య చరిత్ర నిర్మాత ఆచార్య కొర్లపాటి శ్రీ రామమూర్తి గారితో (ఇప్పుడు వీరి పేరు ఎంతమందికి తెలుసు?) ఓసారి నేను కాపీకొట్టిన థీసిస్ కన్నా డబ్బిచ్చి రాయించుకొన్న థీసిస్ మేలేమో! అని ఓ లేఖలో అన్నాను. 31-1-1999న కొర్లపాటి వారు రాసిన లేఖాంశాల్ని యథాతథంగా ఉటంకిస్తాను.

"కాపీకొట్టిన థీసిస్ కన్నా డబ్బిచ్చి రాయించుకున్న థీసిస్ మేలేమో అనవచ్చును గాని, కాపీకొట్టిన థీసిస్ కూడా డబ్బిచ్చి కాపీ చేయించిన




థీసిస్ అయితే ఏమనగలం? ఇప్పుడు హైదరాబాద్ లో వేడిగా వాడిగా ఉన్న థీసిస్ కాపీ కొట్టింది కాక, డబ్బిచ్చి కాపీ చేయించినదని కొందరి అభిప్రాయం అని విన్నాము. డబ్బిచ్చి రాయించుకొన్న థీసిస్‌కు సంబంధించిన అభ్యర్థి వైవాలో కాపీ చేసి పదిమందిలోనూ పట్టుబడిపోతే అయిదు అరతావులు డీసెంటు నోట్ వ్రాశాను. ఒక వైస్ ఛాన్సలర్ ఎంక్వైరీ కమిటీ వేస్తే, మరొక వైస్ ఛాన్సలర్ పదవిలో చేరిన వెంటనే డిపార్ట్‌మెంటుకి తెలియకుండా, కాన్వొకేషన్‌కు ఓ గంట ముందు అభ్యర్థికి తాఖీదు పంపి, పిహెచ్.డి. ప్రదానం చేశాడు. మనజాతి ఏనాడో నీతీ, నిజాయితీ, సిగ్గూ, శరమూ విడిచిపెట్టేశాయి. ఇతర విభాగాల్లో కంటే తెలుగు విభాగంలో అన్ని విశ్వవిద్యాలయాల లోనూ పరిశోధన పతనావస్థకు వచ్చింది. అనేక కారణాలవల్ల. ఆ కారణాలు పర్యవేక్షకులు ఏకమై తొలగిస్తే ఉత్థానదశ తథ్యం. ఏ విశ్వ విద్యాలయంతెలుగు విభాగమైనా విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన తీరుతెన్నులు అనే అంశం మీద ఒక సదస్సు విశాల ప్రాతిపదికన నిర్వహించడం ఎంతైనా అవసరం అని నా అభిప్రాయం. ఇదొక ఆవేదన మాత్రమే." ఆచార్య కొర్లపాటి వారు ఆవేదన ప్రకటించి ఇంచుమించు పదిహేనేళ్ళు (2012 నాటికి) కావస్తోంది. పరిస్థితుల్లో ఎంతమేరకు మార్పు వచ్చిందో ఎవరికి వారు ఊహించుకోవలసిందే. సిద్ధాంత గ్రంథాల్లో ఎన్నెన్నో అంశాలు గంభీరంగా పాండిత్యస్ఫోరకంగా రాస్తారు. వైవాలో వాటిని వివరించండి. అంటే చాలు దిక్కులు చూస్తున్న అనుభవం పరీక్షకులకు కలుగుతూనే ఉంది.

**పరీక్షకులు**

పదవ తరగతిలో ఫెయిలయిన వారు కనిపిస్తారేమో గాని విద్యా వ్యవస్థలోనే అత్యున్నత స్థాయి డిగ్రీ అయిన పిహెచ్.డి.లో ఫెయిలయిన వారు ఉండరు. 6000 పిహెచ్.డి. ఎం.ఫిల్స్ ఇప్పటికి అయ్యాయనుకొంటే అరశాతం సైతం తిరస్కరింపబడినవి కావేమో.

ముగ్గురు పరీక్షకుల్లో ఒకరు తిరస్కరించినా మెజారిటీ (అంటే ఇద్దరు) ఆమోదించారు కనుక పిహెచ్.డి. ఇవ్వవచ్చు. ఈ మహత్తరసత్యాన్ని ఒకతను నాతో పంచాయతీ పెట్టుకొని చెప్పిపోయాడు. నిదానంగా ఆలోచిస్తే అతను దాని "గుప్తరచయిత" అని బోధపడింది.

ఏదో ఒకటి రెండు పుటలు – విషయసూచికను అడ్డంగా వాక్యాల్లో రాయడం, రెండు మూడు అంశాలు పేర్కొనడం, అక్కడక్కడ అక్షరదోషాలున్నాయనడం "అయినా డిగ్రీ ఇవ్వవలసింది" అని నాన్ సీరియస్ గా నివేదిక రాస్తారు పరీక్షకులు. అప్రయోజనకరమైన పనికి శ్రమపడడమెందుకని పరీక్షకుల తలంపు కాబోలు – ఎట్లాగు డిగ్రీ ఇస్తున్నపుడు ప్రయాణ భత్యాలు మిగులుతాయని బయటివారిని పిలవడం కూడ కొన్ని విశ్వవిద్యాలయాలు మానేశాయి.

బయటి విశ్వవిద్యాలయాల అధ్యాపకులు సిద్ధాంత గ్రంథం చదివి నివేదిక రాస్తే ఈ విశ్వవిద్యాలయ అధ్యాపకుల్లో ఇద్దరు అంతర్గత పరీక్షకులుగా వ్యవహరిస్తారు. అధ్యక్షుడు, పాఠ్య ప్రణాళికా సంఘం అధ్యక్షులు పెద్దలుగా నిలుస్తారు. పర్యవేక్షకుడు నిర్వాహకుడుగా ఉంటారు. విద్యార్థులు సైతం ప్రశ్నలు అడగవచ్చు అని ప్రకటిస్తారు. సమావేశంలో కూర్చునేదాక పరిశోధనాంశ మేమిటో తెలియదు, అసలు బయటి పరీక్షకులు ఆమోదించినా ఈ కమిటీ ఏకగ్రీవంగా తిరస్కరిస్తే ఆ విద్యార్థికి డిగ్రీ వస్తుందా? లేదా? అన్న విషయం మీద స్పష్టత లేదు. వైవా'లో పొరపాటున కూడ నోరు మెదపకపోయినా, అది రాయించుకొచ్చిన గ్రంథం అని స్పష్టంగా తెలుస్తున్నా ఏవో నాలుగు మాటలని, విసుక్కొని డిగ్రీకి సిఫారసు చేయడం జరుగుతోంది.

ఇంకా పర్యవేక్షకుల స్థితి, లైబ్రరీల స్థితి, పరిశోధనాంశాల స్థితి ఇలా ఎన్నెన్నో చెప్పుకోవలసిన అంశాలు మిగిలే పోయాయి. భోగలాలస, ఆదర్శాల లేమి, పిరికితనం, డబ్బు మీద యావ, ద్వంద్వ ప్రవృత్తి ఈ జాతిని ముంచెత్తుతున్నంత కాలం ఏదీ బాగుపడదు 'పరిశోధన'తో సహా. సమస్యలను పరిష్కరించలేని నిస్సహాయత ఉన్నా నిజాలను గుర్తించడంలో నైనా వెనుకంజ వేయకూడదు. నిజానికి ఇవేవి కొత్తవి. గాదు. అందరికీ తెలిసినవే. పరిశోధకు లొక్కరినే బలి పశువులను చేయకూడదు. అందరి దోషమూ ఉంది.

**పరిశోధన గమనాన్ని నిరంతరం సన్నిహితంగా గమనిస్తున్న వ్యక్తిగా ఆవేదనతో రాస్తున్నదిది. ఎన్నో మంచి సిద్ధాంత గ్రంథాలు వస్తున్న సంగతి తెలుసు, శ్రద్ధాళువులైన విద్యార్థులు ఉన్న సంగతీ తెలుసు. మంచి గ్రంథాల సంఖ్య, మంచి విద్యార్థుల సంఖ్య మరింతగా పెరగాలని ఆశపడుతూ రాస్తున్నదిది. చుట్టూరా ఆవరించుకొని ఉన్న చీకటిని తిడుతూ కూచోవడం కన్నా చిరుదీపాన్ని వెలిగించడం మిన్న. మన వలయంలోకి వచ్చిన విద్యార్థులనైనా నుసం మంచి దారి చూపించి ప్రోత్సహించి శాయశక్తులా వారిని తీర్చిదిద్దడమే మనం చేయవలసిన పని. అలాంటి పనికి మనం పునరంకితం కావడం అంటే మనం పునీతులం కావడం అన్నమాట. ఏది ఏమైనా చిత్తశుద్ధి, చేస్తున్న పనిపట్ల గౌరవం, శ్రమశీలం, నిరంతర రచనాభ్యాసం, వ్యుత్పన్నత, త్వరగా రాసేయాలన్న ఆతురత లేకుండా మూడేళ్ళ కాలపరిమితిలో రోజూ రెండు గంటల పాటు చదవడం, రాయడం చేస్తే చాలు. మంచి సిద్ధాంత గ్రంథం రాయవచ్చు.**

---

## సాధన పంచకమ్

**వేదో నిత్య మధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం**
**తేనే శస్య విధీయతా మపచితిః కామ్యే మతిస్త్యజ్యతామ్**
**పాపౌఘః పరిధూయతాం భవసుఖే దోషోఽను సంధీయతాం**
**ఆత్మేచ్ఛా వ్యవసీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్**

**3. తేనే శస్య విధీయతా మపచితిః –**

తేన, ఈశస్య, అపచితిః, విధీయతాం – అనగా వేదోక్తమైన కర్మల ద్వారా పరమేశ్వరుని పూజనం – అర్చనం చేయబడాలి అని భావం. అంటే చక్కగా శ్రద్ధగా ఆచరింపబడెడు వేదోక్తమైన కర్మలను ఈశ్వరుని అర్చనగా మార్చుకోవాలి అని తాత్పర్యం. అంటే వేదవిహితంత కర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించాలన్నమాట. **'స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః'** (గీత. 18/47) అని పనిని పూజగా మార్చే ఒక చక్కని ప్రక్రియను గూర్చి భగవద్గీత మనకు విశదీకరించింది. **యతః ప్రవృత్తిర్భూతానాం** – ఎవరినుండి ఈ సృష్టి ఆవిర్భవించిందో, ఏన సర్వ మిదం తతమ్ – ఎవరిచేత ఈ సర్వము పరివ్యాప్తమై ఉందో, అట్టి ఆదికారణమైన పరమాత్మ ఈ సృష్టిలో ధర్మ స్వరూపంలో జీవించడమే ధర్మ స్వరూపుడైన భగవంతుని అర్చించడం అవుతుంది. అందువలన ధర్మాత్ములు చేసే ప్రతి పని ఒక చక్కని పూజయే అవుతుంది.

అందుకే వ్యాసుడు అంటాడు – "ఓ అర్జునా! నీవు ధర్మమార్గంలో ఉన్నావు. ధర్మాత్ముడివి. కనుకనే పరమాత్ముడు ధర్మ రూపంలో ఉంటూ నిన్ను రక్షిస్తున్నాడు. ధర్మం ఉన్నచోట దైవం ఉంటుంది. కాబట్టి వేదము ద్వారా ప్రతిపాదింపబడిన కర్మలను చక్కగా ఆచరిస్తూ, వాటి ద్వారానే పరమేశ్వరుని అర్చించుకుంటూ జీవనం సాగించాలి.

గ్రంథాంతరంగం 01


# ఆంధ్ర వాఙ్మయ చరిత్రము


శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

వరిష్ఠ విద్వాంసులైన వంగూరి సుబ్బారావు పంతులుగారు తన ముప్ఫైరెండవ ఏట మొట్టమొదటి తెలుగు సాహిత్యచరిత్ర 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'ను (1920)లో రచించి చరిత్రకెక్కిన చరితార్థులు. ఈ సుకృతి రచన, ప్రచురణలో హార్దికంగా, ఆర్థికంగా సహాయ మందించిన మహాభాగులిద్దరు – ఎర్నగూడెం జమీందారు చెలికాని లచ్చారావుగారు, విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు.

వంగూరి సుబ్బారావుగారి అమూల్య గ్రంథం 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'నకు అర్థవంతమైన, ఆలోచనాత్మకమైన 'పీఠిక'ను సంతరించిపెట్టిన సహృదయులు మైసూరు రాజ్య సంస్థానంలో ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా ఉద్యోగించుచున్న మేధావి కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆ మహా విద్వాంసుడు సాహిత్య చరిత్ర లక్షణాల్ని ఇలా ఉల్లేఖించాడు.

**"చరిత్రకారుని వివిధార్థములలో కాల నిర్ణయము ఒక్కటి; అది సమస్తము గాదు, ప్రధానము గాదు. మఱియే యర్థములు ప్రధానములనగా, పరిణామము యొక్క ధోరణిని వర్ణించుట, దానియందలి ముఖ్య స్థితులకుండు పరస్పర సంబంధములను విశదీకరించుట; వివిధ దశలను నిర్ణయించు హేతువులను విశదీకరించుట; ప్రకృత విషయము – అనగా భాషా చరిత్రాదులు – ఏ రీతి సాంఘిక, ఆర్థిక, రాజకీయాది పరిస్థితులచే నిర్ణీతములో దానిని వ్యక్తపరచుట, ఇవి మొదలైనవి. పురోహితులట్లు జన్మ నక్షత్రము నిరూపించిన జాలదు; సంఘము యొక్క అంగములయు, వ్యాపారములయు, తద్వికారములయు కారణముల నారసి, మార్పులన్నియు సహేతుకములనియు, సహజములనియు, నిరసనలనియు నిర్ణయించి, వ్యష్టి సమిష్టులకు గల సంబంధములను జూపి, చరితము యొక్క ఐక్యమును ప్రకటించుట చారిత్రకుని కర్తవ్యము."** (పేజీ24) విజ్ఞ విమర్శకులు కట్టమంచి వారు వంగూరి వారి 'ఆంధ్రవాఙ్మయ చరిత్రము' విశిష్టతను ఈ విధంగా ప్రస్తుతించారు. **"కవుల జీవితము మాత్రము పరిశీలించినచో భాషా సమష్టి చరిత్రము చక్కగా వేద్యము కానేరదు. వ్యష్టి కన్న మొత్తము మీద సమష్టి ప్రధానము. వాఙ్మయ సర్వస్వము ఏకసత్తుగా గొని చరిత్ర శోధనము చేసిన వారిలో వంగూరి సుబ్బారావు గారు ప్రథములు. ఈ చరిత్రలోని విషయము లితర గ్రంథముల యందును గన్పట్టినప్పటికిని, కర్త గారి దృష్టియు. అవి కూర్పబడిన తీఱును వేరు."** (పేజీ28)


A HISTORY OF THE TELUGU LITERATURE WRITTEN AND PUBLISHED UNDER THE DISTINGUISHED PATRONAGE OF Sri Sri CHELICANI LATCHA RAO GAR *Zamindar of Yernagudem etc., Chitrada.* GODAVARI DISTRICT.




రామలింగా రెడ్డి గారి మెప్పుదల వంగూరి వారికి కొండంత బలం ఇచ్చింది. ఆయన తన 'విన్నపము' లో కట్టమంచి వారికిలా కృతజ్ఞత ప్రకటించారు. **"ఈ పీఠిక నాయందే కొంత మార్పు నొందవించింది. రెండవ వారికి గాదు. న్యాయ మార్గముననే – వినయ మార్గముననే – నా గ్యమ స్థానము నేను చేరగలనని నాకు ధైర్య మొదవించినది."** (పేజీ.20)

ఓ ప్రజ్ఞానిధి యైన విమర్శకుడు మరో ప్రతిభాశాలి యైన రచయితను ప్రశంసించి, ప్రోత్సహిస్తే అతని ఆత్మవిశ్వాసం, ఆత్మబలం ఎంత పటిష్ఠం అవుతుందో, బలిష్ఠమవుతుందో వూహించు కోవాల్సిందే. అంతో ఇంతో భోళాశంకరుడైన వంగూరి సుబ్బారావు గారు ఎంత పొంగిపొయ్యారో! రెడ్డి గారి ప్రశంసావాక్యాలు విన్న మూడు రోజులకే పరమపదం చేరిన వంగూరి వారి ధర్మపత్ని వంగూరి శేషమాంబ ఎంత సంతోషించిందో. మొత్తం మీద 1920వ సంవత్సరం చివర్లో వంగూరి సుబ్బారావు గారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' వెలుగు చూసింది.

'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' లో 426 పుటలున్నాయి. తప్పొప్పుల పట్టిక 5 పేజీలు. వంగూరి సుబ్బారావు గారు చెన్నపురి నుంచి 20-10-1920 తేదీన సమర్పించుకొన్న 13 పేజీల 'విన్నపము', కట్టమంచి రామలింగా రెడ్డి గారి విశ్లేషణాత్మక పీఠిక 7 పేజీలు. ఇంకా వంగూరి సుబ్బారావు గారి గ్రంథప్రవేశము' 47 పేజీలు. అంటే వెరసి ఈ గ్రంథం 498 పుటల దాకా విస్తరించిందన్న మాట. ఈ బృహత్ గ్రంథాన్ని కొంత సవరించి, మరికొంత విస్తరించి, పాండిత్య పూర్ణమైన పీఠికను సంతరించి పరిశోధనా పరమేశ్వరులు

శ్రీ నిడదవోలు వేంకటరావు గారు 1937 లో దీని రెండవ ముద్రణకు దోహదకారులయ్యారు.

వంగూరు సుబ్బారావు గారు 'గ్రంథ ప్రవేశము' లో సునిశిత దృష్టిని, స్పష్ట భావవ్యక్తీకరణను ప్రదర్శించడం ప్రశంసనీయం.

వంగూరి సుబ్బారావు గారు **"మానవుడు ప్రకృతి సంబంధమున నానంద స్వరూపుడై తీయు కూను రాగముల సంగీతమే యాది కావ్యమని నాయభిప్రాయము"** (పేజీ.XIV) అంటారు. ప్రాక్తన మానవుని ఆవేశములోనే కవిత వుందనీ, అదే కావ్యారంభమనీ అంటారు. (పై పుటే) పిల్లల పాటల్లోనూ, భక్తి పాటల్లోనూ, ఊడుపు పాటల్లోనూ ప్రకృతి పరిశీలనమూ, రసములూ వున్నాయనీ జానపద కవిత్వమనే పేరు చెప్పక దానిలో దాగున్న కవిత్వ గుణాన్ని నూరేళ్ల కిందటే గుర్తించిన ద్రష్ట వంగూరి వారు. (పేజీ.XXIII) మధ్య భారతంలోని సాంచీ స్తూప నిర్మాతలు ఆంధ్రులేయని, ప్రాచీన కన్నడ కవులైన పంప, పొన్న, నాగవర్మ మొదలైన ఎంతో మంది తెలుగు వారే అని ప్రతిపాదించారు. తెలుగువారే కన్నడిగులకు 'విద్యా గురువు' (పేజీ.XXXV)లని వక్కాణించారు. వంగూరి వారు తమిళుల నుంచి పదజాలాన్ని అరువు తెచ్చుకోలేదనీ, కన్నడిగుల నుంచి లిపిని బదులు తెచ్చుకోలేదని సోదాహరణంగా పేర్కొన్నారు. (పేజీ.XXXVI) తెలుగు వారు ద్రావిడులు కారనీ, మరాఠీ వలె తెలుగు, కన్నడ భాషలు ప్రాకృత జన్యాలనీ విశ్వసించారు. (పేజీ.XLVII) సుబ్బారావు పంతులు 'గ్రంథ ప్రవేశము' లో తలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది కాదనీ, తెలుగు, తమిళ, కన్నడ ప్రాచీన కావ్య సంపద కంటే ఘనమైనదనీ చెప్పిన మాటలు చర్చనీయాంశాలే అయినా ఈ విషయ ప్రాధాన్యం తర్వాతి తెలుగు సాహిత్య చరిత్రల్లో కానరాకపోవడం గమనార్హం. అన్నింటి కంటే సాహిత్య చరిత్ర పాఠకులు గమనించవల్సిన ముఖ్య విషయం ఒకటుంది. అది వంగూరి సుబ్బారావు మహానుభావుడు వాడిన సరళ గ్రాంథిక భాషలోని జీవతత్వం, స్పష్టత. ఈ గ్రంథంలోని సరసత్వం, సూదంటు రాయిలా పాఠకుల్ని ఆకట్టుకొంటుంది. సాహిత్య చరిత్రల్లో స్పష్టంగా గోచరించే గాంభీర్యం, సాధారణంగా అగపడే వైదుషీ గరిమ వంగూరి వారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' లో తారసిల్లదు. సరళ సౌందర్య విభాసితమైన భాషాశైలి, పండితుల్ని చర్చలకు ఆహ్వానించే విలక్షణమైన ధోరణి మనకు తర్వాత వెలువడ్డ ఏ తెలుగు సాహిత్య చరిత్రలోనూ దర్శనమివ్వదు – ఒక్క ఆరుద్రగారి సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర నందు మినహాయించి.

వంగూరివారు తమ ఈ విలక్షణమైన శైలి గురించ తమ 'విన్నపము'లో ఇలా ప్రస్తావించడాన్ని గమనించాలి. **"చాలా చోటుల సిద్ధాంతములు చెప్పవలసిన చోట్ల నా యభిప్రాయములిట్లున్నవని చూపుచునే వచ్చితిని గాని, యాత్మవిశ్వాసము లేక స్వతంత్ర సిద్ధాంతము లొనర్పలేదు. చరిత్ర రచన కుండవలసిన యావేశము లేని వ్రాతలును, స్వ విషయము రాని వ్రాతలును వ్రాయక వీని నుపన్యాసముల వలె వ్రాసితిని. చరిత్ర చదువుట కిది సరసమని తలంచి యట్లొనర్చితిని. కేవలము సంవత్సరములు, విషయములు వ్రాసి చరిత్ర పఠనము కఠినముగ నొనర్చినచో 'వాఙ్మయ చరిత్రము' చదువవదలంచిన వారికి సులభముగ నుండదని యిట్లొనర్చితిని"** (పే. 18).

వంగూరివారు 'ఆంధ్ర' శబ్ద ఉత్పత్తి, దేశం, భాష, జాతి గురించి విపులంగా చర్చించారు. "సమాన వృత్తిధర్మములు గల సంఘమునందే జాతి బీజములారంభమైనను, జాతి ప్రారంభమునందు దానికి విశిష్టత లేదు.

**"సమాన వృత్తి ధర్మములు గల సంఘము నందే జాతి బీజము లారంభమైనను, జాతి ప్రారంభము నందు దానికి విశిష్టత లేదు. సభ్యత లేదు. అది క్రమాభివృద్ధి నొంది వాఙ్మయము, మతము, ప్రభుత్వము నేర్పఱచుకొని యితర జాతుల దృష్టి నాకర్షించినప్పుడే దానికి సభ్యత కలుగుచున్నది."** (పేజీ6) పంతులు గారు 'ఆంధ్ర' పదాన్ని కారువాక్కుగా నిరూపించలేదు కానీ మన జాతి చరిత్ర తెలుసుకోవాలంటే మన 'భాష' కై పెద్దపీట వేసితీరాలని మాత్రం చెప్పారు.

పంతుల వారు ప్రతిపాదించిన ఒకటి, రెండు విషయాలు చర్చకు దారి తీసేవిగా వున్నాయి. సంస్కృతానికి ప్రాకృతము మూలమనేది ఒకటి. ఆంధ్రభాష, లిపి నవీనమగు సంస్కృతం కంటే, దేవనాగర లిపి కంటే ప్రాచీనాలు అనేది రెండో చర్చనీయాంశం.

సుబ్బారావు గారు **"అది గాక పురాణములు, ప్రబంధములు, ద్విపద కావ్యములునని యొక్కొక్క విధమైన వాఙ్మయ స్వరూపము ననుసరించి దాని వృద్ధి క్షయముల జర్చించుట యుపయోగకరమని యట్లొనరించితిని."** (పేజీ32)

ఆంగ్ల విద్వాంసుడు మాక్‌డొనాల్డ్ 'సంస్కృత సాహిత్య చరిత్ర' లో పాటించిన ప్రక్రియాధ్యయన విధానాన్ని పాటించారు వంగూరి వారు. తెలుగు భాషలోని పదజాలంలో తమిళ, కన్నడ, అరబ్బీ, పార్శీ, హిందీ, మరాఠీ, భాషా పదాలు కొన్ని వున్నా, మన మహా కవులు వాడిన **"శబ్దజాల మంతయు సంస్కృత మహార్ణవము నుండి తీసికొనినదేయని మన మంగీకరింపక తీరదని తోచుచున్నది"** (పేజీ 37) యని వంగూరి వారు దృఢంగా నమ్మడం గమనించాల్సిన సంగతి.


వంగూరి సుబ్బారావు గారు 'వాఙ్మయము' పదానికిచ్చిన అర్థం, వివరణలు చూడండి. **"ఒక జాతి తన భాషలో, దన కవీశ్వరుల వలన నిర్మించుకొనిన కావ్య పరంపరలకే సారస్వతము, వాఙ్మయము నను మాటలు చెల్లును. కానీ నిర్జీవమగు గ్రంథములు వాఙ్మయము కాజాలవు. భాషకాని, పదజాలము కాని, వాఙ్మయము కాదు. కేవల**


**పద వికారములగు వాక్యములందు లక్షణ గ్రంథములు శాస్త్రములును గూడ వాఙ్మయము కాజాలవు."** (పేజీ 38,39) పంతులు గారు 'వాఙ్మయ' శబ్దమును రసవంతమైన కావ్యాలకే వర్తిస్తుందని భావించారు.

లక్షణ గ్రంథాలు, వ్యాకరణం, భాషాశాస్త్రం వగైరా వాఙ్మయం పరిధిలోకి రావన్న వంగూరి వారి అభిమతం గమనార్హం. సుబ్బారావు పంతులు గారు ఓ ముఖ్య విషయాన్ని ప్రస్తావించారు. **"ఏ భాష యందున్న కావ్యములకైన నన్యోన్య సంబంధ మెడ తెగకుండ నుండును. ఇది వఱకున్న వాఙ్మయమునకు గారణమగుచుండును. ఇది వఱకున్న కావ్యము, దాని స్వరూపము, దాని ప్రత్యేక ధర్మము, దాని గుణదోషములును దానికి బిమ్మట వచ్చు గ్రంథమునకు గారణమగును. ఈ కావ్యపరంపర సజీవమగు పదార్థము."** (పే.39). ఒక కాలావధి, యుగంలో వెలువడ్డ కావాల్యకు తర్వాత వెలువడే కావ్యాలకు సంబంధముంటుందన్న వంగూరి వారి అభిప్రాయం చాలా సూక్ష్మమైనదీ, సంగతమైనదీనూ.

వంగూరి వారు ద్రష్ట మహాకవి యొక్క సులక్షణాన్ని ఈవిధంగా పరామర్శిస్తారు. **"జాతి ధర్మమును నది లోకమునకు జాటు సందేశమును నూతన రూపముల దాల్చునట్లు చేయట వేర్వేఱు కవుల పనియైనను, వొక జాతి వాఙ్మయము నందొకే సందేశము లీనమై యుండును. అది మనకు బ్రత్యేకముగ గన్పట్టుచుండును. ఇతర వాఙ్మయము లందుండు గుణముల దీసికొని వానిని దన వాఙ్మయముగ జేసి, దాని స్వరూప స్వధర్మముల మార్చి, తనవిగా జేసికొని లోకమునకు జెప్పువాడే యా జాతి వాఙ్మయమును వృద్ధి చేసినవాడగును. కేవల భాషాంతరకర్త కవి కాజాలడు"** (పేజీ.41) శతాబ్దాల పాటు వర్ధిల్లిన వైవిధ్య, వైశిష్ట్య సంపన్నాలైన కావ్య నాటకాది రచనల భావము, వస్తువు, రచనల విశేషాల్ని గుదిగుచ్చడం సాహిత్య చరిత్రకర్తల లక్షణాల్లో ఒకటైనా, యుగధర్మాల విశ్లేషణ చేస్తూ, యుగ యుగాల సామ్య వైషమ్యాల్ని సూచిస్తూ ఆయా యుగ రచయితలు దర్శించి, ప్రదర్శించిన యుగసత్యాల్ని వెల్లడించడం ఉత్తమ సాహిత్య చరిత్ర కర్తల ప్రతిభా సామర్థ్యాల్ని చాటుతుంది. వంగూరి సుబ్బారావు గారి ఈ రచనలో ఈ సునిశిత దృష్టి ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

గ్రంథకర్త కావ్యం, కావ్య ప్రయోజనాలు, రసం సంబంధమైన విషయాల్ని ప్రస్తావించి వూరకున్నారే కానీ వాటి చర్చలకు దిగకపోవడం వింతగానే తోస్తుంది. వంగూరి వారి ఈ మాటలు వినండి..... **"రస మనుభవింపదగినది కానీ చెప్పదగినది కాదు. రసప్రలుబ్ధులగు ధీమంతులు నావంటి యజ్ఞునిచే దాని స్వరూప నిర్ణయ మొనరింప నాజ్ఞాపించుట కంటే మన వాఙ్మయ పరిశోధనమున దాని నితరులు ముట్టకుండ తామే యనుభవించుట క్షేమమని నేను కలుగజేసికొనుట మానితి నిందులకు విజ్ఞులు మన్నింతురు గాక!"** (పేజీ. 48)




వంగూరి సుబ్బారావు గారు బౌద్ధ, జైన, బ్రాహ్మణ మతాల స్థితిగతుల నేపథ్యాన్ని తెలుగు కావ్య రచనపై వాటి ప్రభావాల్ని చర్చించడం ఈ ఆంధ్ర వాఙ్మయ చరిత్రములోని ప్రత్యేకత. నేటికి నూరేళ్ల క్రితం వెలువడ్డ ఈ సుకృతిలో ఆంధ్ర దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజా జీవితంపై జైనమత ప్రభావం గాఢంగా ప్రసరించి వుండిందని కొన్ని ఉదాహరణలిచ్చారు రచయిత. **'జేందేవుని వలెనెంత పొడుగున్నావు'** అన్న సామెత, క్రీడాభిరామంలోని **'జనదేవుని నున్నని తలవలె'** అన్న ప్రయోగం, గోదావరి మండలాల్లో ప్రచారంలో వున్న **'తాటిపాక జేందేవుడు'** అనే పద ప్రయోగం ఈ పుస్తకంలో తప్ప తర్వాతి ఆంధ్రవాఙ్మయ చరిత్రల్లో కనపడదు. (పేజీ 50)

వంగూరి సుబ్బారావు గారు తెలుగులో నన్నయ్యకు పూర్వం బౌద్ధ, జైన కావ్యాలుండెననీ, అవి నశించిన – నశింప చేయబడిన తర్వాత వైదిక సాహిత్యం వృద్ధి చెందిందని స్పష్టంగా ఉద్ఘాటించారు. వంగూరి వారి ఈ మాటలు ఆలోచింపదగ్గవి. **"కావున మన తెలుగు జైన వాఙ్మయ శైథిల్యానంతరము కల్పించినట్లు మనకు నిదర్శనములు కన్పట్టుచున్నవి. ఇందువలన బ్రాహ్మణ వాఙ్మయమునకు బూర్వము తెలుగులో రచియించిన బౌద్ధ జైన వాఙ్మయములు ప్రస్తుతము నశించినట్లే మనము దుఃఖింపవలసి యున్నది. ఎప్పటికైనా నేటి టిబెటు దేశమునందో యే బౌద్ధారామము నందో తెలుగు గ్రంథములు దొరకగలవను శాంతినొంది వీలును బట్టి వానికి ప్రయత్నించెదము గాక."** (పేజీ 57) ఆ పుణ్యశ్లోకుని మహదాకాంక్ష నెరవేరే కాలం వస్తుందంటారా?

సుబ్బారావు పంతులు గారు 32 వ ఏట రచించిన తమ 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' లో నన్నయ భారత రచన నేపథ్యాన్ని ఖరాఖండిగా ఇలా వాక్రుచ్చారు.... **"అది వఱకు జన సామాన్యము నందనేక సంవత్సరముల నుండి పాదుకొని యున్న జైన మతాభిప్రాయముల బోగొట్టి, జైన మతమును విడువని వారిని జంపి, లేదా దేశభ్రష్టత నొనరించి, దేశమంతయూ బ్రాహ్మణ మతవ్యాప్తి నొనరించుటకు గూడ వారు భారత భాషాంతరీకరణము నారంభించిరి. కానీ కేవల దేశభాషా వాఙ్మయాభివృద్ధికి గాదు. అనగా**

**వారి కార్యము నందు వాఙ్మయాభివృద్ధి కంటే మతాభివృద్ధి నెక్కువగ గోరియుండిరి. క్షీణించుచున్న బ్రాహ్మణ మత వ్యాప్తియే వారి దృష్టి యందున్నట్లు నన్నయ రచనమే వేనోళ్ల జాటుచున్నది."** (పేజీ 58-59). అంతేకాదు**"మన పూర్వులు వాఙ్మయము కంటే మతమును వాఙ్మయ సాహయ్యమున నభివృద్ధి పఱచిరని చెప్పవచ్చు."** (పేజీ61) అని ఘంటాపథంగా ఘోషించిన వంగూరి సుబ్బారావు గారి సాహసాన్ని అభినందించి, వారికి అభివాదం చేయాల్సిందే కదా.

పంతులు గారు తెలుగులో వీరశైవ కావ్య రచనలు వెలువడటానికి ఉన్న నేపథ్యాన్ని వివరిస్తూ ఆంధ్ర ప్రాంతంలో వీరశైవం వేగంగా వ్యాపించడానికి కారణాన్ని ఇలా పేర్కొన్నారు. **"స్త్రీలు, బాలురు, పామరులు కూడా జదువుట కనువైన పాటలు, పాండిత్యము కానీ, సాహిత్య పరిశ్రమము కానీ యవసరము లేకుండా జదివి, గ్రహింపగల ద్విపద కావ్యములును సులభ శైలిని మతవ్యాప్తియే నుద్దేశముగ నుంచుకొని ప్రవాహ భాషలో నీ గ్రంథములు రాసి యుండుటచే నీ మత మతి శీఘ్రకాలమున వ్యాపించినది."** (పేజీ63)

వంగూరి సుబ్బారావు గారు 32 ఏళ్లకే పరిణత బుద్ధిమండితులైన వ్యక్తి. ఆ మహానుభావుడు తెలుగు వారు **'సహన తీక్షబుద్ధిశాలురు'** కావడం వల్ల వీర వైష్ణవ, వీరశైవ మత ఉద్యమాల ఉద్రేకానికి ఎక్కువగా లోనుకాలేదని, శంకర, మధ్వ, రామానుజ, బసవేశ్వరు ల్లాంటి మత గురువులెవ్వరూ ఆంధ్ర దేశంలో జన్మించి, మత ప్రచారం ప్రత్యక్షంగా చేయపోవడం వల్ల ఈ తెలుగు దేశంలో మత విద్వేష సంఘర్షణలు ప్రమాదకరంగా వాటిల్లలేదని అభిప్రాయపడ్డారు. (పేజీ. 72) అంటే మన తెలుగు వారిలో మతావేశం తక్కువని వంగూరి వారి అభిమతం.

వంగూరి సుబ్బారావు గారు "ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' ను రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో తొమ్మిది ప్రకరణాలు వున్నాయి. ఒకటవ, రెండవ, మూడవ ప్రకరణల్లో 'ఆంధ్ర' శబ్ద వ్యుత్పత్తి, ఆంధ్రజాతి, భాష గురించి, తెలుగు లిపి ఉత్పత్తి, పరిణామాలు, వాఙ్మయ నిర్వచనం, కవి, కావ్యం గురించి చర్చింపబడింది. నాల్గవ ప్రకరణంలో బౌద్ధ, జైన, వైదిక, వీరశైవ, ఇస్లాం,క్రైస్తవ మతాల ప్రస్తావన వుంది. ఐదవ ప్రకరణంలో పల్లవ, చాళుక్య, కాకతీయ, విజయనగర రాజుల, నాయక రాజుల గురించి సంస్థానాధీశుల సాహిత్య పోషణ గురించి వివరించబడింది. ఆరవ ప్రకరణంలోని 'కాల మహిమ – వాఙ్మయాభివృద్ధి' అను శీర్షిక వంగూరి వారి సూక్ష్మ పరిశీలనకు, సునిశితమైన లోచూపునకు తార్కాణం. వంగూరి వారు నన్నయ యుగం నుంచి ఆధునిక యుగము వరకూ వర్ధిల్లిన తెలుగు కావ్య పరంపరను, కవికుల సముదాయ కృషిని బేరీజు వేసిన విధానం నేటి ప్రబుద్ధ పాఠకుల్ని కూడా ఆకట్టుకుంది. మచ్చుకి వంగూరి వారి నికషోపల నిర్ణయాలు కొన్ని: **"12,13 వ శతాబ్ద ప్రాంతముల కవులు వీరు సాధారణ కవులు కారు. అనగా గేవల కవులు కారు. ఆ కాలము నందసాధారణ మేధావంతులని, విద్యాధికులని, దేశ రక్షకులని పేరు గాంచిన మహాత్ములే కవులైరి."** (పేజీ 109) శ్రీకృష్ణదేవరాయల కాలంలో **"కవి గౌరవము రాజు కంటే నధికమైనదని చెప్పవచ్చును. రాజుల యెడ గోపము చేతనేమి, భక్తి జ్ఞాన వైరాగ్యముల చేతనేమి యీ కాల మందాత్మ స్వాతంత్ర్యము గల కవులుదయించిరి. ఈ కవుల జన్మమే యాంధ్రవాణి పరమోత్కృష్ట దశను సూచించుచున్నది."** (పేజీ 111,112) తెలుగు కావ్య ఉత్థాన పతనాన్ని మనం ఈ ప్రబంధ యుగంలో చూడవచ్చునన్న సత్యాన్ని వంగూరి వారు ఇలా ఉల్లేఖించారు. **"లలిత వాఙ్మయము చిన్న ప్రబంధములు బయలుదేరినవి. తిక్కన నాటి దీక్షలేదు. పట్టుదల లేదు. తాత్కాలిక సుఖము – భక్తి యివి యీ కాలమందలి వాఙ్మయమున బ్రదర్శితము లనవచ్చు. రాజులును గవులును నుచ్చదశ కీయుగమున బోయిరి." "పెరుగుట విఱుగుట కొఱకే." "రాజ్యములు, వాఙ్మయము నున్నతదశ నుంచి క్రింద మొగము పట్టినవి."** (పేజీ115)

ఈ ప్రకరణం చివరి మాటలు వినండి. సుబ్బారావు పంతులు గారి సుభాషితాలు ఎంత అర్ధవంతాలో ఆచరణ యోగ్యాలో బోధపడుతుంది. **"కవులు తమ పూర్వుల కీర్తిని నిలువ చెట్టుకొని ధనము కొఱకు గావ్యములు కావు. కవిత కొఱకు గావ్యములు వ్రాయుదుమని భారతీ కరుణా కటాక్షమున శరపరంపరలుగ బయలుదేర వలసియున్నది. ధన బలమునకు జ్ఞానబల మెన్నడును నమస్కరింప కుండవలెను."** (పేజీ. 117)

పంతులు గారు ఏడవ ప్రకరణంలో 'అజ్ఞాతయుగము' శీర్షిక కింద నన్నయకు పూర్వం తెలుగు పద్యాలు శాసనస్థమై వున్నాయని, వ్యాకరణ గ్రంథాలుండినట్లు సాక్ష్యాలున్నాయని, సోదాహరణంగా నిరూపించారు. జయంతి రామయ్య పంతులు, గిడుగు రామ్మూర్తి పంతులు, చిలుకూరి వీరభద్రరావు పంతులు మొదలైన వారు వెలికి తీసి, వివరించి చెప్పిన యుద్ధమల్లుని, దీర్ఘాసి, అద్దంకి పాండరంగుని గుణగ విజయాదిత్యుని శాసనాల ఆధరాల్ని తర్కబద్ధంగా వ్యాఖ్యానించారు. నన్నయకు పూర్వం రచింపబడ్డ జైన కావ్యాలు, నన్నయ, తిక్కనలు రాసిన కొన్ని కావ్యాలు నశించిపోవుటకు సుబ్బారావు గారు కారణాల్ని ఇలా చెప్పారు. నన్నయకు ముందటి జైన, బౌద్ధ కావ్యాలు నశించిపోయేందుకు కారణం వైదిక విద్వాంసుల, వైదిక ధర్మ పోషణకు కంకణం కట్టుకున్న రాజులు.

"నన్నయభట్టే వ్రాసిన 'ఇంద్రవిజయము' 'రాఘవాభ్యుదయము' ను, తిక్కన వ్రాసిన 'విజయసేనము'ను భారత కాంతిలో మగ్గి మండి పోయినప్పుడితర గ్రంథములు నాశన మగుటలో నాశ్చర్యమేమున్నది ?" (పే.180) అన్న వంగూరి వారి మాటలు ఆలోచింపదగ్గవే.

**(గ్రంథాంతరంగం .... మిగతా వచ్చే సంచికలో ...)**

మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# కవిత్రయ భారతం - సార్వకాలీన ధర్మాలు

**ఏ. మారుతి,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 81421 41008

**పరిశోధన నేపథ్యం**

నేను ఓరియంటల్ విద్యార్థిని. అందులోనూ ఆంధ్రసారస్వత పరిషత్ లో చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, సి. నారాయణ రెడ్డిగారి బోధనలు రకరకాల సాహిత్య సభలు నా మీద ఎక్కువ ప్రభావం చూపాయి. కానీ తార్కికకోణం అలవడడానికి కొందరు సంప్రదాయ సాహిత్యాన్ని, కావ్యాలను వ్యతిరేకించడం నిందించడం వంటి మాటలను విన్నాను. వారితో నేను గొంతు కలపకుండా అందులో ఎంత నిజం ఉంది అనడానికి నేను స్వయంగా సాహిత్యంలోని కావ్యాలు, రామాయణం మొదలైన గ్రంథాలను చదవడం ప్రారంభం చేశాను. ఇతరులు చెప్పిన మాటలు వినడం కాకుండా వ్యాఖ్యాన కర్తలు, భాష్యకారులు ఇచ్చిన వివరణలో వారి దృష్టికోణాన్ని గమనించడం ప్రారంభమై, అది క్రమంగా నాకుకూడా అలవాటు అయింది. ఈ దారిలో నేను పూర్తిగా వాల్మీకి రామాయణాన్ని, పోతన భాగవతాన్ని, కొన్ని కావ్యాలను, విశేష వ్యాఖ్యానములను, చర్చలతో పాటు పండితులతో పరిచయాలు నన్ను మరింత ముందుకు సాగించాయి. పరిశోధనలో చేరిన కొన్ని నెలలకే నాకు ఉద్యోగం రావడంతో నా పరిశోధన కొంత క్లిష్టంగా మారింది.

**ప్రణాళిక : 1. అంశం మీద అవగాహన**

నా అంశం మీద స్పష్టమైన అవగాహన లేకుండా పరిశోధనలో ముందుకు సాగాలేనని ముందే నిర్ణయించుకున్నాను. మొదట సాహిత్యంలో వైదిక ప్రతీకలు, తర్వాత మహాభారతం వ్యక్తిత్వ వికాసం... ఇలా క్రమంగా మారుతూ చివరకు "కవిత్రయ భారతం - సార్వకాలీన ధర్మాలు" అనే అంశం మీద స్పష్టతను ఏర్పరుచుకున్నాను.

మనదైన కోణంలో చెప్పదలుచుకున్న అంశాన్ని ఇతర పరిశోధకులతో సమన్వయం చేసుకుంటూ సిద్ధాంతీకరించడం ఎలా చేయాలి అనే అంశంలో మార్గదర్శకులు కమలాకర శర్మ గారు చాలాసార్లు స్పష్టత ఇచ్చారు. కేవలం ధర్మ శబ్ద స్వరూప నిర్వచనాన్ని గురించి వేదమంత్రాలు, పురాణ, ఇతిహాస, కావ్య కథాసాహిత్యంలో, రకరకాల నిఘంటువులలో చెప్పబడిన అంశాల కోసం సుమారు ఆరు నెలలకు పైగా శ్రమించాను.

ఈ క్రమంలో ధర్మ స్వరూపము, ధర్మ విభాగాల గురించి పరిణామక్రమంలో స్వరూప అవగాహన ఏర్పడింది.

**2. గ్రంథ సేకరణ**

నేను డిగ్రీ విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఈరోజు వరకు రకరకాల తెలుగు సాహిత్య పరమైన గ్రంథాలను సేకరించడం నేను ఒక అలవాటుగా పెట్టుకున్నాను. అయితే అందులో అందులో ఏవి ముఖ్యమైనవి ఎంత ముఖ్యమైనవి మన దగ్గరలేని ఇతర గ్రంథాలు ఇలాంటివి సేకరించాలి అనే విషయంలో గురువులు ఆచార్య నిత్యానందరావు గారు అద్భుతమైన సూచనలు అందించారు. గ్రంథాలయంలో లభించని గ్రంథాలను, కొన్ని అరుదైన గ్రంథాలు అంతర్జాలంలో లభించే వాటిని నేను పిడిఎఫ్ గ్రంథాలు సేకరించి పెట్టుకున్నాను. వీటన్నింటినీ క్రోడీకరించుకొని. నాదైన కోణాల్లో సిద్ధాంతీకరించడం నా పరిశోధన.

**అధ్యాయ విభజన**

నేను నా అంశాన్ని ఐదు ప్రధాన విభాగాలుగా, మరికొన్ని ఉప విభాగాలతో కలిపి ఏర్పరుచుకున్నాను.

1. మొదటి అధ్యాయం అంతా **ధర్మశబ్ద వివేచనం.** వేద మంత్రాలలో ధర్మప్రస్తావన, అంశాలు ఎక్కడెక్కడ వచ్చాయి అనేది సేకరించుకొని, క్రోడీకరించి ఒక సూచికలాగా తయారు చేసుకున్నాను.

ఈ క్రమంలో గ్రంథ సేకరణ కోసంగా అంతర్జాలంలో లభించే కొన్ని పుస్తకాలను తిరుమల తిరుపతి దేవస్థానం వారి గ్రంథాలని, గీతాప్రెస్ గోరఖ్‌పూర్‌వారి సంస్కృత మహాభారతాన్ని పరామర్శిం చాను. ధర్మంలో జాతి, కుల,వ్యక్తి మొదలైన ధర్మాలు అన్నింటి ప్రస్తావన, ధర్మం కొరకు చెప్పబడిన ముఖ్య లక్షణాలు వాటి వివరణ పర్యాయపదాలు, నానార్థాలు, ధర్మసూక్ష్మాలు ఇవన్నీ కలిపి మొదటి అధ్యాయం.

**2. రెండవ అధ్యాయం**

**ధర్మం నిర్వచనం :** రకరకాల వ్యక్తులు వారివారి కోణాలలో నిర్వచనాలు ఇచ్చుకున్నారు. **"మానవుడు లేదా వ్యక్తి, వ్యక్తి స్థాయి నుండి విశ్వస్థాయికి పరిణామంచెందే వికాసమే మూర్తిమత్వం".** దానికి ఉపకరించే ప్రతి అంశం మరియు ఆ వికాసం చెందకుండా ఉండడానికి కారణం అయ్యే ప్రతిప్రధానాంశం ధర్మంతో ఏదో ఒక విధంగా, ముడిపడి ఉంటుంది. లేదా సంఘర్షించి ఉంటాయి. కాబట్టి మూర్తిమత్వం - ధర్మం పరస్పర అవినాభావ సంబంధాలు కలిగి ఉంటాయి.

మూర్తిమత్వం లేదా వ్యక్తిత్వం (Personality) వ్యక్తి యొక్క అంతర్గత బహిర్గత అంశాల సమీకరణం. సిగ్మండ్ ఫ్రాయిడ్

మొదలుకొని మానసిక తత్వవేత్తలు మొదలైన వారు ప్రతి ఒక్క వికాసానికి ఉపకరించే అంశాలు నిర్వహించిన తీరు, వాటిలో ధర్మం యొక్క పాత్ర ఈ అధ్యాయంలో ప్రధానఅంశం.

అయితే ఇందులో వ్యక్తిపరంగా కథాపరంగా మూర్తిమత్వాన్ని విశ్లేషిస్తున్నాను.

3వ అధ్యాయం – ఆది పంచకం, 4వ అధ్యాయం – యుద్ధ షట్కము, 5వ అధ్యాయం – శాంతి సప్తకం

ఈ అధ్యాయాలలో మహాభారతానికి ధర్మానికి గల సంబంధం. కథా సంవిధానంలో వాటి నేపథ్యంగా ధర్మం ఎలా ముడిపడి ఉన్నది. ఒక్కొక్క పాత్ర, ఒక్కొక్క సంఘటనలో ఎదుర్కొనే మానసిక ఘర్షణ ఆయాసందర్భాల్లో ధర్మం చర్చ ధార్మిక అంశాలు. రకరకాల ధర్మసూక్ష్మాల వివేచన, మొదలైన వాటి గురించి విడివిడిగా అధ్యాయాలలో ప్రస్తావించనున్నాను.

**ఉపయుక్త గ్రంథాలు**

ఆంధ్రమహాభారతం, తి.తి.దే. ప్రచురణ, సంస్కృత వ్యాసభారతం – గీతా ప్రెస్, గోరఖ్పూర్ ప్రచురణ, మహాభారతం ధర్మసూక్ష్మములు – మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారి గ్రంథము, మహాభారతం – ఉపదేశం, మహాభారతం – ధర్మాద్వైతం, మహాభారతం – నీతిబోధ, మహాభారతం – నీతిసూక్తి ముక్తావళి, మహాభారత – ఉపన్యాసములు, మనుస్మృతి – వావిళ్లవారి ప్రచురణ, పరాశరస్మృతి, English - Personnel management -Edvin.b. flippo, Human psychology, Dharma and its practice - Ramakrishna math మొదలైన గ్రంథాలతోపాటు అమరకోశము, ఆంధ్ర వాచస్పత్యము, పర్యాయపద నిఘంటువు, నానార్థ నిఘంటువు, అచ్చతెనుగు పదకోశం మొదలైన గ్రంథాలను పరిశోధనలో ప్రధానంగా వినియోగిస్తున్నాను.

**పొరపాట్లు**

ఒకసారి....వేదమంత్రాలు, అర్థశాస్త్రం. మనుస్మృతి మొదలైనవాటిలో ధర్మశబ్దం, దానికి సంబంధించిన అంశాలను కనబడితే సేకరించుకొని నేను 98 పేజీల సమాచారాన్ని ఏర్పరుచుకున్నాను. తీరా గురువుగారు కమలాకరశర్మ గారికి చూపించిన తర్వాత పరిశోధనలో వాక్య నిర్మాణం గురించి అనుచితమయిన అంశాలను తొలగించే పద్ధతి గురించి నాకు వివరించారు. ఆయన చెప్పిన పద్ధతిలో నేను సమాచారాన్ని ఏర్పరచుకుంటే చివరకు నాకు మిగిలింది 11 పేజీలు మాత్రమే. అనుచితమైన అంశాన్ని తొలగించుకోవడం అవసరమైనదాన్ని నా కోణాల్లో ఆవిష్కరించడం అనేది ఇందులో నేను నేర్చుకున్న ముఖ్యమైన అంశం. అనవసరమైన ఇతర గ్రంథాలు వెయ్యి ఏర్పరుచుకున్నా అది ఉపయోగపడదు. అప్పుడు అవి తలకుమించిన భారంగా అవుతాయని తెలుసుకున్నాను.

**సార్వకాలీన ధర్మం**

కాలం ప్రకారంగా ధర్మాన్ని విభజించడం అనేది మొదటినుంచీ ఉన్నదే. వ్యక్తిధర్మము, కులధర్మము, జాతి ధర్మములతోపాటు సర్వకాలీన ధర్మం అనేది ఇప్పటి వరకు ఇతరులు విశ్లేషించని దృష్టికోణం.

ధర్మానికి పదిలక్షణాలు ఉంటాయి అనేది అందరూ చెప్పిన విషయమే. కానీ దాని ముఖ్యలక్షణం "మార్పు". దేశ, కాల, పరిస్థితులనుబట్టి ధర్మం మారుతుంది. ఒకే వ్యక్తి – పిల్లల దగ్గర ఉన్నప్పుడు తండ్రిగా, తండ్రిదగ్గర ఉన్నప్పుడు పుత్రుడిగా ధర్మాన్ని ఆచరిస్తాడు. అందులో ధర్మాలు, ఆయా కాలాలకు మాత్రమే పరిమితం అయితే అవి సమకాలీన ధర్మాలు అవుతాయి. కానీ ధర్మం పరిణతి చెంది అన్ని కాలములయందు ఆపాదించబడిన అంశం అందులో గనుక ధ్వనిస్తే "అది సార్వకాలీన ధర్మము" అవుతుంది.

దానికి ఒక ఉదాహరణ మానవ ప్రయత్నం గొప్పదా దైవానుగ్రహం గొప్పదా అనే సంఘర్షణ ఎప్పటికీ ఉన్నదే.

**విను పురుషుడు గావింపని**
**పనులకు దైవమది యెట్లు ఫలమొనరించున్**
**జనములు గార్యము నడుపగ**
**ననుకూలత నిచ్చుగాక యయ్యయిఫలముల్**

**అనుశాసనిక. 1ఆశ్వాసము. 135**

**మ. వినుముద్యోగము రెంటియందు బర మూర్వీనాథ యుద్యోగవం**
**తునకున్ దైవము దోడ్పడంగ ఫలసిద్ధుల్ చేకురు....**

శాంతి. 2.127

దైవానుగ్రహం కోసం చేసే పూజా మొదలైనవాటి ఫలితములు ప్రత్యక్షంగా ఫలితాన్ని ఇవ్వవు అని ఆర్యోక్తి..(పరోక్ష సత్ఫలం కర్మ.... వేదాంతం డిండిమ) ఇటువంటి సందర్భంలో మానవ ప్రయత్నం తలరాత / దైవానుగ్రహం కంటే గొప్పవా? అనే సంఘర్షణలో మానవుడు ప్రయత్నపూర్వకంగా విధిని జయించవచ్చు అనే అంశాన్ని భారతము యోగవాశిష్ఠాది గ్రంథములలో నిరూపణ చేయబడినది.

ప్రయత్నించే వాడికి, ప్రయత్నించని వాడికి సమానంగా దైవానుగ్రహం ఉన్నప్పుడు, ప్రయత్నం అనేది సాధకుడికి అదనం శక్తినిస్తుంది. కాబట్టి మానవుని క్రియాశీలత గొప్పది. క్రియాశీలతను ఉద్దేశించుట ఇందులోని రహస్యార్థం.

విదురనీతిలో... "నిరారంభ గృహీచైవ, కార్యవాన్ చైవ భిక్షుకః, కంఠేబద్ధ్వా శిలాంగుర్వీం పాతయేచ్ఛైవ సాగరే...." అన్నాడు. తాను చేయవలసిన విధిని తప్పిన ఎవరైనా జీవించడానికి అర్హుడుకాదు అని దీనిఅర్థం. దీనిలో సామాజికత దృష్టికోణంతో పాటు క్రియాశీలత ద్యోతకమవుతుంది. ఇది సర్వ కాలీన ప్రయోజనం. ఇటువంటి ధర్మాలన్నీ సార్వకాలీన ధర్మాలుగా చెప్పుకోవచ్చు. స్వస్తి.

# సాహిత్యంలోనే ఒక కోహినూర్ దాశరథి 'బాల్యం'

**డా. తిరునగరి,** హైదరాబాదు. ఫోన్ : 9392465475

మనిషి జీవితంలో మరపురాని మధురమైన దశ బాల్యం. మళ్ళీ రాని వసంతం బాల్యం. వయస్సు పెరిగిన ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఓ సారి తమ గతాన్ని గుర్తు చేసుకోవడం సహజం. ముఖ్యంగా కవులు బాల్యాన్ని గుర్తు చేసుకొని ఆ జ్ఞాపకాలను కవిత్వీకరించిన సందర్భాలు ఎన్నో! ప్రపంచంలోని కవులు తమ బాల్యాన్ని అందంగా, కావ్యాలుగా రచించినవారే. ఆంగ్ల సాహిత్యంలో బాల్యంపై షేక్స్పియర్, కీట్స్, షెల్లీ వంటి ప్రముఖ కవులు రచించిన కవితలు సహృదయులకు తెలిసినవే. భారతీయ కవులలో రవీంద్రనాథ ఠాగూర్, సుభద్రాకుమారి చౌహాన్ వంటివారు బాల్యంపై రచించిన కవితలను మరచిపోలేము. ఆధునిక యుగంలో తెలుగు కవులలో అగ్రేసరులైన మహాకవి దాశరథి రచించిన 'బాల్యం' గొప్ప కవిత. ఇరవయ్యో శతాబ్దంలో బాల్యదశను గూర్చి పద్య, గేయ వచన ప్రక్రియలలో ఎన్నో కవితలు వచ్చినై. కాని అన్ని కవితలలో నాటికీ, నేటికీ సాహితీపరులు గుర్తుపెట్టుకున్న కవిత దాశరథి రచించిన బాల్యం ఒక్కటే. ఇది 'పునర్నవం' కవితా సంపుటిలోనిది.

**"దుర్మార్గాలకీ దుఃఖాలకీ ఇవతలి గట్టున**
**తొంగి తొంగి చూస్తున్న లోకం బాల్యం**
**ఈ లోకం ఎత్తిన వెన్నెల బావుటాలు**
**బ్రతుకులో రెపరెపలాడిస్తాయి"** అంటూ బాల్యాన్ని నిర్వచించారు దాశరథి.

**"అసలు బ్రతుకు ఆనందపు పొలిమేర**
**పసితనం కాక మరేముంది చెప్పండి?"** అని పాఠకులను ప్రశ్నిస్తారు. ఒక్కసారి బదులు వెతుక్కోవడానికి మన బాల్యంలోకి వెళ్ళిపోతారు. డబ్బు సంపాదనకు కావలసిన రహస్యాలు బ్రతుకులో ఉండని భాగం బాల్యం.

**"నిశ్శబ్దంగా నితాంత జీవితాల త్రాగిన పూచే**
**నిర్మలమైన ఎట్టి రోజా ప్రసూనం బాల్యం"**

ఎంత చక్కని ఉపమానం. యౌవనదశ వచ్చిన తరువాత వచ్చే వికారాలను, పరిణామాలను నమ్మించి మోసం చేయడం అన్నది తమ్ముళ్ళు తమ్ముళ్లను అన్నలు అనాయాసంగా పొడుచుకోవడం.

**"అందమైన ఆడదాని ఆలింగనం కొని అశ్రులు సాచడం దబ్బుకోసం గడ్డి తినడం, ఒక కోరికను తీర్చుకోవడానికి పది కోర్కెలు పెంచుకోవడం వంటివేవీ తెలియని చల్లని కాలం బాల్యం"** అన్నాడు దాశరథి.





**"ఉన్నదాన్ని వున్నవాళ్ళందరిలో పంచి**
**ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి**
**ఉజ్జ్వలంగా ఆటల్లో పాటల్లో పడి**
**ఊరంతా తిరగడం ఎంత బాగుంటుంది"**

ఈ పంక్తులు చదవగానే మనం బాల్యంలో అలా ఊరేగిన దృశ్యాలు మదిలో మెదలుతాయి.

**"సామ్యవాదం తెలియని సామ్యవాదులు బాలలు**
**ప్రజాస్వామ్యం అర్థం తెలియని ప్రజాస్వామికవాదులు బాలలు"** అంటారు కవి.

**"అగ్గితో ఆడుకుంటాడు**
**కత్తితో కవాతు చేస్తాడు**
**ఎత్తైన గిరి శిఖరం మించి**
**గిరి లంఘించేస్తాడు బాలుడు**
**ఇవన్నీ దేవుడు కానీ చేయలేడు"** అంటారు దాశరథి.

**"ఇసుక గూళ్ళు బంగళాలుగా తృప్తి పడడం**
**ఇంటి పక్క పసిదాన్ని ఇల్లాలుగా,**

## పేదరికమా.. చచ్చిపో...

నువ్వు లేకుంటే
నా లక్ష్యాలను నిర్మిస్తాను
ఓ ధనవంతుణ్ణి చూసి పెళ్లి చేసుకో
శకుంతల దగ్గర ప్రియంవదలా
నీ పాదదాసినై పడి ఉంటాను
రాజుగుర్రం మీద మహారాణిలా
రంగుల రాట్నం మీద పసిపిల్లలా ఊరేగు
నిన్ను కాపాడే అంగరక్షకుడిగా
నీ నవ్వును కాచే తండ్రిలా
గుండెల్లో పెట్టుకుంటాను
పేదరికమా నువ్వెళ్లిపో
నీకు అడ్డుపడే కట్టుబాట్ల ఆనకట్టల్ని
పడగొడతాను
నువ్వు పారిపోతే
రైలు టికెట్టు కైకిలికెళ్లయినా
కొనిపెడతాను
పోతూ పోతూ
పేపరోళ్లకు, పోలీసోళ్లకు ఎవ్వరికీ చెప్పకు
నేనెప్పటికీ నీకోసం వెతకను
నువ్వు చచ్చిపోతే
నీ పాడెను నేనొక్కడినే మోస్తాను
నీ దినాలకు వెయ్యిమందిని పిలిచి దావతు చేస్తాను
నీ తద్దినానికి పదివేల మందితో శ్రద్ధాంజలి ఘటిస్తా
ఓ పేదరికమా నీకే వరం కావాలో కోరుకో
నీ రోగం వస్తే నయం చేసే డాక్టర్లు లేరు
నీతో స్నేహమే ఓ శాపం నీతో మాట్లాడటమే ఓ నేరం
నువ్వు నేరుగా వచ్చి హత్య చేసినా బాగుండు
స్వేచ్ఛగా బతకనివవ్వవు ప్రశాంతంగా చావనివ్వవు
మనుషులంతా ఏ స్థాయిలో ఉన్నా
నీ రూపం నిత్య నూతనమే
నీ శక్తి నవయవ్వనమే....

**పులుమద్ది సత్యనారాయణ**
**పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం**
**ఫోన్ : 9441 000 537**

**లోకమంతా సంసారంగా అనుభూతి చెందడం**
**బొమ్మలకు పెళ్ళిళ్లు చేసి నవ్వడం**
**బొమ్మల్ని చంకల్లో పెట్టుకుని నవ్వుతూ**
**ఇల్లిల్లూ సంచారం చేయడం**
**అవే బొమ్మల్ని నలిచి నేలకు కొట్టడం**
**ఆడటం పాడటం నవ్వటం తుళ్ళటం**
**ఏడ్చి ఏడ్చి మరుక్షణం అంతా మరచి**
**నిర్విచారంగా నిద్రపోవడం**
**మనం మళ్ళీ అలవరచుకోగలమా?**
**మరల ఆ బాల్యానికి చేరగలమా?"**

ఇదంతా చదువుతుంటే మన బాల్యంలోని అనుభవాలనే కవి కవితగా రచించారేమో అనుకుంటాము.

**"జీవితంలో కొన్నేళ్లపాటు**
**అమూల్య ఆనందాన్ని అందించే**
**అద్భుతశక్తి బాల్యం"** అంటారు దాశరథి.
**"కృత్రిమాల కుడ్యాల చాటున**
**కంపులో సంతోషం వుందని భ్రమపడే మనందరికీ**
**మళ్ళీ ఏనాటికైనా ఆ ముత్యాల నవ్వుల జల్లులు**
**లభించేనా! లాలించేనా'** అని ఆవేదన చెంతుతారు.

**"దైనందిన జీవన సమస్యల్ని మరచి**
**దుఃఖాలు మరచి దుర్మార్గాలు మరచి**
**దాపరికాలు దొంగవేశాలు మరచి**
**వినిర్మలానంద పథాల మీద**
**నీడలు లేని మెత్తని వెన్నెలల్లో**
**ముళ్ళు లేని పువు తీగల ప్రక్కగా**
**దుర్గంధం లేని మనస్సు కుల్యాజలంతో**
**బాల్యం అనే నౌక మీద పయనించే**
**దివ్య సమయాలు మళ్ళీ వచ్చేనా?"** ఏమో అంటూ నిట్టూర్చారు. 'బాల్యంలోని ప్రతి పంక్తిలో మనమే కనిపిస్తాము. మన జీవితమే కన్పిస్తుంది. కవితను పూర్తిగా చదివిన తరువాత ప్రతి పాఠకుడు ఓ తాత్త్విక లోకంలోకి వెళ్ళిపోతాడు. మనిషి బాల్యం ఎంత పవిత్రంగా ఉంటుందో యౌవనంలో అడుగుపెట్టిన నాటినుండి ఎంత వికారంగా కంపుగా ఉంటుందో, మనసున్న మనిషి సిగ్గుపడేవిధంగా వత్తి చూపించిన వైనం హృదయాన్ని ద్రవింపజేస్తుంది.

ఇంత చక్కగా నేర్పుగా ఏ కవీ బాల్యదశ గురించి వర్ణించనే లేదు. ఆ బాల్యంలోని మాధుర్యాన్ని, మంచితనాన్ని దాశరథి బాల్యం గురించి చెబుతుంటే మనం ఆశ్చర్యపోతాం. ఆనందిస్తాం. అహో! అనుకుంటాం.

**'బాల్యం' అను గేయం సాహిత్యంలోనే ఒక కోహినూర్"**
– పి.వి. రత్నం (గోలకొండ పత్రిక)

# ఆరు దశాబ్దాల సాహిత్యపు మావి – మన పీ.వీ.

**డా. వొజ్జల శరత్ బాబు**, ప్రభుత్వ ఉపాధ్యాయులు, హైదరాబాదు. ఫోన్ : 9494183937

I cannot correct the wrongs

I cannot show the way

I cannot punish those who go astray

I cannot even live in happy unconcern as countless others do

so what is the point of my worry

at what happens in the world.

–1999 నవంబర్1న జె.ఆర్.డి.టాటా స్మారక ప్రసంగంలో పి.వి ఉదాహరించిన కాళోజీ నారాయణ రావు గారి కవితకు కొన్ని ఆంగ్లానువాద పంక్తులు.. (కాళోజి గారి ఆవేదన)

బహుభాషా అభ్యాసనాశీలుడైన శ్రీ పాములపర్తివేంకట నరసింహారావు అనేక భాషల్లో తన పాండితీ ప్రతిభను ప్రదర్శించారు. ఇలాంటి వ్యక్తి మరొకరు లేరు అని చెప్పడం అతిశయోక్తి కాదు. సొంత రచనలు చేశాడు. అనువాద రచనలు చేశాడు. వాటిలో భావ గీతాలు రాశాడు. పీఠికలను అందించాడు.. సమీక్షలు చేశాడు. పద్య కవిత్వం వెలయించారు.వచన కవిత్వం రాశాడు. ద్విపదలు, గీతాలు రాశాడు. సాహిత్య ప్రసంగాలు చేశాడు. కృతిభర్తగా ఉన్నాడు. సంపాదకుడిగా కీర్తి పొందాడు. నాటకం రాశాడు. కథలు రచించాడు. నవలలు సృజించారు. వ్యాసజ్యోతులను వెలిగించారు. ఇలా ఎన్ని ప్రక్రియలలో ఆయన రచనలు కీర్తి పొందాయో! మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్, స్పానిష్ మొదలైన భాషల్లో ఆయన రచనా విస్తృతి కనబడుతుంది.

జయచంద్రా హైందవధర్మ విధ్వంసక! అని మకుటంతో పద్యాలు రాయడం మొదలుపెట్టిన నాటినుండి ది ఇన్ సైడర్ రెండవ భాగం రచనా ప్రణాళికాకాలం వరకు ఎన్ని రచనలు ముద్రితమైనవో!. అముద్రితమైనవి ఎన్నో? రాయాలని అనుకొని రాసినవి కొన్ని. రాయాలనుకొని రాయలేకపోయినవి ఎన్నో? ఆయన సాహితీ సేవ అనేది ఇది కేవలం రచన తోనే కాదు ఆయన భాషాతత్వంపై ముడిపడి ఉంది. హైదరాబాదులో ఉర్దూ విశ్వవిద్యాలయం స్థాపనలో ఆయన కృషి ఎంతో ఉంది. కౌలాలంపూర్ ప్రపంచ తెలుగు మహాసభలలో ఆయన చేసిన నిరుపమానమైన సేవ మర్చిపోలేనిది. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం తిరుపతిలో స్థాపించడంలో ఆయన చేసిన కృషి అనన్యమైనది. ఆకాశవాణిలో అటు సంస్కృతంలో ఇటు ఉర్దూలో వార్తా పఠన ప్రసారం చేయడానికి బీజాలు వేసిన తీరు అద్భుతం. అవి నేటికీ కొనసాగి కొనసాగుతూ అందరి మన్ననలను పొందుతూనే ఉన్నాయి.



**పీవీకి** ఆనంద మఠ్, గోదాన్, ఘోర, చరిత్రహీన్ అనే అభిమాన గ్రంథాలున్నాయి. శరత్ సాహిత్యం అంటే చాలా ఇష్టం. శరత్ సాహిత్యంలో 'శేష ప్రశ్న' ఆయనకు అమితంగా నచ్చిన రచన. ఆయన్ని ప్రభావితం చేసిన రచన.

ఆయన తన దగ్గర ఉన్న పుస్తకాలే కాదు తనకు అనేకమంది బహుమానంగా ఇచ్చిన సాహిత్య గ్రంథాలను వీలు ప్రకారం చదివేవాడు. చిన్నప్పటినుండి రామాయణ–భారత భాగవతాలతో పాటు ఎన్ని గ్రంథాలు చదివాడో!. తెలుగులో వెంకటపార్వతీశకవులు, గురజాడ అప్పారావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు, మొదలగు వారి పుస్తకాలను చదివాడు. రవీంద్రనాథ్ ఠాగూర్, బంకించంద్ర చటర్జీ, ప్రేమ్‌చంద్ మొదలగు రచయితల సాహిత్యాన్ని చదివాడు. ఇవి కాక ఇంగ్లీషులో స్పానిష్ లో కన్నడ మరాఠీ మొదలగు భాషల్లో ఎన్నో గ్రంథాలు చదివాడు. భారతదేశంలో అనేక భాషల్లో ప్రావీణ్యం ఉండి వివిధ భాషల సాహితీ పుస్తకాలు ఎక్కువగా చదివిన వ్యక్తి మరొకరు లేరేమో అని అనిపిస్తున్నది. చిన్నప్పటి నుండే సాహిత్యంలో మునిగిన వ్యక్తి సాహితీ స్రష్ట ద్రష్ట కాక మరేమవుతారు? ఆయన రచనలను పరిశీలిస్తే విషయమంతా అవగతమవుతుంది.

**పద్యరచన :** కీర్తిశేషులు గార్లపాటి రాఘవరెడ్డి గారి శిష్యుడుగా పీవీ పద్యకవిత్వంపై ఆసక్తి పెంచుకున్నాడు. అందుకే పృథ్వీరాజ్ చౌహాన్ స్మరణలో పివి గారు 'జయచంద్రా! హైందవ ధ్వంసకా' అనే మకుటంతో కొన్ని పద్యాలు రాశాడు. 'దేవుని అభిశంసనం'

అనే పేరుతో యువకుడిగా ఉన్నప్పుడే కొన్ని పద్యాలు రాశాడు. భర్త్సన అనే ఖండ కావ్యం కూడా రాసినట్లు తెలుస్తోంది. ఇదీ ఆయన పద్య రచన వ్యవసాయం.

**కథారచన :** 'మంగయ్య అదృష్టం' అనేది ఓ పెద్ద కథ. దీన్ని నవలికగా చెప్తారు. ఆంధ్రప్రభ వారి 1999 నవంబర్ 8న దీపావళి ప్రత్యేక సంచికలో ఇది ముద్రితమైంది. ఇక మరో కథ విజయ అనే కలం పేరుతో రాశారు. అది కాకతీయ పత్రికలో 1989 ఆగస్టు 5న అచ్చయింది. అదే 'గొల్ల రామవ్వ కథ'. మంత్రి గారు, ఎదవ నాగన్న కథ అనేవి మరో రెండు కథలు రాశారు.ఇలా ఆయన కథాసేద్యం ప్రాచుర్యం పొందింది.

**తెలుగు లోకి అనువాదాలు :** 'ద ఇండియన్ కాన్స్టిట్యూషన్' అనే ఆంగ్ల గ్రంథాన్ని 'భారత సంవిధానం'గా తెలుగులోకి అనువదించారు. థామస్ గ్రే రాసిన ఎల్జీ నీ తెలుగులోకి అనువదించారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత "khandalkar" హండి రాసిన నవల యయాతి దీన్ని తెలుగులోకి అదే పేరుతో అనువదించారు. హరి నారాయణ ఆప్టే రచించిన మరాఠి గ్రంథం 'ఫణ్ లక్షత్ కెన్ ఘతో' ను తెలుగులోకి అనువదించారు. దాని పేరు అబలా జీవితం. ఇక భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి భార్య లలితాశాస్త్రి రాసిన 'మేరా పతి మేరే దిల్' అనే ఆత్మ కథ సంబంధం రచనను తెలుగు చేశారు. ప్రముఖ హిందీ కవులైన నందలాల్, సూరదాస్ లు రచించిన దోహాలను తెలుగులోకి తర్జుమా చేశారు.

1971లో కేంద్ర సాహిత్య అకాడమీ మీ పురస్కారాన్ని పొందిన మరో అనువాదం రచన సహస్ర ఫణ్. ఇది తెలుగు నుండి హిందీ లోకి అనువాదం. 1971లోనే అచ్చయింది. ఈ నవల దూరదర్శన్ ద్వారా ధారావాహిక ప్రసారమైంది. హిందీ లోనే కాక మరికొన్ని భాషల్లో కూడా ప్రసారం అయినట్లు తెలుస్తున్నది. హిందీలో వచ్చిన తర్వాత మరాఠీ గుజరాతీ భాషల్లోకి కూడా సహస్రఫణ్ అనువాదమైంది. దీని మూలం తెలుగు రచన వేయి పడగలు. దీని రచయిత జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ.

ప్రముఖ రచయిత్రి జయప్రభ రాసిన 'ఊహించలేని ఆప్యాయతకు' "Unforeseen affection" అనేది పివి గారి ఆంగ్లానువాదం. "Other love poems" అనే పేరిట జయప్రభ గారి ఇతర ప్రేమ కవితలు అనే తెలుగు రచనలు అనువాదం చేశారు.

**వ్యాసరచన :** పీవీ అనేకమైన వ్యాసాలు రాశాడు 1945 – 1952 ఈ మధ్యకాలంలో నడిచిన కాకతీయ అనే అనే పత్రికలో తన వ్యాసరచన ప్రారంభించారు. జయ, విజయ అనే కలం పేర్లతో వ్యాసాలు రాశారు. అలా మొదలైన ఈయన వ్యాసరచనా పరంపర కొనసాగింది. 2002లో ప్రతిభా వైజయంతి అనే ఫిలిం మేగజైన్ లో ప్రచురితమైన 'భారతీయ చలనచిత్రాల్లో మరణ సన్నివేశాలు' అనే వ్యాసం ప్రసిద్ధి పొందింది. 1989లో మెయిన్ స్ట్రీమ్ అనే పత్రికలో రాసిన ఒక రాజకీయ వ్యాసం మన్ననలను పొందింది. హిందీ మహా రచయితల్లో ఒకరైన మహాదేవి వర్మ రహస్య వాదంపై అద్భుత వ్యాసాన్ని వెలువరించారు. రహస్యవాదం అంటే భారతీయ తాత్విక గాంభీర్యం మరియు ఛాయావాదం వీటితో సంతరించుకున్నదే మహాదేవి వర్మ రహస్య వాదం. దీనిపైనే పి.వి. ఓ గొప్ప వ్యాసాన్ని రాశారు. "The Ayodhya 6th December" 1992 అనే మరో ఆంగ్ల రచన ఆయన మరణం తర్వాత అచ్చయింది.

జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న అనేక పుస్తకాలకు ఆయన ముందుమాట రాశారు. తన సోదరుడు పి వి మనోహర్ రావు గారు రాసిన కైలాస దర్శనం అనే పుస్తకానికి ముందుమాట రాశారు. ఇలా ముందు మాటలు రాయడం పుస్తక సమీక్షలు రాయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అమరేశ్వరం రాజేశ్వర శర్మ ,ఎస్వీఎస్ వెంకటాచారి గార్లు సంయుక్తంగా సంపాదకత్వం వహించిన 'శారదమంజీరం' అనే పరిశోధనాత్మక తొలిపలుకు రాశాడు.

**ప్రసంగాలు :** సముద్ర వసనే దేవి పర్వత స్తన మండలే.... అనే శ్లోకానికి అనువాదాన్ని చేస్తూ 1992లో జూన్ 10న జరిగిన 114 దేశాలు రియో డి జనీరో సమావేశంలో ఆయన చేసిన ప్రసంగం సుప్రసిద్ధం. ఆ సమావేశంలో ఆయనదే తొలి ప్రసంగం. 1991లో భారత ప్రధానిగా తెలుగులో ఆయన చేసిన ప్రసంగం ఒక చారిత్రాత్మక ఘట్టం. ఇది పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రెండవ స్నాతకోత్సవాల్లో ఆవిష్కృతమైంది. ఇలా అనేక సభల్లో, సమావేశాల్లో, ఉత్సవాలలో, పివి గారు చేసిన ప్రసంగాలు అమూల్యమైనవి.

**సంపాదకుడిగా :** 'సాహిత్య కార్ ప్రతిష్ఠాన్' అనేది ఢిల్లీలో ఉన్న హిందీ రచయితల సంస్థ. అది హిందీ ప్రాంతాల రచయితలకు చెందిన సంస్థ. ఆ సంస్థకు ఈయన అధ్యక్షులుగా పనిచేశారు. దానిద్వారా 'సమ్ వేత్ స్వర్' అని ద్వైమాసిక పత్రికను తన సంపాదకత్వంలో ప్రచురించారు.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధికారికంగా ఒక ప్రత్యేక సంచికను ప్రకటించింది. దానికి పీవీనే సంపాదకుడు. ఇలా సంపాదకుడుగా ఉన్న తొలినాళ్ళనుండి తన రచనలతో అందరినీ ఆకట్టుకునే వాడు. అలీన దేశాల శిఖరాగ్ర సభలో పీవీ స్పానిష్ భాషలో చేసిన ప్రసంగం క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రోను అపరిమితంగా ఆకర్షించింది. అది ఆయన భాష పటుత్వం. అవి ప్రసంగాలే కావచ్చు లేదా చేసిన రచనలే కావచ్చు.

ప్రసిద్ధి పొందిన లోపలి మనిషి అనే తెలుగు రచనకు మూలం పివి గారి ఇ ఇన్ సైడర్. దీన్ని ఆత్మకథ రూపక నవలగా చెప్పవచ్చు. యావత్ భారతదేశంలో ద ఇన్సైడర్ పొందిన కీర్తి అపారం. ఇది


1998 లో ఆంధ్రప్రభ దినపత్రికలో లోపలి మనిషి గా కల్లూరి భాస్కరం గారు అనువాద రచన చేశారు. ఇది ధారావాహికగా వచ్చింది. ఇన్సైడర్ టు అనేది ఆయన రచన ప్రణాళికల్లో ఉండే కానీ అది పూర్తి కాలేదు. ఆయన అనుకున్న పూర్తి కాలేకపోయిన రచనల్లో విశ్వనాథ వారి రచనలు కూడా ఉంటాయి.

ద రిశిద్రం అనేది పివి ఇంగ్లీష్ నాటిక. ఇంగ్లీష్ లోను పీ.వీ కథలు రాశారు. ఈ కథల్లో 'ది బ్లూ సిల్క్ సారీ' అనేది అనేకమంది ప్రశంసలు పొందింది. "The minister, The reshuffle, The forgotten briefcase, The secret of ballot, The guest", మొదలైన ఆంగ్ల కథలను రాశారు. స్పానిష్ భాషలో కూడా రెండు కథలు రాశాడు.

**కృతిభర్త గా పీ.వీ. :** తాను కృతికర్త నే కాదు కృతి భర్తగా కూడా కీర్తిని పొందాడు. 1980లో వానమామలై జగన్నాథచార్యుల వారి రైతు రామాయణానికి కృతిభర్త అయినాడు. ఇక ఆయన చాలా అభిమానించే, ఇష్టపడే రచయిత విశ్వనాథ సత్యనారాయణ గారి విశ్వనాథ సాహిత్య సురభి అనే గ్రంథాన్ని 1969లో అంకితం తీసుకున్నారు. ఇందిరా విజయం అనే మరో పుస్తకానికి ఆయన కృతిభర్త. ఈ రచన కొత్త రాజిరెడ్డి గారిది. 1973లో ఈ స్వీకరణ జరిగింది. ఇలా ఆయన అంకితం తీసుకున్న పుస్తకాలు మరెన్నో ఉండవచ్చు.

**గ్రంథరచనా కారకుడు :** ఇంత సాహిత్య సేవ చేసిన పి.వి మరో కోణంలోనూ కీర్తి పొందాడు. ఆయన పైనా పుస్తకాలు వచ్చాయి. అవి ఆంగ్లంలో హాఫ్ లయన్ అనే గ్రంథం. వినయ్ సీతాపతి గారు 2016లో వెలయించారు. ఇక జైరాం రమేష్ అనే రచయిత 'ది బ్రింక్ అండ్ బ్యాక్ ఇండియాస్ 1991 స్టోరీ 'అనే రచన పీవీపై వెలువరించారు.

ఆరు దశాబ్దాల సాహిత్య జీవితం అనేక భాషల్లో ఓతప్రోత వాహినిగా నిలిచింది. దేవులపల్లి రామానుజ రావు గారు, కాళోజీ నారాయణరావు గారు, సామల సదాశివ గారు మొదలైన వ్యక్తుల సన్నిహితత్వం మొదటినుంచి ఆయన్ని సాహిత్య హిమాలయాల వైపు దూసుకెళ్ళేలా చేసింది. తొలి అడుగుల్లో కాకతీయ పత్రికలోనే నాలుగు కథలు ప్రచురణ అయినట్టు తెలుస్తున్నది. ఎన్నో మ్యాగజిన్లలో వివిధ రకాల ప్రక్రియలను సృష్టించారు. పీవీని కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ తో సన్మానించింది. అదీ ఆయన కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు. వీటన్నింటికీ అదనంగా మరో విశేషమేమంటే జ్ఞానపీఠ పురస్కారం కమిటీకి తొమ్మిదేళ్ల చైర్మన్ గా విశిష్టమైన సేవలు అందించాడు. పీవీ చేసిన సాహితీ సేవ అనేక కోణాల్లో విస్తరించి ఉంది. అది సముద్రమంత కనబడుతుంది. రాజకీయ నాయకుడిగా ఉంటూనే ఇంతటి సాహితీ సేవలో నిమగ్నం కావడమనేది అనన్య సామాన్య విషయం.




**"నా జీవితంలో ఎందరెందరికో నా చేతి మీదుగా పురస్కారాలు ఇవ్వడం సన్మానాలు చేయడం జరిగినా స్వయంగా స్వీకరించడం అంటే నాకు మనస్కరించలేదు. జన్మదినోత్సవాలు మొదలగు వాటితో ప్రారంభించి ప్రతి దశకం పూర్తి వైభవంగా జరుపుకోవడం, విశ్వవిద్యాలయాలు ఇచ్చే డిగ్రీలు, సమకూర్చిన ఊరేగింపులు, సన్మాన కిరీటాలతో పాటు, రాజ లక్షణాలతో ప్రతిబింబించే వేషాలు – అంటే అసలే జీవితం మిథ్యైతే దానికి మరో మిథ్యను జోడించడం అనేది అదోలా అనిపించింది.**

**ఇలాంటి అనేక కార్యక్రమాలలో అక్రమములేమీ లేకున్నా నాకవి రుచించలేదు. ఎందుకు? అని అడిగితే దానికి జవాబు లేదు. పుర్రెకోగుణం–జిహ్వకో రుచి అంటారుగా. అంతే. ఇలాగే జీవితం సాగిపోతోంది."** అనే మాటలు అజోవిభో ఫౌండేషన్ వారి 2002 ప్రతిభా పురస్కారాంగీకర సందర్భంలో పీ.వీ.గారి పలుకులు. ఇలాంటి మాటలు ముత్యాలనెన్నింటినో మనం ఆయన నుండి ఏరుకోని భద్రపరచుకోవచ్చు.

అందుకే –

పీవీ నరసింహారావు సాహితీ భగీరథుడు!

వసుధైక భాష భావం కలిగిన భాషా మురళీకృష్ణుడు !

సాహితీ సౌజన్య మూర్తి!

నిత్య సాహితీ కృషీవలుడు!

# పద్యమనోహరం - 17


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు,

వరంగల్, ఫోన్ : 994 901 3448


**"జనలోకైక మహారథుండు ద్విజరక్షా దక్షుదాజింద్రిలో**
**చనుదుద్యచ్చతురంగ సైన్యుడును భాస్వద్రూప పంచాస్త్రుడ**
**న్య నృప క్రౌంచ షడాననుండు ఘన సప్తాశ్వాన్వయుండష్టమం**
**త్రినవ ద్రవ్యనిధీశుడై దశరథాధీశుండు పెంపొందుచున్"**


ఇదొక విశేషమైన పద్యం. తెలుగు రామాయణాల్లో విశిష్ట కీర్తి నార్జించుకొన్న భాస్కర రామాయణంలోని యీ పద్యం మిక్కిలి వైచిత్రితో కూడింది. ఇది దశరథుణ్ణి గురించి వర్ణిస్తున్న పద్యం. ఈ పద్యంలో ఒకటి నుండి పది అంకెల వరకు ఉండటం ఒక విశేషం. దశరథుడు జన లోకైక మహారథుడు. ఇందులో 'ఏక' పదం. ద్విజరక్షా దక్షుడులో 'ద్వి', యుద్ధ సందర్భంలో త్రిలోచనుడులో 'త్రి', చతురంగ బలాలు కలిగినవాడులో 'చతుః', రూపంలో పంచాస్త్రుని వంటివాడులో 'పంచ', అన్య నృప క్రౌంచ షడాననుడులో 'షట్', ఘన సప్తాశ్వాన్వయుడులో 'సప్త', అష్టమంత్రిలో 'అష్ట', నవ ద్రవ్య నిధీశుడులో 'నవ', దశరథాధీశుండు'లో 'దశ' – ఇట్లా దశరథుని ఘనతను కీర్తిస్తూ కవి పది సత్యాలు వచ్చేవిధంగా చెప్పే ఈ అందమైన రచనా చమత్కృతి కలిగిన పద్యం. దశరథుని గొప్పదనాన్ని చెబుతూనే పాలకునికి ఉండవలసిన కొన్ని లక్షణాలను కూడా చెప్పే ప్రయత్నం చేశాడు భాస్కర రామాయణకర్త.

అయోధ్యాపుర వర్ణన సందర్భంలో ఉన్న ఈ పద్యంలో రాజైన వ్యక్తి తన రాజ్యంలోని బ్రహ్మజ్ఞానులైన మహనీయులను ఎల్లప్పుడు రక్షించే విషయంలో మిక్కిలి దక్షత చూపించాలి. ఏ రాజ్యంలోనైనా జ్ఞానులకు హాని కలుగరాదు. అదేవిధంగా యుద్ధవిద్యలో పరమేశ్వరుని అంతటి పరాక్రమాన్ని చూపగలగాలి. తన సైన్యాన్ని సర్వ సమర్థ సైన్యంగా తీర్చి దిద్దుకోగలగాలి. పాలకుడు చతురంగ బల సంయుతు డైతే తప్ప రాజ్య రక్షణ సులభం కాదన్న సత్యం బోధ పడుతుంది. శత్రురాజుల విషయంలో కుమారస్వామి వంటి పరాక్రమాన్ని చూపగలగాలి. దుర్భేద్యమైన క్రౌంచపర్వతాన్ని కూడా ఛేదించగలిగిన పరాక్రమం కుమారస్వామిది. సమర్థుడైన పాలకుడు కూడ ఎంత దుర్భేద్యమైన శత్రురాజ సమూహాన్నైనా ఛేదించగలిగే పరాక్రమాన్ని కలిగి ఉండాలి. ఏ రాజ్య పాలకునికైన ఉత్తమ మంత్రాంగం చేసి మార్గదర్శనం చేసే మంత్రివర్గం ఉండాలి. అప్పుడే రాజ్యం, రాజ్యంలోని ప్రజా సమూహం సుఖ సంతోషాలతో ఉంటుంది. తన పాలన ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సాగడానికి పుష్కలమైన ఆర్థిక వ్యవస్థ ఉండాలన్న సూచన కూడా కవి 'నవద్రవ్య నిధీశుడు' అనే మాటతో అందించాడు.

ప్రాచీన మహాకవులు తమ పద్యాల్లో శబ్ద అర్థ చమత్కారాలు చేస్తూనే ధ్వనిని ఆశ్రయించి పది కాలాల పాటు నిలిచే రీతిలో పలు విషయాలను సూచిస్తుంటారు. అందుకే ఇటువంటి మహాకావ్యాలు కాలాంతరాల్లోనూ నిలిచి ఉన్నాయి. భాస్కరుడు రచించిన రామాయణం కనుక ఇది భాస్కర రామాయణంగా ప్రసిద్ధి చెందినా ఇందులోని కొన్ని కాండలు ఆయన పుత్రులు, శిష్యులు కూడా రచించారు. మల్లికార్జునభట్టు, అయ్యలార్యుడు, అప్పలార్యుడు, కుమార రుద్రుడు, భాస్కరుడు కలిసి రచించిన ఈ భాస్కర రామాయణము తెలుగు సాహిత్యపు వెలుగులను విరజిమ్ముతూ నేటికీ దర్శనమిస్తున్న ఉత్తమ కావ్యము.


# శిలాక్షరం

**(బి.ఎన్. శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/–

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**




తెలంగాణ యోగులు

# శ్రీ జ్ఞానేశ్వరానందగిరి స్వామి

డా. రంగి కమల, విశ్రాంత తెలుగు అధ్యాపకులు, ఫోన్ : 998 987 2723

శ్రీ నాగిళ్ళ వేంకట రాజయ్య, బుచ్చమ్మ దంపతులకు లింగమూర్తి తర్వాత నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు జన్మించారు. వీరు మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ వాస్తవ్యులు.

**బాల్యము – విద్యాభ్యాసము :** 1936 జూన్ 12వ తేదీనాడు వెంకట రాజయ్య దంపతులకొక మగశిశువు జన్మించాడు. తల్లిదండ్రులతో పాటు నాయనమ్మ, తాత, చిరకాల తపఃఫలమని పొంగిపోయారు. లింగమూర్తియని నామకరణం చేసారు. ఆ బాలుని మంచి విద్యావంతునిగా, సౌశీల్యునిగా తీర్చిదిద్దాలనే తపించేవారు. తీరిక చిక్కినప్పుడల్లా భారత, భాగవతాది పురాణకథలు, భక్తిగీతాలు, తత్త్వాలు నేర్పించి పాడించేవారు. ఆ బాలుని వచ్చీరాని ముద్దు ముద్దు పలుకులకు ఇంటిల్లిపాది సంతోషించేవారు. చాలాకాలం ఎదురుచూడగా పుట్టిన లింగమూర్తి గారాబానికి హద్దు లేకుండా పోయింది. ఇంటిదగ్గర కొనసాగిన లాలనాపూర్వక విద్యాభ్యాసం లింగమూర్తికి ఎంతో ఆసక్తిదాయకంగా మారింది.

ఆతని ఆసక్తిని గమనించి గ్రామంలోనే విద్యాబోధన చేసేందుకు ఒక మౌల్వీసాహెబును రప్పించాడు తండ్రి. ఒక శుభ ముహూర్తాన ఆయన దగ్గరకు పంపించాడు. ఆ ఉపాధ్యాయుడు విద్యతో పాటు పార్సీ, అరబ్బీ, ఉర్దూ భాషల్లోని పద్యాలను కంఠస్థం చేయించాడు. ఆనాటి నిజాం పరిపాలనలో ఆ భాషలకే ప్రాధాన్యముండేది. సుబ్బారావనే ఒక ఉపాధ్యాయుడు లింగమూర్తికి తెలుగు, హిందీ భాషలు నేర్పాడు. భారత, భాగవత, రామయణాది గ్రంథాల్లోని కథాంశాలను హృదయానికి హత్తుకునేట్టు చెప్పేవాడు.

స్వంత ఊరిలో విద్య పూర్తిచేసినాక, 195లో శంషాబాద్‌లోని క్రైస్తవ పాఠశాలయందు 7వ తరగతిలో తండ్రి చేర్పించాడు. పాఠశాల నిర్వహించిన 'బైబిల్' పరీక్షలో ప్రథమశ్రేణి సాధించాడు లింగమూర్తి. దానితో ఉపాధ్యాయులందరికీ ప్రీతిపాత్రుడయినాడు. కాని తండ్రిగారి ద్వారా హైందవధర్మంలోని "లోకాస్సమస్తా సుఖినో భవంతు" అతనిలో నిలిచిపోయింది.

శంషాబాదులో 7వ తరగతి పూర్తి కాగానే విద్యపట్ల ఆసక్తుడైన తన కుమారుని వెంకటరాజయ్య పాలమూరు మిషన్ పాఠశాలలో చేర్పించాడు. అక్కడ 8,9 తరగతులు పూర్తిచేసి, 1954 సం॥లో షాద్‌నగర్‌లో పదవ తరగతి రెండవశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. వస్త్ర వ్యాపారంతో 1954లో పూర్తి స్థిరనివాసం షాద్‌నగర్‌కు వచ్చారు వెంకట రాజయ్య.

**వివాహం :** 1955లో విద్య పూర్తి కాకముందే, శంషాబాద్ వాస్తవ్యులు శ్రీ కొత్త శంకరయ్య, రాజమణెమ్మగారల ఏకైక కూతురు



శ్రీశ్రీశ్రీ జ్ఞానేశ్వరానందగిరి స్వామి వారు

ప్రేమమ్మతో వివాహం జరిగింది. విద్య పూర్తి చేయాలని లింగమూర్తి హైద్రాబాదులోని సిటీకాలేజీలో చేరాడు. 1957 నాటికి ఇంటరు పూర్తి చేశారు. చదువు పూర్తయిన వెంటనే రెండో ఆలోచన లేకుండా ఆయన వ్యాపార రంగంలోకి దిగారు.

చేతికి అందివచ్చిన కొడుకు వ్యాపారంలోకి దిగగానే తండ్రి వెంకటరాజయ్య బరువు బాధ్యతలు కొడుక్కు అప్పగించటమే కాక, మెళకువలెన్నో తెలియజేసాడు. లింగమూర్తిగారికి పుట్టుకతోనే ఆ చతురత అలవడింది. ఆ ప్రతిభతో వస్త్ర వ్యాపారాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసారు. అంతటితో తృప్తిపడక కమీషన్ వ్యాపారము, కిరాణ

మరియు జనరల్ వ్యాపము, ఇనుము, కుట్టుమిషన్ ఏజెన్సీ, ఫ్యాన్లు, రేడియోలతో పాటు టైపుజాబు వర్క్, స్టాంపుల అమ్మకం మరియు చిట్‌ఫండ్ రంగాలలో విజయాన్ని సాధించారు. అంతేకాక జీవిత భీమా సంస్థలో ఏజెంట్ల సంఘానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. పట్టిందల్లా బంగారం కావటంతో తోటల పెంపకం, వ్యవసాయ రంగాలలో తన ప్రతిభను చాటారు. ఈ కృషికి కుటుంబసభ్యులు, సోదర సోదరీమణులు సహకరించారు.

**సత్సాంగత్యము :** లింగమూర్తిగారిది పెద్ద కుటుంబము. వీరు షాద్‌నగర్‌కు వచ్చిన సమయంలో శ్రీరామానందగిరి స్వాముల వారుండేవారు. వారు శ్రీ మలయాళ స్వాములవారి శిష్యులు. 1962 మార్చి 21,22,23 తేదీలలో శ్రీ మలయాళ సద్గురువును షాదునగరుకు ఆహ్వానించి "సనాతన వేదాంత సభలు" జరిపారు. అందులో పాల్గొన్న ఎందరో మహాత్ముల ప్రసంగాలనేకులను ప్రభావితం చేసాయి. సుప్రసిద్ధులైన డా॥ రామాచారి, లింగమూర్తిగారి ఇంటి డాక్టరు కావటం వల్ల ఆ కార్యక్రమాల్లో ఇరువురు కలసి పనిచేయటం వల్ల అతిథులు, మహాత్ములెందరో నాగిళ్ళవారి గృహానికి ఆహ్వానించబడ్డారు. వ్యాసాశ్రమ పీఠాధిపతులు, శ్రీ విద్యానందగిరి స్వాములు నాగిళ్ళ లింగమూర్తిగారింట్లో ఆతిథ్యం స్వీకరించిన మహాత్ములు. వారేకాక సాధుమాత శాంతిబాయమ్మ, పరమేశ్వరమ్మ గారి వంటి మాతృమూర్తులు, మాన్యులు శ్రీ జి.పుల్లారెడ్డి, శ్రీ వై. రాఘవులు, శఠగోపం లక్ష్మీనరసింహాచార్యులు, కె.బి.సోమయాజులు, శ్రీ మంచన గుండేరావు లాంటి ఉద్దండులైన విశ్వహిందూ పరిషత్ మరియు రాష్ట్రీయ స్వయం సేవక్ పెద్దలెందరో వారి గృహాన్ని పావనం చేశారు.

వీరందరి సాంగత్యం సాన్నిహిత్యం, సంపర్కం వల్ల ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక త్రివేణి సంగమ క్షేత్రంగా భాసిల్లింది. ఈ మహాత్ముల స్ఫూర్తితో జీవిత పరమార్థాన్ని గ్రహించి తత్ సాఫల్య సాధనకై తపించారు. క్రమశిక్షణాయుతమైన కఠోర సాధన చేశారు. జన్మాంతర సత్కర్మ ఫలితంగా జీవితం మలుపు తిరుగుతుందనటం గురువులు, మహాత్ముల సాంగత్యం ద్వారా ఈ సత్యాన్ని గుర్తించ గలుగుతారు.

**ప్రేమమూర్తి ప్రేమమ్మ :** లింగమూర్తిగారి గృహ వ్యవస్థ నంతటినీ వారి ఆశయాలకు, ఆదర్శాలకు అనుగుణంగా దిద్ది తీర్చిన వ్యక్తి వారి సతీమణి ప్రేమమ్మగారు. పేరుకు తగినట్లు ఇంటికి వచ్చిన అతిథి, అభ్యాగతుల, మహాత్ముల సేవతో తరించి, వారి ఆశీర్వాదాలను ఆనందించేది. మహాత్ముల ద్వారా భగవద్గీత, యోగవాసిష్ఠం వినడమే కాకుండా బాగా అర్థం చేసుకునేది. జ్ఞానపూరితమైన ఆమె మాట విన్నవారు ఆమె నాల్గవ తరగతి మాత్రమే చదివిందని ఎవరూ అనుకునేవారు కాదు. ఆ పుణ్య దంపతులకు 1963లో కుమారస్వామి, 1965లో ప్రభాకర్ అనే ఇరువురు కుమారులు,1967లో గీతావాణి అనే కుమార్తె జన్మించారు. ఆమె తన సంతానం పట్ల ప్రేమతో పాటు పెంపకములో తగు జాగ్రత్త వహించేది. పొరపాటు ఏమాత్రం సహించేది కాదు. 'మాతలే జాతిని రక్షించాలన్నది' ఈమె విషయంలోనూ అక్షర సత్యం.

**ఆర్.ఎస్.ఎస్.తో అనుబంధం :** 1964వ సంవత్సరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘంతో అనుబంధమేర్పడి, 1966లో కుంభమేళా సందర్భంగా ప్రయాగకు విశ్వహిందూ పరిషత్ వారితో పరిచయం ఏర్పడి 1973 క్రియాశీలక సభ్యుడుగా పనిచేశారు. 1973 నుండి 1995 వరకు ఉపాధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. ఆతరువాత అధ్యక్ష బాధ్యత వహించారు.

పూజ్యశ్రీ విద్యానందగిరి స్వాములవారి శిష్యరికం, ధార్మిక సత్సంగాలతో భజన సప్తాహాలు, పారాయణాలు, ఉత్సవాలు, చాతుర్మాస్య దీక్షలు, వేదాంత సభలు లింగమూర్తిగారిలో ఆధ్యాత్మిక పరిమళాలు వికసింపచేశాయి.

**సతీ వియోగం :** లింగమూర్తిగారి సేవాసక్తి, ధర్మశక్తికి వారి సతీమణి ప్రేమమ్మ తోడ్పాటే ముఖ్య కారణం. కుటుంబ బాధ్యతలు పిల్లలకప్పగించి, వ్యాసాశ్రమం వెళ్ళి శేషజీవితం అక్కడ గడపాలనుకున్నారా దంపతులు. కాని తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు 1984లో ప్రేమమ్మ గారు ఈలోకాన్ని వీడి వెళ్ళిపోయింది.

ఈ విషయం తెలిసిన శ్రీ విద్యానందగిరి స్వాములవారు ఆమె కారణజన్మురాలు. అదృష్టవంతురాలని, అందిరికీ అమృతం పంచవచ్చిన దేవత. ఆమెను గురించి విచారించవలసిన పని లేదని ఉత్తరం రాసారు. అది చదివిన తరువాత లింగమూర్తి సుస్థిరులైనారు. కుమారులకు, కుటుంబ సభ్యులకు కుటుంబ బాధ్యతలప్పగించారు. 1985 తృతీయవర్ష నాగ్‌పూర్‌కు పెద్దకుమారుడు 'విభాగ్ సహకార్య వాహ', రెండవ కుమారుడు ప్రభాకర్ 'సంస్కృత భారతి' సభ్యులు. అల్లుడు బండారి రమేశ్‌గారు మొదటినుండి విశ్వహిందూ పరిషత్ కోశాధికారి. కోడళ్ళు, కూతురు కూడా దైవభక్తి, సమాజసేవానురక్తి కలవారగుట విశేషము.

**ఆశ్రమ స్థాపన :** అప్రతిహత తపోనిష్ఠులు, వ్యాసాశ్రమ సంస్థాపకులై మలయాళ స్వామి ప్రభావం, షాద్‌నగర్ ప్రజల హృదయాలలో ప్రగాఢ ముద్ర వేసింది. దానికి అనుగుణంగా అక్కడొక ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం నిర్మించాలనే సంకల్పం కలిగింది. వైశ్య ప్రముఖుడు పలిబట్ల వజ్రలింగం అనే అతను కావాల్సిన స్థలాన్ని దానం చేశాడు. అదే శ్రీరామకోటి జపయజ్ఞ ఆశ్రమంగా ఈనాడు షాద్‌నగర్‌లో దర్శనమిస్తున్నది.

**విశ్వహిందూ పరిషత్ రథయాత్ర :** రామజన్మభూమి 1983లో ప్రథమ రథయాత్రలో పాల్గొని విస్తృత ఏర్పాటు చేసి 1985లో నేపాల్‌లో జరిగిన ప్రపంచ హిందూ ధర్మ సమ్మేళనంలో భాగస్వాములైనారు.


1988లో తిరుపతిలో జరిగిన విశ్వహిందూ ధర్మ సమ్మేళనానికి 4 బస్సులలో బంధుమిత్రులను తీసుకొని వెళ్ళారు. 1989లో రామజన్మభూమి ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. ఆయనకు 60 సం॥ల వచ్చినా ఉరుకులు, పరుగులతో యువకుని వలె ఉండే వారు. గృహస్థ కర్మయోగికి షష్టిపూర్తి చేయాలని స్థానిక ప్రముఖులు నిర్ణయించారు. లింగమూర్తిగారు మాత్రం విద్యానందగిరి స్వామి అనుమతి లభించాకే అంగీకరించారు. 1996 జూన్‌లో ఈ షష్టిపూర్తి మహోత్సవానికి వ్యక్తిగత పరిచయస్థులు 2000మందికి పైగా వేంచేసారు. ఈ ఉత్సవానికి వ్యాసాశ్రమ ఉత్తరాధిపతి శ్రీ పరిపూర్ణానంద గిరి స్వాములవారు, శ్రీ మలయాళ స్వామి, నిత్య శుద్ధానందగిరి స్వాములతో పాటు అనేకులు వచ్చి ఆశీర్వదించి, అభినందనలు తెలియజేశారు. అనేక సేవా కార్యక్రమాలు, హిందూ ధర్మ ప్రచార సమితి ద్వారా చేశారు.

**తురీయాశ్రమానికి పిలుపు :** అలుపెరుగని కృషి చేస్తున్నవరికి పూజ్యశ్రీ విద్యానందగిరి స్వామివారి సందేశం ఉలిక్కిపడేలా చేసింది. **"నాయనా! నీ సుకృతం వల్ల నీ జీవితం చతురాశ్రమ ధర్మాలతో కూడిన భారతీయాదర్శ జీవన విధానానికి అనుగుణంగా చతురాశ్రమ ధర్మాలు పాటించబడ్డాయి. నీవిక సన్యాసాశ్రమ స్వీకరణకై నావద్దకు రావలసిందని"** ఆజ్ఞాపించారు. సరేనన్నారు.

**భీమరథ శాంతి :** 2008 ఫిబ్రవరి 28నాడు షాద్‌నగర్‌లోని గీతామందిరంలో పూజా, హోమాదులు, గోపూజ, హవనం చేశారు.

**సన్యాసాశ్రమ స్వీకరణ :** 2008 మార్చి 2వ తేదీ మహాశివరాత్రి నాడు శాస్త్రోక్తంగా సన్యాస దీక్ష జరిగింది. దీక్షానంతరము "శ్రీ జ్ఞానేశ్వరానందగిరి" స్వామిగా దీక్షానామం ఇవ్వబడింది.

సన్యాసానంతరం శ్రీశ్రీశ్రీ జ్ఞానేశ్వరానందగిరా స్వామి "జ్ఞాన సరస్వతీ దేవాలయం - ఆశ్రమ సముదాయాన్ని నిర్మించారు. తల్లిదండ్రుల రక్షణ లేని బాలబాలికలకు ఆశ్రమ నిర్మాణం, 2017 ఆగస్టు 11వ తేదీన 10మంది బాలురతో బాల కల్యాణ ఆశ్రమం ప్రారంభించారు. దేశరక్షణ, గో రక్షణ, ప్రకృతి సేద్యం, ఉచిత వైద్యశాలలు ఏర్పాటు చేసినా, జీర్ణాలయాల పునరుద్ధరణ చేసినా ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేసినా అన్నీ దేశరక్షణ - ధర్మ రక్షణ కోసమే.



# మెరుస్తుంది గగనాన



త్యాగాలను స్మరించే కాషాయం
శాంతిని కోరే పాల నురగ తెలుపు
పల్లె బతుకు ఆకుపచ్చ ధర్మచక్రాన్ని హత్తుకొని
యావత్ జగతికి దిక్సూచియై
మువ్వన్నెల నా జెండా రొమ్ము విరిచి ఎగురుతోంది గగనాన

ఆసేతు హిమాచలం నిర్మల సుర గంగాజల సంగమక్షేత్రం
నా పుణ్యభూమి ఎదపై
కోటి సూర్యకాంతులతో మెరుస్తూ
ఆంగ్లేయులను తరమేసిన
విజయగర్వంతో ఎర్రకోటపై ఎగురుతోంది
నా జెండా డెబ్బయి మూడేళ్లుగా
స్వేచ్ఛాగీతం ఆలపిస్తూ
సబ్బండ జాతులను ఏలుతున్నది నా జెండా

స్వతంత్ర దర్జా ఎదలో పొంగుతుండగా
ఊపిరి శ్వాసలు స్వరాలు అల్లగా
నా హృదయవీణ స్వేచ్ఛాగీతం పాడుతోంది
ప్రతిఏడు నేల నాలుగు చెరలా వినిపించేలా...

**కరాదుల అరుణ కీర్తి పతాక రెడ్డి**
వరంగల్, ఫోన్ : 93951 47443

# అతడే .... అన్నదాత



అతనిదొక సామాన్య జీవితం
కానీ ప్రపంచానికి తిండి పెట్టగలడు
తానొక మురికి మనిషి
కానీ సుగంధ ద్రవ్యాలను ఉత్పత్తి చేయగలడు
ఖరీదైన దుస్తులు ధరించడతను
కానీ వాటి ముడిసరుకు పండిస్తాడు

పంచ భక్ష్య పరమాన్నాలు రుచించవతనికి
పచ్చడి మెతుకులే తన ఆకలి
కటికోడు కాదతను జంతు ప్రేమికుడతను
పట్టు పరుపుల మీద పవళించడతను
పచ్చని వొడ్లపై సేద దీరుతాడతను
బంగళాలు, భవంతులు కావాలనుకోడు
పూరి గుడిసే తన అందాల మేడ
లగ్జరీకార్లు నడపడతను ఎడ్లబండే తన వాహనం
ఒంటివ్యక్తి కాదతను ప్రపంచానికి మార్గదర్శకుడతను



స్వార్థపూరిత జీవితం కాదాయనది
కాలే కడుపులకు జీవం పోసే జీవితమతనిది
పాలకుల నయ వంచనకు, కంపెనీల నకిలీ విత్తనాలతో
నకిలీ పురుగు మందులతో,
దళారుల దోపిడీకి బలైపోతున్న శ్రమజీవతను

ఆత్మగౌరవం లేని వ్యక్తి కాదతను
పరువు కోసం ప్రాణం తీసుకొనే వ్యక్తతను
భూతల్లిని ముద్దాడుతూ భూతల్లి ఒడిలోనే నిద్రబోయే బిడ్డతను
మోసగాడు కాదతను కలిసి రాని కాలానికి బాధ్యుడతను
సూర్యోదయం తరువాత మొదలై సూర్యాస్తమయం లోపు
ముగించే ఉద్యోగం కాదతనిది
తొలివేకువ జామున మొదలై తొలిరేయి వరకుంటుంది

కాలం కాటేసిన, ప్రకృతి కన్నెర్ర చేసిన
ధైర్యంగా నిలబడే గుండె నిబ్బరం అతనిది
బలహీనుడు కాదతను బీడు భూములను
పచ్చని పంటపొలాలుగా మార్చే కర్షకుడతను

ఆత్మ బంధువతను అలుపెరుగని పోరాట జీవతను
విశ్రాంతి లేని ఉద్యోగతను జీతంలేని కూలి అతను
దేశానికి వెన్నముకతను ... తానెవరో కాదు
**అతడే ..... అన్నదాత**

---

**ఎస్. పవన్ కుమార్**
ఫోన్ : 99892 37142

తెలుగు బోధన – నైపుణ్యాలు


# 2. తెలుగు లిపి బోధన

**డా. వై. రెడ్డి శ్యామల,** ఆచార్యులు, నిఘంటు నిర్మాణశాఖ, పొ.తె.వి.విద్యాలయం, ఫోన్ : 9849697688

## తెలుగు లిపి బోధన

భాషాబోధన విషయం వచ్చినప్పుడు ఎక్కువగా వినిపించే పదబంధాలు, తల్లిభాష / మాతృభాష, ప్రథమభాష, ద్వితీయ భాష, తృతీయభాష. ఇవి మన విద్యా విధానంలో భాషల గురించి వాడే విశేషణాలు... ఇవి కాక ఒకేభాషలో ఉన్న వైవిధ్యాన్ని తెలిపే 'మాండలిక భాష', ఒక ప్రాంతంలో ఎక్కువగా వ్యవహారంలో ఉండే 'ప్రాంతీయభాష', పరిపాలనలో ఉపయోగిస్తే 'అధికార భాష'. ఒక ప్రాంతంలో తక్కువమంది వ్యవహర్తలు మాట్లాడితే 'మైనారిటీ భాష', రాజ్యాంగం ద్వారా అనుసూచితనమైనట్లయితే 'షెడ్యూల్డ్ భాష'. గిరిజనులు, ఆదివాసీలు సంభాషించేవి గిరిజనభాషలు వంటి విశేషణాలతో భాషను వివరిస్తున్నారు. ఇవికాక ప్రపంచ భాష, వ్యాపారభాష, ప్రాచీనభాష, విశిష్ట భాష వంటి సందర్భాన్ని బట్టి ప్రత్యేకమైన అర్థంతో భాషలను పిలుస్తున్నారు. అనువాద రంగంలో లక్ష్యభాష, మూలభాష అనే మరో వింగడింపు కనిపిస్తుంది.

వివిధ రంగాలకు సంబంధించిన ప్రత్యేక పదజాలం, వ్యక్తీకరణ లలో వైవిధ్యం ఆధారంగా పత్రికాభాష, కావ్యభాష, ప్రకటనల భాష, పాలనాభాష వంటి విభాగాలు ఉన్నాయి. అయితే ఇవన్నీ సందర్భాన్ని ఆశ్రయించినవి. కానీ బోధనా రంగానికి సంబంధించినవి మాత్రం ప్రథమభాష, ద్వితీయభాష, విదేశీ భాష అనేవి ప్రధానమైనవి. తల్లిభాష అనే పదబంధం ఎక్కువగా భావోద్వేగాలకు సంబంధించినప్పుడు ఉపయోగిస్తున్నారు. మాతృభాష అనే పదాన్ని పారిభాషిక పదంగా ఎక్కువ ప్రయోగంలో ఉంది. శిశువు జన్మించినప్పుడు తన ఇంటిలో వినే తొలిభాష మాతృభాష అని సాధారణంగా చెబుతాము. అయితే దీనికి అనేక అపవాదులు కూడా ఉన్నాయి. తల్లితండ్రుల భాష ఒక్కటే కాని పక్షంలో ఏది మాతృభాష స్థాయి కలిగి ఉంటుంది. తల్లిదా లేక తండ్రిదా? ఒక్కొక్కసారి మాతృభాష ఒకటి ఉన్నా చాలా తక్కువ సామర్థ్యం కలిగినప్పుడు దానిని ఏమని చెప్పాలి వంటి ప్రశ్నలకు అక్కడ మాతృభాష భావోద్వేగానికి సంబంధించినదిగా తెలిపారు. అయితే మాతృభాష ప్రథమ భాషగా ఉన్నప్పుడు వారి భాషా సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. సాధారణ పరిస్థితులలో మాతృభాష, ప్రథమభాష ఒకటై ఉంటుంది. అంటే శిశువు తన చిన్నతనం నుండి నేర్చుకున్న భాష పాఠశాలలో కూడ నేర్చుకున్న భాష ఒకటే కావటం. అయితే విద్యావిధానంలో ముఖ్యంగా పాఠశాల స్థాయిలో ప్రథమభాష తెలుగు అయితే ద్వితీయభాష ఇంగ్లీషు, తృతీయభాష హిందీ. కానీ ఇదే ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలలో రెండు భాషల విధానంలో ఇంగ్లీషు ప్రథమభాష, తెలుగు




ద్వితీయభాషగా పిలువబడుతున్నది. ఇది సాంకేతికమైన విభజన. కానీ భాషాబోధనలో స్థాయినిబట్టి వీటిని వర్గీకరిస్తారు.

తృతీయభాష అనేది త్రిభాషాసూత్రాన్ని అనుసరించి చేసిన విభజన. కనుక ఇక్కడ నేర్పే భాష సాధారణంగా ద్వితీయభాషా స్థాయికి చెందినదై ఉంటుంది.

తెలుగుభాషా బోధన పరిస్థితులను పరిశీలించినట్లయితే (క్రిందటి సంచికలో) మాతృభాష ప్రథమభాష, ద్వితీయ భాష స్థాయిలలో బోధింపబడుతున్నది.

## లిపి బోధన

భాషాబోధన అనగానే ముందుగా స్ఫురించేది లిపి. కానీ భాష ప్రాథమికంగా ధ్వన్యాత్మకమైనది. మౌఖికరూపంలో ఉంటుంది. లిపి తరువాత ఏర్పడినది. భాషల అభివృద్ధికి లిపి ప్రధానమైనది. ప్రతి భాషా లిపికి కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. తదనుగుణంగానే బోధన ఉంటుంది. ఇంగ్లీషు భాషా లిపిని బోధించే ముందు వారు నిలువు గీతలు, ఏటవాలు గీతలు, అరసున్నా, సున్నా వంటివి నేర్పుతుంటారు. తెలుగు లిపిని నేర్పేముందుగా తెలుగు లిపికి ఉన్న ప్రత్యేక లక్షణాలను అర్థం చేసుకోవాలి. తెలుగు లిపికి తలకట్టు, గుండ్రం తిరగడం ప్రధాన లక్షణాలుగా చెబుతుంటారు. అయితే ఇది ఇతర భాషా లిపులతో పోల్చినప్పుడు తెలుగుకు తనదైన కొన్ని అంతర్గత లక్షణాలు కూడా ఉన్నాయి.

## లిపి చలనం

తెలుగులిపిని వ్రాసేటప్పుడు అక్షరంపైకి, క్రిందికి పక్కకు కూడ నడుస్తుంది. ఉదాహరణకు స్త్రీ అని రాసినప్పుడు అక్షరంపైకి ఒకసారి క్రిందికి రెండుసార్లు వెళుతుంది. అలాగే 'కూర' అని రాసినప్పుడు పక్కకు కదులుతుంది. 'క్రింద' రాసినప్పుడు వెనుక పక్కకు వెళు తుంది. దీనిని 'లిపి చలనం' అనవచ్చు.

## లిపిలోని సంక్లిష్టతలు

తెలుగులిపిలో ఒక అక్షరాన్ని మరో అక్షరంతో వేరు చేసే లేఖన భేదక సామర్థ్యం కలవి. వంపులు, ఎత్తు కొమ్ములు, పరిమాణం, కలపడం, దూరం చేయడం, వంపు లేకుండా రాయడం ఇవి ప్రధానమైనవి.

తెలుగు లిపిలోని ఈ ప్రత్యేకతలు (ఇతర భాషలలో కూడ కొన్ని ఉండవచ్చు). లిపి బోధన కార్యక్రమంలో ప్రధానాంశాలుగా గుర్తించాలి. తెలుగు లిపి సంకేతాలను చూసినట్లయితే బాల, ప్రౌఢ వ్యాకరణకర్తల ననుసరించి 55 అక్షరాలు. ఇవి రెండు రకాలు 1. ప్రధాన సంకేతాలు 2. గౌణ సంకేతాలు. వెరసి 55+52 (సున్న, అరసున్న, విసర్గ తీసివేయగా) మొత్తం 107 సంకేతాలు.

వంపు – ఛ, భ ల మధ్య ప్రధానమైన భేదం వంపు మూలంగా కలుగుతుంది. ఎత్తు – ఒ, బ ల మధ్య తేడా కలగడానికి 'బ'ను ఎత్తు పెంచడమే. ఋ, ౠలకు ఒక కొమ్ము అదనం కావటం అక్షరాన్ని మారుస్తుంది. య – మల మధ్య సున్నాల పరిమాణంతో పాటు తలకట్టు ఇచ్చేచోటు ఎత్తుకూడా ప్రధానమైనదే. ప–వ లమధ్య భేదం కలపటం, దూరంగా ఉంచటం వలన ఏర్పరుస్తున్నాం.

ఒక అక్షరానికి గౌణ సంకేతాలు, గుణింతాలు (అచ్చులు), ఒత్తులు (హల్లులు) ఎలా ఇవ్వాలి? అక్షరానికి ఎక్కడ ఇవ్వాలి? తలకట్టు ఉంచి ఇవ్వాలా? లేక తలకట్టు తీసి ఇవ్వాలా? అన్నది ప్రధానమైన మరొక అంశం. ఉదాహరణకు 'క' అక్షరానికి ఉత్వం, ఋత్వం చేర్చినప్పుడు తలకట్టు ఉంచుతాము. కానీ దీర్ఘం, గుడి, ఐత్వం వంటిచోట తలకట్టు తీసివేస్తాం. ఇలా ప్రతి అక్షరాన్ని కనుక చూస్తే గుణింతం ఇవ్వడంలోనే ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. క – మ – స – హ – ల అక్షరాల గుణింతాలను ఒకసారి గమనిస్తే ఈ విషయమం మనకు బోధపడుతుంది.

స్థానం కూడా ముఖ్యమైన అంశం. తలకట్టు, ఝుట ఎక్కడ ఇవ్వాలి? హల్లుల గౌణ సంకేతాలు వ్రాసే విధానంలో వైవిధ్యం గమనించాలి. క చ న ప బ మ య వ శ స ళ లు కిందినుండి పక్కకు రాగా, ఖ గ జ ట డ త ద లవంటివి కిందనే సర్దుకుంటాయి. ప – ఏలను వేరు చేసేది ఎత్తు, వంపు; ధ – థ లను పొట్టలో చుక్కలే వేరు చేస్తాయి. వ – న ల మధ్య సున్ననే తేడా కలిగిస్తుంది. అలాగే వ – మలను కొమ్మే వేరు పరుస్తుంది. శ – ళ లమధ్య మెలిక ఎలా తిప్పాము అన్నదే ముఖ్యం.

ప్రథమ లేదా ద్వితీయ భాషగా బోధించే అధ్యాపకులకు ఈ విషయంపై ఎరుక ఉంటే చాలు. ఎక్కడ ఎలా బోధించాలో సందర్భాన్ని బట్టి నిర్ణయించుకోవచ్చు. ప్రథమభాషలో విద్యార్థికి తక్కువ వయస్సు ఉంటుంది. కనుక దిద్దడం, చూచిరాత వంటి అభ్యసనాలు చేయడానికి వీలు ఉంటుంది. సమయం కూడా ఉంటుంది. కానీ ద్వితీయభాషగా పెద్ద వయస్సు ఉన్నవారికి నేర్పేటప్పుడు సమయం, విసుగుదల వంటి వాటిని గణనలోకి తీసుకోవాలి. అలాగే వారికి ఇంకొక భాష వచ్చి ఉంటుంది కనుక, లిపి నామాలు ఆ భాషలో కూడ ఉంటాయి కనుక ఆ జ్ఞానాన్ని ఇక్కడ ఉపయోగించుకొని తొందరగా నేర్పవచ్చు. అలాగే తెలుగు లిపి లక్షణాలు ఉపాధ్యాయునికి తెలిసి అక్షర భేదక సామర్థ్యకాలను గుర్తించి సులభంగా ఎరుక పరచడం వలన కూడ ద్వితీయ భాషావిద్యార్థికి సులభంగానే నేర్పవచ్చు.

## ఏది ముందు – ఏది వెనుక

అక్షరం రాసేటప్పుడు ఎక్కడ మొదలు పెట్టాలి అన్నది మరో ముఖ్య అంశం. గొలుసుకట్టు వ్రాత తెలుగులో మరుగునపడి పోయింది. ఇప్పుడు అందరూ అక్షరాలను విడివిడిగా వ్రాస్తున్నారు. పూర్వం పదమంతా ఒకేమాటున (సింగిల్ స్ట్రోక్) వ్రాసేవారు. కానీ ఇప్పుడు (ముద్రణ ప్రధానం కావచ్చు) అక్షరాలు రెండు మూడు పర్యాయాలు కలం ఎత్తి రాస్తున్నాము. కొంత అలవాటు పడిన తరువాత వేరే కానీ ప్రారంభంలో ఒక్కో అక్షరాన్ని విడివిడిగానే వ్రాయడం జరుగుతున్నది. ఇప్పుడు 'కు' రాయడాన్ని కలాన్ని మూడుసార్లు ఎత్తి రాస్తున్నాం. ఒకే మాటు 'కు' రాసే తరం ఇప్పుడు తగ్గిపోయింది. అక్షరాలను రాసేటప్పుడు ఏ అక్షరం ఎక్కడ మొదలు పెట్టాలి అన్నది బాణపు గుర్తులతో 1,2,3 సంఖ్యా క్రమంతో సూచిస్తూ వర్ణమాలలను పెద్దలు (భద్రిరాజు కృష్ణమూర్తి, శివమూర్తి మొదలైన వారు తమ వాచకాలను రాశారు. వాటిని చూడవచ్చు. ఈ విధానం ప్రథమ, ద్వితీయ భాషా బోధనకు సమానమే.

## లిపి బోధన – పద్ధతులు

లిపిని రెండు విధాలుగా బోధిస్తారు. ఒకటి వర్ణమాల. రెండు రూపసామ్యం. ప్రథమం భాషగా నేర్పుతున్నప్పుడు సాధనకు అవకాశం ఉంటుంది. విశ్లేషణకు ఆస్కారం ఉండదు. మొదటిసారి నేర్చుకుంటున్న విద్యార్థికి ఉత్తమమైనది వర్ణమాల పద్ధతి. అచ్చులు, హల్లులు వాటి గౌణరూపాలు ఒక క్రమంలో అలవరచుకుంటారు. ద్వితీయభాషా బోధనలో వయస్సును బట్టి పద్ధతిని అనుసరించవచ్చు. ఉదాహరణకు భారతీయులైతే లేదా ఏదో ఒక భారతీయభాష తెలిసినట్లయితే వర్ణమాల క్రమం వచ్చి ఉంటుంది. తెలిసిన వర్ణముల క్రమాన్ని తెలుగు లిపిలో బోధనలో ఉపయోగించుకోవచ్చు.

రూపం తెలుగులో తెలియకున్నా 'క'ను వారి భాషలో కూడ 'క' అనే అంటారు కనుక కొంత సులభం అవుతుంది. రూపసామ్య పద్ధతిలో (రూపంలో సామ్యం ఉన్న అక్షరాలు – ఉదాహరణకు అ – ఆ – ల – అ – ట) చెప్పడం వలన తొందరగా అక్షరాలను

గుర్తించడం, పదాలను రాయడానికి అవకాశం కలుగుతుంది. అయితే నేను వివిధ నేపథ్యాలున్న భాషాభ్యాసకులకు బోధించేటప్పుడు కొంత మార్పులతో ప్రయత్నించాను. మంచి ఫలితాలను గమనించాను. ఈ ప్రయోగం మరికొందరు కూడా చేసి ఉండవచ్చు. 'అఆ' లతో పాటు 'క' ను తలకట్టు దీర్ఘం ఒకేసారి బోధిస్తాను. అ ఆల ఉచ్చారణతో పాటు గౌణ సంకేతాల రూపం ఉచ్చారణ కూడ వారు ఒకేసారి గ్రహిస్తారు. 'క' మీద గుణింతం కూడ రాయగలుగుతారు. ఈ విధానంతో తొందరగా గుణింతాలు, ఒత్తులు కూడ నేర్వగలుగుతారు. పునశ్చరణ కూడ జరుగుతూ ఉంటుంది. ద్వితీయ భాషా బోధన సందర్భంలో రోమన్ లిపి ఉపకరిస్తుంది. ముఖ్యంగా పెద్దవారికి బోధించేటప్పుడు కానీ ఎప్పటికైనా లిపి నేర్చుకుంటేనే ఎక్కువకాలం భాషను గుర్తించుకోగలరు. స్వంతంగా చదువుకోగలరు. ఇది ఎరుకపరచాలి.

తెలుగులిపిలో సంయుక్తాక్షరాలు రాస్తున్నప్పుడు ఒక అంశం గమనించాలి. తెలుగువారికి చిన్నతనం నుండి రాయడం అలవాటు కనుక గుర్తించం కానీ ఇతర భాషీయులకు తెలుగు ద్వితీయ భాషగా నేర్పుతున్నప్పుడు ఇది ఒక ముఖ్యాంశం అవుతుంది. ఉదాహరణకు మనం 'క్వాచిత్కం' అని రాసినది చదవండి. 'కా' పూర్తిగా కనిపిస్తుంది. 'వ' సగం గౌణరూపంలో కనిపిస్తుంది. పలికినప్పుడు 'క్వా' అని అచ్చుని 'వ'కారానికి తగిలిస్తాం లిపి రూపంలో 'క'కి అచ్చును రాస్తాం. ఉదాహరణకు దేవనాగరి లిపిని వాడేవారికి ఇది భిన్నంగా కనిపిస్తుంది. ఇది తెలుగు లిపి సంప్రదాయం. కానీ విద్యార్థులు ప్రశ్నిస్తారు. అప్పుడు వివరించాల్సి ఉంటుంది. హల్లులు, సంయుక్తాక్షరాలుగా మారడంలో కూడ కొన్ని నియమాలు కనిపిస్తాయి.'. ప్రతి హల్లు అన్ని హల్లులతో కలువదు. దీనికి సంబంధించిన పట్టికను 'ఏ గ్రామర్ ఆఫ్ మోడర్న్ తెలుగు' అన్న భద్రిరాజు కృష్ణమూర్తి గారి గ్రంథంలో చూడవచ్చు.

## డబ్బాలలో అక్షరాలు

మనిషి మనిషికీ చేతి వ్రాత మారుతుంది. ఉపాధ్యాయులకు కూడా వేగంగా రాసేటప్పుడు వారిదైన శైలి వారికుంటుంది. అయితే ప్రతి అక్షరానికి మౌలికమైన రూపం ఉంటుంది. అది గుర్తించడం వలననే మనం ఎవరు రాసినా చదువగలుగుతాం. కొన్నిసార్లు అభ్యాసం, అలవాటు వలన అక్షరాలను పదాలుగానే గుర్తించి చదువుతాం. కానీ లిపి బోధన సమయంలో అక్షరాన్ని స్పష్టంగా నేర్పాలి. మన 'శైలి'కి అది భిన్నంగా కూడా ఉండవచ్చు. చాలామంది రెండు గీతల మధ్య అక్షరాన్ని రాస్తుంటారు. ఉపాధ్యాయులు ఇలా ☐ డబ్బాలో అక్షరాన్ని అభ్యాసం చేసి బోర్డు మీద రాసేటప్పుడు డబ్బా లేకుండా రాయాలి. ఇది చాలామంది పాటించే పద్ధతి. లిపి బోధనలో ఇది ఉపాధ్యాయునికి ముఖ్యమైన పాటించవలసిన నియమం. ఇది ఎత్తు, పరిమాణం, దూరం వంటివాటిని స్పష్టం




చేయడానికి ఉపకరిస్తుంది. ఏ భాషకు ఉచ్చారణ విధేయంగా లిపి ఉండదు. ప్రతి భాషలోనూ ధ్వనులు ప్రత్యేక వర్ణాలుగా ఉంటాయి. సంప్రదాయానుగుణంగా లేఖన విధానం ఉంటుంది. ప్రపంచ భాషలలోని ధ్వనులను గురించి తెలుసుకోవడానికి ఐపిఏ ఇంటర్నేషనల్ ఫొనెటిక్ ఆల్ఫాబెట్ చార్ట్‌ను పరిశీలించవచ్చు.

తెలుగు లిపి పరిణామం తెలుసుకోవడానికి, తిరుమల రామచంద్రగారి 'మన లిపి – పుట్టు పూర్వోత్తరాలు' ఉపకరిస్తుంది. ఇది చాలా సులభశైలిలో ఉంటుంది. 'తెలుగు లిపి – ఆవిర్భావ వికాసాలు', పి.వి.పరబ్రహ్మశాస్త్రిగారి తెలుగు అనువాద గ్రంథం మరింత అవగాహన కలిగిస్తుంది. ఈ గ్రంథాల ఆధారంగా లిపి బోధించడం కానీ లిపి గురించిన అదనపు సమాచారం లభిస్తుంది. ఎవరైనా పరిశోధక విద్యార్థి తెలుగుభాష నేర్చుకోవడానికి వచ్చినప్పుడు సందేహాలు వ్యక్తం చేసే నివృత్తికి ఉపయోగపడుతుంది.

విద్యార్థి అక్షరాలను తొలిసారి రాస్తున్నప్పుడు చేతి కదలికలను జాగ్రత్తగా గమనించాలి. ఉదామరణకు 'ఘ' రాస్తున్నప్పుడు సున్నను విడిగా రాయనీయకూడు. సున్న కొమ్ములు ఒకే చాలనంతో పూర్తి కావాలి. తరువాత తలకట్టు, ఆ తరువాత ఝట ఇవ్వాలి. దీర్ఘం రాస్తున్నప్పుడు పైనుండి కిందకు వంపు తెచ్చి గుండ్రాన్ని పూర్తిచేయాలి. పైనుంచి గుండ్రాన్ని పూర్తిచేస్తే వేగం పెరిగినప్పుడు గీత దాటి పైకి వెళ్ళే అవకాశం ఉంటుంది. అలాగే అచ్చులలో 'ఊ'ను రాసేటప్పుడు తలగట్టులా కనిపించే గీతలు పైనుండి కిందికి వేయాలి. ఇవన్నీ మనం ఎలా రాస్తున్నామో గమనించి విద్యార్థికి తొలిసారి కనుక నిదానంగా చెప్పాలి. లేకుంటే జీవితకాలం తప్పుగారాసే అవకాశం ఉంటుంది.

## వేళ్ళ రక్తం వేణువు మీద

అంకెల మధ్య పరుగులు
కల – లోలకమై కదిలే
యాంత్రిక సమయాలు
జారి పడుతున్న క్షణాల మధ్య
చీరుకుపోతున్న పాదాలు

మృతప్రాయం ఆలోచనకి మచ్చికై
పడి పడి అనుకలల్లోకి ఉరికురికిన అలజడిలో
ఒరిగించే గతం భవిష్యత్తంతా అభద్రతా భీతి

దుఃఖ వ్యసనంలో మూర్ఛపోయి
అంకురించే స్వరబీజంలో ముడుచుకుపోయి
విధ్వంస శూన్యంలో మూగబోయి

స్థాణువున్నయ్యాక
భయంలో బీభత్స బరువులో చిట్లిపోయి
వేణువు మీద వేళ్ళనిండా రక్తం
పాటలు పగిలి రాలిపడుతున్న
బతుకంతా కన్నీటి పాతం


నిప్పుల వేదనలో గాయాన్ని కదుపుకోని
మరణాన్ని పలవరించి, ఆత్మలాపనని

నిర్దయగా గొంతునొక్కి రస సాధన ప్రసవాల్ని
కర్కశంగా కాలరాసి బిగదీసుకుపోయిన

శవం పోలికలో శరీరంగా నడుస్తు
రుతుపవనాల జీవశ్రుతిని తెగనరికిన పదనంచుల కింది
గానం బలిదానమైన రక్తమాంసాల నిర్జీవం

ఒట్టి రంధ్రాల కట్టెగా నా వేణువుని నా వెంటే
చితి మీద బూడిద చేస్తూ....

**దుర్గాప్రసాద్ అవధానం**
**నల్గొండ, ఫోన్ : 9492 608 314**



గుణింతాలను, హల్లులను చేర్చే సందర్భంలో గుర్తుంచుకో వలసినవి కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు దీర్ఘం రెండు గౌణ సంకేతాలను కలిగి ఉంటుంది. ఒకటి 'కా'లోని రూపం. రెండు 'హా'లోని రూపం. 'హా'లోని రూపం దీర్ఘాన్ని సూచించే 'ఏ, ఓ, కీ, కో, కే'లలో ఉన్నదే. హల్లుల గౌణరూపాలు 1. రూపం మారనివి, (ఖ జ, ఞ, అ వంటివి). 2. తలకట్లు తొలగినవి, చిన్నగా పొడుగైనవి (గ,ట,డ,ద,స,ప,భ వంటివి) 3. పూర్తిగా రూపం మారేవి (క,య,ల,ర వంటివి)గా అవగాహన కలిగిస్తూ సులభం చేయవచ్చు. ఇది ద్వితీయ భాషగా తెలుగును బోధించేటప్పుడు చాలా ఉపకరిస్తుంది.

ఇంకొక విషయం కూడ లేఖనం గురించి తెలుపవచ్చు. తెలుగు భాషలో అక్షరాలు విడివిడిగా ఉన్నా, పదాలుగా కలిసి రాయాలి. పదాల మధ్య స్థలాన్ని వదలాలి. ఇంగ్లీషులాగా ఇప్పుడు మనం కలిపి రాయడం లేదు. దేవనాగరిలాగా కలిపి ఉంచే పై గీత ఉండదు.

ఎంతమంది విద్యార్థులున్నా, మొదటిసారి ఏ అక్షరం రాస్తున్నా ఉపాధ్యాయుల పర్యవేక్షణ చాలా అవసరం.

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం - 10

# శారద

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



**"కె.విశ్వనాథ్ చలన చిత్రాలు– సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"శారద".** ఈ చిత్రం 1973 మే 4న విడుదలైంది. చిత్రం యొక్క నిడివి 166 నిమిషాలు. ఈ చిత్రం 1972 లో కన్నడంలో నిర్మించబడిన 'యావ జన్మద మైత్రి' అనే చిత్రాన్ని ఆధారంగా చేసుకుని నిర్మించబడింది. అన్నపూర్ణ సినీ ఎంటర్ప్రైసెస్ వారి సమర్పణలో పి.రాఘవాచారి గారు నిర్మాతగా వ్యవహరించగా కళాతపస్వి కె.విశ్వనాథ్ గారి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందించబడింది.

చిత్ర కథ విషయానికి వస్తే కథ అంతా శారద (శారద) పాత్రను ప్రధానంగా చేసుకొని సాగుతుంది. కథలోకి వెళ్తే మూర్తి (శోభన్ బాబు) ఒక సైకియాట్రిస్టు (మానసిక వైద్యుడు), అతడి భార్య పద్మ (జయంతి). ఇద్దరూ చక్కని అనుబంధంతో దాంపత్య జీవనం గడుపుతూ వుంటారు. డాక్టర్ మూర్తి తన వద్దకు వచ్చే మానసిక రోగుల పరిస్థితిని చక్కగా అర్థం చేసుకొంటూ వారితో వారి సమస్యకు అనుగుణంగా ఏవిధంగా వ్యవహరిస్తే వారిలో మార్పు తీసుకురావచ్చో దానికనుగుణంగా తన వైద్యవిధిని నిర్వహించే వైద్యుడు. ఒకసారి మూర్తి తన స్నేహితుడి వివాహ నిమిత్తం ఒక గ్రామానికి వెళ్తాడు. ఆ గ్రామం గోదావరి నదీ తీరం వద్ద వుంటుంది. ఆ గ్రామానికి రాకపోకలు జరపాలంటే గోదారిని పడవ సహాయంతో దాటవల్సిందే. డాక్టర్ మూర్తి ఆ వివాహానికి అతిథిగా వెళ్ళే సమయంలో పడవ ప్రయాణం చేస్తాడు. కాని పడవ నడిపే వ్యక్తి నుండి అందరూ మూర్తిని చూసి భయపడడం, ఆశ్చర్యపోవడం చేస్తూ వుంటారు. గ్రామంలోకి వెళ్ళే సమయంలో కూడా ప్రజలు మూర్తిని చూడగానే అదే రకంగా ప్రవర్తిస్తుంటారు. దారిలో మూర్తిని చూసి ఒక స్త్రీ ఇన్నాళ్లకు వచ్చావా! అంటూ ఎనలేని సంతోషంతో పలకరిస్తుంది. గ్రామప్రజల, ఆ స్త్రీ చర్యలు మూర్తికి మానసిక సందిగ్ధతను కలిగిస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే మానసిక వైద్యుడికే మానసిక సంశయం ఏర్పడిన స్థితి. మొత్తానికి పలువురిని అడుగుతూ తన స్నేహితుడి గృహానికి చేరుకుంటాడు మూర్తి. మూర్తి స్నేహితుడి తండ్రి ఆ గ్రామానికి మునసబు (రావు గోపాలరావు). గ్రామ ప్రజలందరి చేత గౌరవ, మర్యాదలు అందుకుంటూ పెద్దరికాన్ని సలిపే వ్యక్తి. ఆ మునసబుతో మూర్తి తాను గ్రామంలోకి వస్తున్న సమయంలో ఎదుర్కొన్న వింత అనుభవాల గూర్చి ప్రస్తావిస్తాడు. దానికి మునసబు నువ్వు ఎవరైనా మతిస్థిమితం లేని అమ్మాయిని చూశావా గ్రామానికొచ్చే సమయంలో అంటూ అడుగుతాడు. దానికి మూర్తి అవును అంటూ జవాబిస్తాడు. వెంటనే మునసబు ఇన్నాళ్లు ఆమెతో మేం దాచిన నిజం ఆమెకు తెలిస్తే తన పరిస్థితి ఏమవుతుందో భయంగా వుంది, ఈ సమస్యకు పరిష్కారం ఏమిటో ఆ దేవుడే చూడాలంటూ బాధపడ్తాడు. అప్పుడు మూర్తి మునసబును విషయం ఏంటో చెప్పమంటాడు. వెంటనే మునసబు మూర్తి తో నువ్వు చూసిన ఆ అమ్మాయి పేరు శారద అంటూ జరిగిన గతం చెప్తాడు.

శారద (శారద) అందమైన అమ్మాయి, అంతకుమించి ఊర్లో వాళ్ళందరితో కలుపుగోలుగా వుంటూ అందరి సమస్యల్లో పాలుపంచుకొంటూ, సహాయం చేస్తూ అందరికీ తమ కుటుంబంలోని ఆడపడుచు అనేంత చనువు, ప్రేమ పొందిన అమ్మాయి. శారద అన్నయ్య కేశవ (కైకాల సత్యనారాయణ). కేశవకు తన చెల్లి శారద అంటే పంచప్రాణాలు, తన వివాహానికి ఉన్న పొలమంతా కట్నం కింద ఇచ్చైనా సరే ఘనంగా చెయ్యాలి అని నిర్ణయించుకుంటాడు. ఇక మునసబు వద్ద చిన్నప్పటి నుంచి పెరిగి విద్యాబుద్ధులు పొంది పట్టణంలో వైద్య వృత్తికి సంబంధించిన చదువు పూర్తి చేసి తిరిగి గ్రామానికి వచ్చిన వ్యక్తి కృష్ణమూర్తి (శోభన్ బాబు). కృష్ణమూర్తి తన చదువును తన గ్రామ ప్రజల మేలుకే ఉపయోగించి తన వంతుగా గ్రామానికి సహాయం చెయ్యాలనుకుంటున్నట్లు మునసబు గారితో తన అభిప్రాయం వెల్లడిస్తాడు. దానికి మునసబు కృష్ణమూర్తి ఇంత చదువు చదివి ఊర్లో వైద్యమా అంటూ ముందు తటపటాయించినా చివరకు ఒప్పుకుంటాడు. ఊర్లోనే క్లీనిక్ ప్రారంభం అవుతుంది. ఇదిలా వుండగా ఒకనాడు శారద మా పేషెంట్‌కు వైద్యం చెయ్యాలంటూ కృష్ణమూర్తిని తీసుకెళ్తుంది. తీరా అక్కడికెళ్ళాక వైద్యం చెయ్యాల్సింది పేషెంట్‌కు కాదు తను పెంచుకున్న పెంపుడు కుక్కకు అని తెలిసి ఆశ్చర్యపోతాడు. కాని

కృష్ణమూర్తి కి శారద అమాయకత్వం, మంచితనం, అంతకుమించి ఆవిడ కలివిడి స్వభావం అతడిని ఆమెతో ప్రేమలో పడేలా చేస్తాయి. కృష్ణమూర్తి ఆమె తనను ప్రేమించేలా చేస్తాడు. మరోవైపు శారద అన్న కేశవ ఆమె వివాహానికి సంబంధించిన మంతనాలు, అభిప్రాయాలను మునసబుతో పంచుకుంటూ వుంటాడు. కాని కృష్ణమూర్తి - శారదల ప్రేమ గూర్చి తెలిసిన మునసబు వారి వివాహాన్ని జరిపించాలనే విషయం కేశవకు చెప్తాడు. గ్రామ ప్రజలందరి సమక్షంలో శారద - కృష్ణమూర్తిల వివాహం జరుగుతుంది. శారద తాను చాన్నాళ్ల నుంచి దాచుకున్న మాటలను, ప్రేమానురాగాలను వివాహం నాటి మొదటిరోజు రాత్రి కృష్ణమూర్తితో పంచుకోవాలనుకున్న సమయం రానే వచ్చింది అని సంబరపడ్తుంది. అదేరోజు రాత్రి ఒక వ్యక్తి తన భార్యకు వైద్య సహాయం చేయమని డాక్టర్ కృష్ణమూర్తిని సంప్రదిస్తాడు. తన వృత్తి పట్ల వున్న నిబద్ధతతో కృష్ణమూర్తి అతడితో కలిసి వెళ్తాడు. ఒకవైపు శారద కృష్ణమూర్తి ఎప్పుడెప్పుడు వస్తాడా అని రాత్రంతా ఎదురు చూస్తుంటుంది. కృష్ణమూర్తి వైద్యం చేసి తిరిగి వస్తున్న సమయంలో పడవ తిరగబడి మరణిస్తాడు. పడవ తిరగబడిందనే విషయం శారదకు తెలియగానే ఆమె కళ్ళు తిరిగి పడిపోతుంది. గ్రామ జనం అంతా విషాదంలో మునిగిపోతారు. ఊర్లో అందరికీ ఆడపడుచు లాంటి శారదకు అలాంటి దుస్థితి రావడం చూసి జాలిపడతారు. శారద మెళకువలోకి రాగానే తను వస్తున్నాడు, అందరూ ఇక్కడే ఉన్నారేంటి అంటూ అందరూ మీ, మీ ఇళ్ళకు బయలుదేరండి అనే ధ్యాసలో మాట్లాడుతుంది. జరిగిన నిజాన్ని చెప్పే సాహసం చెయ్యలేక, చెప్తే తను ఏమవుతుందో అనే భయంలో కేశవ బావ కృష్ణమూర్తి వస్తూనే పట్టణానికి వెళ్ళాడు అంటూ అబద్ధం చెప్తాడు. గ్రామ ప్రజలంతా అదే విధంగా అబద్ధం చెప్పడం మొదలెడతారు. అలా అప్పట్నుంచి శారద వేచి చూస్తూనే వుంటుంది.

ఈ మొత్తం తతంగంలో కొసమెరుపైన విషయమేంటంటే చనిపోయిన కృష్ణమూర్తి, వివాహ నిమిత్తం గ్రామానికి వచ్చిన మూర్తి ఇద్దరూ ఒకేలా వుండడం. అందుచేతనే శారద, ఊరిజనం మూర్తిని చూడగానే కృష్ణమూర్తిగా భ్రమపడతారు.

జరిగిన విషయం ఇదంటూ మునసబు తమ ఊర్లో వివాహానికి వచ్చిన మూర్తితో చెప్తాడు. మూర్తి శారద, గ్రామప్రజలు తనతో అలా వ్యవహరించడానికి కారణం ప్రశ్నిస్తాడు. అప్పుడు మునసబు చనిపోయిన కృష్ణమూర్తి, ఇప్పుడు మా ముందున్న నువ్వు మీ ఇద్దరూ ఒకే రూపంలో వుండడం అని చెప్తాడు. దానికి తోడు ఇద్దరూ వైద్య వృత్తి వారే అవడం విచిత్రం అంటూ చెప్తాడు. కాని ఎలాగైనా తనను రక్షించుకోవాలనే వారి తాపత్రయాన్ని చూసిన మూర్తి శారదకు వైద్యం చెయ్యాలని నిర్ణయించుకుంటాడు. ఆ విషయం వారితో తెలియజేసి తనకు నయం చెయ్యాలంటే ఆమెను పట్టణానికి తీసుకువెళ్ళాలి అని చెప్తాడు.

శారదను ఆమె అన్న కేశవ పట్టణం తీసుకువెళ్ళి చికిత్స నిమిత్తం వారిని హెూటల్‌లో వుంచుతాడు మూర్తి. తన భార్య పద్మతో తాను కాన్ఫరెన్స్ కు వెళ్తున్నట్లు చెప్పి హెూటల్‌కు వెళ్లి శారదతో భర్తగా నటిస్తూ ఆమెలో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తాడు. కాని ఈ లోగా ఎవరో పద్మకు నీ భర్త పరాయి పడుచుతో హెూటళ్ళో గడుపుతున్నాడు అని చెప్పడంతో, పద్మ గుట్టుగా ఆ విషయం నిజమా, కాదా అని తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది. మూర్తి మరో అమ్మాయిని హెూటల్‌లో వుంచాడు అనే విషయం నిజమే అని తెలిసి వారిని మందలించడానికి వెళ్తుంది. కాని కేశవ శారద పరిస్థితిని తెలియజేసి ఆ మహానుభావుడు మూర్తిగారి తప్పేం లేదని పద్మతో చెప్పగా పద్మ శారద పరిస్థితిని అర్థం చేసుకుని, భర్త యొక్క మంచి హృదయానికి సంతోషిస్తుంది. శారద ఇక నుండి మన ఇంట్లోనే వుంటుంది, తను మునుపటి స్థితికి వచ్చేదాకా అని భర్తతో చెప్పి వారికి ఇంట్లోనే ఆశ్రయం ఇస్తుంది. నిజానికి మూర్తి-పద్మ దంపతులకు అక్కడి నుండే అసలైన కష్టాలు మొదలవుతాయి. కారణం శారద మూర్తిని తన స్వంత భర్తలా భావించి సపర్యలు చేయడం, భర్తతో అన్యోన్యంగా ప్రవర్తిస్తూ వుండడం. దానికి తోడు శారద పద్మను చూసి ఆమె గూర్చి ఆరా తీయడం దానికి మూర్తి-పద్మలు దాటవేసేందుకు ప్రయత్నాలు చెయ్యడం అలా పలుమార్లు అబద్ధాలతో తప్పించు కుంటూ వుండడం చేస్తారు. చివరికి మూర్తి- పద్మల కుమారుడికి సంబంధించిన సందర్భాల్లో కూడా అదే సంకట స్థితులను ఎదుర్కొంటారు. ఈ విషయాలన్నింటి వల్ల కేశవ అనవసరంగా తన చెల్లి కోసం అందరినీ ఇబ్బందుల్లోకి నెడుతున్నానన్న న్యూనతతో సతమతమవుతూ వుంటాడు. తన భర్త తనతోనే వున్నాడన్న ఆనందంతో శారద రోజులు గడిచేకొద్దీ కొంత మామూలు స్థితికి వస్తుంది. పరిస్థితులను అర్థం చేసుకొనే స్థాయికి చేరుకుంటుంది. కాని మూర్తి- పద్మల మధ్య దాంపత్య జీవితం ప్రశ్నార్థకం అయ్యే పరిస్థితి వస్తుంది. ఎదురు కాబోయే సమస్యను పసిగట్టిన మూర్తి ఎలాగైనా ఈ పరిస్థితిని చరమాంకానికి తీసుకురావాలనే ఆలోచనకు వస్తాడు.


మూర్తి తన వృత్తికి న్యాయం చెయ్యాలన్న నిబద్ధతతో సరిగ్గా తాను ఎదుర్కొంటున్న పరిస్థితినే తనకు వరుసకు మామ అయిన అల్లు రామలింగయ్య గృహంలో కల్పిస్తాడు. తండ్రిని కోల్పోయి పిచ్చివాడిగా మారిన రాజా (రాజాబాబు)ను మామూలు స్థితికి తీసుకురావాలనే ప్రయత్నంలో వున్నప్పుడు అల్లురామలింగయ్య మూర్తి ఆసుపత్రికి వస్తాడు. అప్పుడు రాజా అల్లు రామలింగయ్యను చూసి నాన్నగారు, నాన్నగారు అంటూ భ్రమపడుతూ కుమారుడిలా ప్రవర్తిస్తాడు. అది గమనించిన మూర్తి అల్లు రామలింగయ్యతో ఆ అబ్బాయి తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తండ్రిని కోల్పోయిన తను ఆ విషయాన్ని జీర్ణించుకోలేక అప్పటినుండి

మతిస్థిమితం కోల్పోయాడు, మిమ్మల్ని చూసి వాళ్ళ నాన్నగారని భ్రమపడుతున్నాడు అని చెప్తాడు. మీరు కొన్నాళ్ళు అతడితో నాన్నగారిలా వ్యవహరిస్తే గనక అతడు మామూలు స్థితికి వస్తాడు అని చెప్తాడు. అల్లు రామలింగయ్య ముందు ఆ విషయాన్ని అంగీకరించకపోయినా కొన్నాళ్ళకు తన స్వంత కుమారుడి కన్నా గుణంలో, ప్రేమలో రాజానే మంచివాడని గ్రహించి తండ్రీ–కొడుకుల అనుబంధంతో జీవిస్తాడు.

మూర్తికి శారద విషయంలో మాత్రం పరిష్కారం దొరకని సవాలు ఎదురవుతుంది. చివరకు ఒకరోజు మూర్తి, శారద, పద్మ, కేశవ అందరు ఇంట్లో వున్న సమయంలో అల్లు రామలింగయ్య భార్య అనగా మూర్తి అత్తగారు వచ్చి మూర్తితో నువ్వు చేసిన ఘనకార్యానికి మీ మామయ్య ఆ పిచ్చివాడిని కుమారుడిగా స్వీకరించి మమ్మల్ని ఇంట్లో నుండి తరిమాడంటూ చెప్తుంది. అదే సమయంలో శారద విషయం కూడా ఆమె బహిర్గతం చేయబోతుందని గ్రహించి మూర్తి శారద తో ఇన్నాళ్లు తన అన్న కేశవ, మునసబు, ఊరివాళ్ళు దాచిన నిజాన్ని చెప్తాడు. "శారద నువ్వనుకుంటున్నట్లు నేను నీ భర్త కృష్ణమూర్తి ని కాదు, నీ భర్త చాన్నాళ్ల క్రితమే మరణించాడు అని చెప్తాడు". అప్పటికే మూర్తి వైద్యం వల్ల సాధారణ స్థితికి వచ్చి నిజాన్ని అర్థం చేసుకుని ధైర్యంగా వుండే మానసిక స్థాయిని సంపాదించి వుంటుంది శారద. ఈ సన్నివేశం చాలా గంభీరంగా సాగుతుంది. అది విన్న శారద గదిలోకి తలుపులు వేసుకుంటుంది. ఆమె ఏ అఘాయిత్యం చేసుకోబోతుందో అని అందరూ కంగారు పడతారు. కాసేపటకి గది తలుపులు తెరిచి బయటికి వస్తుంది తెల్లచీర కట్టుకొని విధవరాలిగా. ఆ తర్వాత అన్న కేశవ, శారదను తీసుకుని ఊరికి తిరుగు ప్రయాణమై వెళ్ళగా ఊరి ప్రజలంతా శారద సాధారణ మనిషిగా మారిందన్న సంతోషంతో వేచిచూస్తుంటారు. పడవ తీరానికి చేరువవుతున్న తరుణంలో శారద కృష్ణమూర్తి సమాధిని చూస్తుంది. అది చూసి తట్టుకోలేని శారద, కృష్ణమూర్తి పై వున్న ప్రేమతో ఒడ్డుకు చేరకముందే తన ప్రాణాలను విడిచి చనిపోతుంది. మొత్తంగా చిత్రం విషాదంతో ముగుస్తుంది.

**చిత్ర విశేషాలు :**

అన్న చేతుల్లో గారాల పట్టిగా పెరిగిన శారద ఊరంతటినీ తన కుటుంబంగా భావించి అందరి సమస్యల్లో పాలుపంచుకొంటూ అందరికీ చేదోడువాదోడుగా వుండే స్వభావం వల్ల ఆమెను ఆ ఊరి జనం అంతా తమ ఇంట్లో ఆడపిల్లగా భావిస్తారు. చిత్రంలో శారదకు దూరమైన తన భర్త కృష్ణమూర్తి తిరిగి రాని దూరాలకు వెళ్ళాడని తెలిసి ఊరి జనం అంతా శారదను బతికించుకోవడానికి కృష్ణమూర్తి బతికే ఉన్నాడన్నట్లు నటించడమనేది ఒక మనిషి వ్యక్తిత్వానికి వుండే విలువ ఎలాంటిదో చెప్తుంది.(నేటి రోజులకు ముడిపెట్టి ఈ విషయాన్ని చెప్పే సాహసం చెయ్యలేం అనుకొండి). చిత్రం మొత్తానికి ప్రధాన బలం కథానాయిక శారద గారి నటన. చలాకీ అమ్మాయిగా




నటించడంలోనూ, కృష్ణమూర్తి పడవ తిరగబడింది అని తెలిసిన తర్వాత మూర్ఛబోయి, లేచీలేవగానే తాను వస్తాడు అనే పిచ్చి నమ్మకం ప్రదర్శించే సమయంలోనూ, మూర్తి ఇంట్లో అతనికి భార్యగా సేవలు చేస్తూ ప్రేమను ప్రదర్శించే తరుణంలోనూ ఆమె నటన చాలా సహజంగా వుంటుంది. మూర్తి వివాహ నిమిత్తం గ్రామానికి వచ్చాక శారద సంగతి తెలుసుకుని ఆమె ఇంటికి వెళ్ళినప్పుడు కృష్ణమూర్తి వచ్చాడన్న ఆనందంతో మతిస్థిమితం సరిగ్గా లేని శారద అతడిని వేసే అమాయక ప్రశ్నలు ప్రేక్షకుడి గుండెను తడిచేస్తాయి. **"ఎన్నాళ్ళ నుండి వేచివున్నానో తెలుసా, అప్పుడెప్పుడో చికిత్స చేయడానికి వెళ్ళారు, అట్నుంచి అటు పట్టణం వెళితే కనీసం ఒక ఉత్తరం అయినా రాయాలన్న ఆలోచన రాలేదా"** అనే మాటలు ఒకవైపు ఆమెకు కృష్ణమూర్తి పై వున్న ప్రేమను వ్యక్తం చేస్తుంటే, మరోవైపు కృష్ణమూర్తి లేడన్న విషయం తనకు తెలీదే అనే రీతిలో ఆమెపై సానుభూతి కలిగేలా చేస్తాయి.

కృష్ణమూర్తి, మూర్తి రెండు పాత్రల్లో శోభన్ బాబు గారి పాత్ర చిత్రణ, నటన ఆకట్టుకుంటాయి. కృష్ణమూర్తి పాత్రలో మునసబు గారి పర్యవేక్షణలో పెరిగిన కృష్ణమూర్తి పెద్ద చదువులు చదివిన తర్వాత తన మూలాలను మరవకుండా తన వైద్య వృత్తిని తన ప్రజలకు మేలు చేకూర్చేందుకే ఉపయోగించాలన్న సదుద్దేశ్యంతో మునసబు గారి సహాయంతో ఆసుపత్రిని ప్రారంభిస్తాడు. తను శారదను వివాహం చేసుకున్న రోజున రాత్రి అత్యవసరంగా పొరుగు గ్రామంలో చికిత్స నిమిత్తం ప్రాధేయపడిన వ్యక్తి పరిస్థితిని అర్థం చేసుకుని వృత్తి పట్ల వున్న నిబద్ధతతో తన విధిని నిర్వర్తిస్తాడు. కాని దురదృష్టవశాత్తు తను తిరిగి ఇంటికి వెళ్ళే క్రమంలో పడవ తిరగబడడంతో మరణిస్తాడు. మరోవైపు మూర్తి శారద పరిస్థితిని చూసి ఎటూ పాలుపోలేని స్థితిలో శారదను మునుపటి స్థితికి తీసుకురావడానికి ఆమెకు వైద్యం చేయాలని నిర్ణయించుకుంటాడు. నిజానికి మూర్తి తీసుకున్న నిర్ణయం పెద్ద సాహసం అని తెలిసి, దాని పర్యవసానాలు తన దాంపత్య జీవితానికి సంక్లిష్ట సందర్భాలను ఉత్పన్నం చేస్తాయని తెలిసి కూడా ఒక సైకియాట్రిస్ట్ గా తన విధిని నిర్వర్తించడం వృత్తి ధర్మంగా భావిస్తాడు. నిజానికి ఏ వృత్తిలో అయినా కొన్ని సార్లు వృత్తిపరమైన సవాళ్లు ఎదుర్కోవడం తప్పదు.

అలాంటి సందర్భాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుని ముందుకు వెళ్తున్నాం అనేది ప్రధాన విషయం అవుతుంది అనడానికి ఉదాహరణగా ఈ సన్నివేశాలను తీర్చిదిద్దారు.

ఇక మూర్తి భార్య పాత్రలో జయంతి నటన కావచ్చు, ఆ పాత్రను రూపొందించిన విధానం అద్భుతంగా వుంటుంది. శారదకు చికిత్స నిమిత్తం మూర్తి ఆమెను హొటల్లో వుంచి భార్య పద్మకు మాత్రం కాన్ఫరెన్స్ కు వెళ్తున్నాను అని అబద్ధం చెప్పాడని పద్మకు తెలిసినప్పుడు ఆ విషయం తెలిసిన పద్మ తన భర్త చేసిన పనిని పరిణతితో అర్థం చేసుకుంటుంది. భర్త నిర్ణయాన్ని కొన్నిసార్లు లోతుపాతులు తెలుసుకోకుండా అనుమానించే, అర్థం పర్థం లేని కోపతాపాలతో సంసారాలను ఛిద్రం చేసుకునే స్త్రీ లా కాకుండా భర్త వృత్తిని, అతని వ్యక్తిత్వాన్ని పూర్తిగా నమ్మిన భార్యలా మెలుగుతుంది. అంతేకాక శారదను ఇంట్లో వుంచి చికిత్స చేయమని సలహా ఇచ్చి తన భర్త గూర్చి తప్పుగా మొరిగే నోళ్ళకు మూతపడేలా చేస్తుంది.

ఇక శారద అన్న కేశవ పాత్రలో కైకాల సత్యనారాయణ గారి నటన, గ్రామ మునసబు పాత్రలో రావుగోపాలరావు నటన చెప్పుకోదగిన రీతిలో వుంటాయి. చెల్లి శారదయే ప్రపంచంగా బతికే అన్న కేశవ ఆమె వివాహంకోసం తన పొలాన్నంతా తాకట్టు పెట్టడానికి కూడా వెనకాడని వల్లమాలిన ప్రేమానురాగాలతో జీవిస్తుంటాడు. తన చెల్లి, కృష్ణమూర్తిపై ఆశలతో ఏ రోజుకైనా తిరిగొస్తాడు అనే ఆలోచనతో బతుకుతూ వుండడం, కృష్ణమూర్తి చనిపోయాడన్న నిజం తెలిస్తే అప్పటికే మతిస్థిమితం లేకుండా మారిన తన చెల్లి ఏమవుతుందో అనే భయంతో ప్రతి క్షణం ఆమెను కాపాడుకోవడానికి పడే తాపత్రయం గుండెల్ని కదిలించి వేస్తుంది. అన్న- చెల్లి మధ్య గొప్ప అనుబంధాన్ని చూపించారు.

ఇక చిత్రంలో హాస్యం విషయానికి వస్తే శారద తన అమాయకత్వంతో ఇతరులతో వివిధ రకాలుగా ప్రవర్తించే సందర్భాల్లో సహజమైన హాస్యం వుంటుంది. అంతేకాక అల్లు రామలింగయ్య- (రాజు) రాజాబాబు ల మధ్య వుండే అన్ని సన్నివేశాలు హాస్యాత్మకంగా వుండడంతో పాటు వారికి సంబంధించిన ఘట్టాలలో అంతర్లీనంగా తండ్రిని కోల్పోయిన కుమారుడు తండ్రి ప్రేమకోసం పడే తపన కనిపిస్తుంది. అల్లు రామలింగయ్య స్వంత కుమారుడు ఆయన బతికుండగానే ఆస్తి కాజేయాలని ప్రయత్నం చేయడం, చివరకు స్వంత కుమారుడి కన్నా నిస్వార్థమైన ప్రేమతో తనను నాన్నగా భావించే రాజుయే మేలని భావించడం వల్ల అల్లు రామలింగయ్య రాజాయే నా కుమారుడు అని ప్రకటించుకుంటాడు.

ఈ చిత్రానికి సంగీతం కె.చక్రవర్తి గారు అందించారు. మొత్తం ఏడు పాటలుంటాయి. వాటిలో **'వ్రేపల్లె వేచెను, వేణువు వేచెను, వనమెల్ల వేచెనురా'** అంటూ సాగే పాట శారద తన భర్త వస్తాడని చాన్నాళ్లుగా వేచి చూస్తున్న సందర్భంలో మూర్తి తన స్నేహితుడి వివాహానికని శారద వుండే గ్రామానికి వస్తున్నప్పుడు వుంటుంది. శారద- కృష్ణమూర్తి లు ఇద్దరూ ప్రేమలో వున్న సందర్భంగా వచ్చే మరొక పాట **'శారదా నను చేరగా ఏమిటమ్మ సిగ్గా ఎరుపెక్కే లేత బుగ్గ'**. ఈ పాట చాలా వినసొంపైన బాణీతో కొనసాగుతుంది. మరొక పాట శారద – కృష్ణమూర్తిల వివాహం నాటి రాత్రి కృష్ణమూర్తి వైద్యం చెయ్యడానికి వెళ్ళినప్పుడు,ఆ రాత్రి కృష్ణమూర్తిపై తాను


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

గుమ్మరించాలనుకున్న ప్రేమను గుర్తు చేసుకుంటూ ఏ అమ్మాయికి అయినా వివాహం అనేది కన్నె కాస్తా వధువుగా మారి కొత్త జీవితాన్ని ఆరంభించడానికి మార్గాన్ని ఏర్పరిచే ఒక అపురూప ఘట్టం అని చెప్పేలా కొనసాగుతుంది. ఏ స్త్రీ జీవితంలో అయినా అది ఒకేసారి సాధ్యం అవుతుంది అంటూ చెప్పే పాట. అది **'కన్నె వధువుగా మారేది జీవితంలో ఒకేసారి'** ఇదే పాట శారద తన భర్తకై ఎదురుచూస్తున్న రోజుల్లో మూర్తి తన భర్త అని భావించి తనతో అన్యోన్యంగా వున్నప్పుడు కూడా వుంటుంది. కాని అది ఒక విభిన్నమైన, విషాదమైన సంకట స్థితిని వ్యక్తపరిచే విధంగా వుంటుంది. కె.చక్రవర్తి గారి సంగీతం తో పాటు బొల్లిముంతల శివరామకృష్ణ గారి మాటలు చిత్రానికి ప్రధాన బలం. కొన్ని మాటలు వాస్తవాలను చెప్పేలా వుంటే మరికొన్ని మాటలు పాత్రల స్వభావం, స్థితి, స్థాయిలను చెప్పేలా వుంటాయి.

కన్నడ భాషలోని చిత్రాన్ని ఆధారంగా చేసుకుని నిర్మించబడిన ఈ "శారద" చిత్రాన్ని ఆధారంగా చేసుకుని తర్వాతి కాలంలో తమిళంలో 'రాధా' పేరుతో , హిందీలో 'దుల్హాన్' పేరుతో, కన్నడంలో 'దీప' పేరుతో రీమేక్ చేశారు. ఈ చిత్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ చలనచిత్రంగా నంది అవార్డు కూడా లభించింది. శారద చిత్రానికి ముందు వచ్చిన చిత్రాలన్నింటితో పోల్చినప్పుడు ఈ చిత్రం పూర్తి విషాదాంతంగా ముగుస్తుంది. కారణం చిత్రం ఆఖరులో శారద మరణించడం. నిజానికి చిత్ర కథ అంతా కూడా భర్త కోల్పోయి మతిస్థిమితం లేకుండా మారిన శారదను మునుపటిలా మార్చి బతికించాలనే ప్రయత్నంతో కొనసాగించినప్పటికీ, శారద తన భర్త చనిపోయాడన్న నిజాన్ని తెలుసుకొని ప్రశాంత వదనంతో వున్నప్పటికి కూడా ఆమె మరణించడం విషాదాన్ని రేకెత్తిస్తుంది. ఈ రకమైన ముగింపు వల్ల ప్రధాన పాత్రలు శారదను కాపాడడానికి చేసిన ప్రయత్నం, వారి లక్ష్యం నెరవేర్చలేదనే చెప్పొచ్చు . కాని భర్త మరణించాడని తెలిశాక శారద భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుంది. దానికి తోడు భర్తపై తాను పెంచుకున్న అనురాగం, వ్యక్తపరచాలనుకున్న అత్యున్నత స్థాయి ప్రేమ నిరర్థకంగా మారడంచే ఆమె తన భర్త సమాధిని చూడగానే ఆ విషయాన్ని తట్టుకోలేని పరిస్థితిలో ఆమె మరణిస్తుంది అనే విధంగా సన్నివేశాన్ని రూపొందించారు. కృష్ణమూర్తి పై శారదకు వున్న ప్రేమ ఎంత అత్యున్నతమైందో చెప్పడానికి సంకేతంగా దర్శకుడు కె.విశ్వనాథ్ గారు ఈ చిత్రాన్ని విషాదాంతంగా ముగించారు అని రూఢి పరుచుకోవచ్చు.

చిత్రం : శారద

తారాగణం : శారద, శోభన్ బాబు, జయంతి, కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య, రాజా బాబు,

సంగీతం : కె.చక్రవర్తి

నిర్మాత : పి. రాఘవాచారి

దర్శకత్వం : కె. విశ్వనాథ్

# ప్రకృతి యొక్క వాస్తవాలైన మూడు చేదు నియమాలు

**1. ప్రకృతి యొక్క మొదటి నియమం :**

ఒక వేళ పొలంలో విత్తనం వేయకపోతే ప్రకృతి దానిని గడ్డీగాదంతో నింపేస్తుంది. అదేవిధంగా మనసును మంచి ఆలోచనలతో నింపకపోతే ఆ మనసులో చెడు ఆలోచనలు చేరుకుంటాయి.

**2. ప్రకృతి యొక్క రెండవ నియమం :**

ఎవరి వద్ద ఏమి ఉంటుందో వారు దానినే పంచుకోగలరు. సుఖం కలిగిన వారు సుఖాన్నే పంచగలరు. దుఃఖం కలిగిన వారు దుఃఖాన్నే పంచగలరు. జ్ఞానులు జ్ఞానాన్నే పంచగలరు. భ్రమలలో ఉన్నవారు భ్రమలనే పంచగలరు. భయస్తులు భయాన్నే పంచగలరు.

**3. ప్రకృతి యొక్క మూడవ నియమం :**

**మీకు మీ జీవితంలో ఏది లభించినా దానిని జీర్ణం చేసుకోవడం నేర్చుకోండి.** ఎందుంటే భోజనం అరుగకపోతే రోగాలు పెరుగుతాయి. ధనం అరగకపోతే బడాయి పెరుగుతుంది. మాటలు అరగకపోతే చాడీలు పెరుగుతాయి. ప్రశంస అరగకపోతే అహంకారం పెరుగుతుంది. నిందలు అరగకపోతే దుర్మార్గం పెరుగుతుంది. అధికారం అరగకపోతే ప్రమాదం పెరుగుతుంది. దుఃఖం అరగకపోతే నిరాశ పెరుగుతుంది. సుఖం అరగకపోతే పాపం పెరుగుతుంది.

# తృప్తి (సాహిత్య వ్యాసం)


## గరిశకుర్తి రాజేంద్ర

కామారెడ్డి, ఫోన్ : 9493702652


**"తృప్తి"** అనే మాట చాలా సామాన్యంగా అనిపించినా, వినిపించినా దానిని సాధించడం, జయించడం చాలా కష్టమైన, క్లిష్టమైన పని. తృప్తి అంటే మనకున్నది చాలనుకుని, సంతోషంగా ఉండడం. ఇతరులను చూసి ఈర్ష్య, అసూయ పడకపోవడం. అసంతృప్తితో రగిలిపోకుండా ఉండడం. అలా అని మన జీవితంలో ఆర్థికంగా, ఇతర రంగాలలో అభివృద్ధి చెందేందుకు ప్రయత్నించ రాదని కాదు, కృషి చేయరాదని కాదు. ముందుగా మనకు కలిగిన దానితో తృప్తిపడి, సంతోషంగా ఉంటూ మరింత ఉన్నతి కోసం ప్రయత్నించడంలో తప్పులేదు. కాని మనమనుకున్న లక్ష్యం నెరవేరలేదనో, మనం అనుకున్న ఆర్థిక వనరులు చేకూరలేదనో ఎప్పుడూ అసంతృప్తితో రగిలిపోవడం, మనం మదనపడుతూ కుటుంబ సభ్యులను, ఇరుగు పొరుగు వారిని అసంతృప్తికి, అశాంతికి గురి చేయడం హర్షించదగిన గుణం కాదు.

అసంతృప్తి వల్ల వ్యక్తి, సమాజం రెండూ అవస్థలకు గురి అవుతాయి. కనుక జీవితంలో ఎదురు దెబ్బలు తాకినా సరే, అనుకోని ఆపదలు వచ్చి పడినా సరే ధైర్యంగా ఎదుర్కోవాలి తప్ప, అసంతృప్తిని దరికి చేరనీయరాదు. అది మరణం కంటే ప్రమాదమని, హానికరమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

"ఒక వ్యక్తి రోడ్డుపై నడిచి వెళ్తున్నాడు. ఇంతలో ఒక ధనికుడు ఖరీదైన ఏ.సి కారులో అతని ముందు నుంచి దూసుకెళ్లాడు. వెంటనే అతనిలో అసంతృప్తి పడగలెత్తింది. ఆ పాదచారి "భగవంతుడా! నిత్యము నిన్ను కొలుస్తున్నానే. పూజలు, పునస్కారాలు చేస్తున్నానే. అతడు చేసిన పుణ్యమేమిటి? నేను చేసిన పాపమేమిటి? అతనికి ఏ.సి కారు యోగం, నాకీ నడక యోగం ఎందుకు కల్పించావు?'' అని భగవంతునితో నిష్ఠూరాలాడుతూ ముందుకు కదిలాడు. మరికొంత దూరం వెళ్లాక దివ్యాంగుడొకడు రోడ్డుపై దేకుతూ వెళ్తున్నాడు. వెంటనే ఆ బాటసారి చెంపలు వేసుకుని "క్షమించు భగవాన్! ఎప్పుడు ఎవరికి ఏమివ్వాలో నీకు బాగా తెలుసు. ఇప్పుడు నేను కారివ్వనందుకు విచారించడం లేదు. రెండు కాళ్లిచ్చినందుకు నీకు కృతజ్ఞతలు తెలుపుచున్నాను" అని వేడుకుంటూ ముందుకు కదిలాడట.

తనకంటే తక్కువ వాళ్లను చూసి వాళ్లకంటే తానే నయమను కోవడం, తనకంటే ఎక్కువ వాళ్లను చూసి ఈర్ష్య పడకుండా ఉండడం అలవరచుకుంటే అసంతృప్తిని జయించినట్లే. తృప్తిని సాధించినట్లే.

ఏరోజుకారోజు కాయకష్టం చేసి కూలి సంపాదించుకునే పేదవాడికి అసంతృప్తి దరికే రాదు. వాడికి నిన్నటి గురించిన బాధ లేదు. రేపటి గురించిన చింతన లేదు. ఈరోజు కష్టపడి సంపాదించిన డబ్బుతో భార్యా పిల్లలతో తృప్తిగా, హాయిగా ఉంటాడు. నిజమైన తృప్తిపరుడు వాడే. డబ్బు, హోదా అన్నీ ఉన్నా తృప్తి లేనివాడే నానాగడ్డి కరచి మరింత సంపాదించాలనుకుంటాడు. ఎంత సంపాదించినా తృప్తిపడడు. అందుకని అసంతృప్తే తప్ప సంతోషం వాడి దరికి చేరదు. అందుకని లంచాలు తీసుకోవడం, కల్తీలు చేయడం ఇంకా అనేక ధనార్జన మార్గాలు అన్వేషిస్తుంటాడు. అలాంటి వాగి వల్ల వాడికీ కీడే, సమాజానికీ కీడే.

కుటుంబం, భార్యా పిల్లల లంపటం లేకపోయినా ఆశ్రమాన్ని మరింత పెంచుకోవాలని, భక్తులందరూ తనకే దాసోహమనాలని తాపత్రయపడుతుంటారు. కొంతరు స్వాములు, సన్యాసులు మామూలు గృహస్థులకు, వారికి అట్టే తేడా లేదనిపిస్తుంది. గృహస్థు సంసారం కోసం తాపత్రయ పడితే స్వాములు, సన్యాసాలు ఆశ్రమాల కోసం తాపత్రయపడుతుంటారు. అంతే తేడా. వారిని, వీరిని అసంతృప్తి ఎప్పుడూ బాధ పెడుతూనే ఉంటుంది.

**"అసంతృప్తి జీవనం**
**అసంతృప్త ద్రావణం వంటిది**
**ఆ జీవనంలో సంతోషం ఉండదు**
**ఈ ద్రావణం ఎందులోనూ కరగదు."**

కాబట్టి అసంతృప్తిని దరిచేరనీయక ఉన్న దాంట్లో తృప్తి పడుతూ, సంతోషంగా ఉంటూ, కుటుంబాన్ని, సమాజాన్ని సంతోషంగా ఉండేలా ప్రయత్నించడం ప్రతి ఒక్కరి బాధ్యత. అప్పుడైనా కొంత వరకైనా మన సమాజంలోని లంచాలు, ఇతర నేర ప్రవృత్తులు తగ్గగలవని ఆశించవచ్చు.

**"లోకాః సమస్తాః తృప్తో భవంతు"**

# భారతీయ సంగీతం - 50

**సామల రాజవర్ధన్**

విశ్రాంత ఉపాధ్యాయులు, ఆదిలాబాద్, ఫోన్ : 9652950959

హిందుస్తానీ శాస్త్రీయ సంగీతానికి చెందిన మరో సంగీత శిఖరం నేలకొరిగింది. రాంపూర్ షహస్వాన్ ఘరానాకు చెందిన ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ ఆదివారం 17.01.2021 న ముంబైలో స్వర్గస్థుడైనాడు. ప్రాచీన సంగీతజ్ఞులలో ప్రాచీనుడిగా, అర్వాచీనుల్లో ఆధునికుడుగా పేరుగాంచినాడు అతడు.

గురుశిష్య పరంపరలో, గురుకులంలో సంగీతం అభ్యసించి అంతటి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న చివరి తరం వాడతడు. ఆ తరం ఒక్కొక్కటిగా రాలిపోతున్నది. అయితే ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ శిష్య ప్రశిష్యులు తామర తంపరగా వున్నప్పటికీ రాంపూర్ షహస్వాన్ ఘరానాకు అతను లేని లోటు పూడ్చలేనిదే.

ఉస్తాం గులాం ముస్తఫఖాన్ సాహెబ్ యూపీలోని బదాయూన్‌లో మార్చి 03 వ తేదీ 1931వ సంవత్సరం ఒక సంప్రదాయ సంగీత కుటుంబంలో జన్మించినాడు. వారి కుటుంబం సంగీతంలో సేన్యా ఘరానాకు చెందినది. అంటే అక్బర్ దర్బార్‌లోని మియా తాన్‌సేన్ పరంపర అన్నమాట. అతని ముత్తాత ఉస్తాద్ కుతుబొద్దిన్ ఖాన్ సాహెబ్ అవధ్ సాహెబ్ అవధ్ నవాబ్ వాజిదలీషా దర్బార్ గాయకుడు.

హిందుస్తానీ శాస్త్రీయ సంగీత వ్యాప్తికి వాజిదలీషా కృషి ఎంత వున్నదో సంగీతం తెలిసిన వారందరికీ అవగతమైన విషయమే. ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ మాతామహుడు ఉస్తాద్ ఇనాయత్ హుస్సేన్ ఖాన్ సాహెబ్ కూడా వాజిదలీషా దర్బారు గాయకుడే గాక గ్వాలియర్ ఘరానాకు చెందిన విఖ్యాత గాయకుడు ఉస్తాద్ హద్దూఖాన్ సాహెబ్ మేనల్లుడు కూడా. అంతేగాక ఈ ఉస్తాద్ ఇనాయత్ ఖాన్ సాహెబ్ కుమార్తెను ఉస్తాద్‌గులాం ముస్తఫా ఖాన్ సాహెబ్ తల్లి.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ తండ్రి – గురువు ఉస్తాద్ వారిస్ హుసేన్ ఖాన్ సాహెబ్. పెదతండ్రి ఉస్తాద్ ఫిదాహుసేన్ ఖాన్‌సాహెబ్. అతడు బరోడా రాజ దర్బారు గాయకుడు. ఎట్లా చూసినా ఆ కుటుంబమంతా సంగీతమయమే. అందుకే అటువంటి కుటుంబంలో జన్మించడమే తాను చేసుకున్న పూర్వజన్మ సుకృతమని చెప్పుకునే వాడు ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ చిన్న వయస్సులోనే అనగా ఇంకా మాటలు కూడా సరిగ్గా రాని సమయంలోనే అతని తండ్రి మంచంపైన పడుకొని తన కుమారుడ్ని ఛాతిపైన కూర్చోబెట్టుకొని "సరిగమపా" అని నేర్పడం మొదలుపెట్టి నాడట. అంటే అందరు పిల్లలు "అత్కత అత్త తాత" అంటూ మాటలు నేర్చుకుంటే అతను సరిగమపా అని పాటలు నేర్చుకున్నాడన్న మాట. అతనికి సంగీతం ఉగ్గుపాలతోనే అబ్బింది అనే జాతీయానికి ఇంతకంటే మంచి నిదర్శనం లేదుకదా. అట్లా నేర్చినవాడు కనుకనే ఎనిమిది



ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్

సంవత్సరాల అతిపిన్న వయసులోనే తొలి కచేరీ చేసి అందర్నీ అబ్బురపరిచినాడు.

గులాం ముస్తఫాఖాన్ సాహెబ్‌కు ఏ డిగ్రీలూ లేవు. చదువంతా ఇంట్లోనే సాగింది. హిందీ– ఉర్దూ చదవడం, రాయడం నేర్చుకున్నాడు. మిర్జాగాలిబ్ గజల్లంటే అతనికి చాలా ఇష్టం. సందర్భానుసారంగా గాలిబ్ షేర్లను ఉటంకించడం అతనికి ఇష్టమైన కాలక్షేపం. ఉదయం నిద్రలేచింది మొదలు రియాజ్ (సంగీత సాధన) చేయాల్సిందే. బయటకు వెళ్లి పిల్లలతో ఆడుకోవడం అనేది లేనేలేదు. "మా వాడు బయట ఆడుకుంటూ కనబడితే వాణ్ణి తన్ని ఇంట్లోకి తరమండి" అని వీధిలోని వారికి ఫర్మానా జారీచేసి నాడతని తండ్రి. అతని పాలిట తండ్రి మాట సుగ్రీవాజ్ఞనే. నిరంతరం సంగీత సాధన మాత్రమే అతడు చేయవలసింది. అదే తనను ఇంత దూరం తీసుకొచ్చి వచ్చి పద్మ భూషణున్ని చేసింది అని వినయంగా చెప్పుకుంటారు.

తమ తండ్రి ఉస్తాద్ వారిస్ హుసేన్ ఖాన్ సాహెబ్ వద్ద ప్రాథమిక సంగీతం నేర్చిన తర్వాత తన పెదతండ్రి ఉస్తాద్ ఫిదాహుసేన్ ఖాన్ సాహెబ్ వద్ద నేర్చినాడు. అంతేగాక రాంపూర్ షహస్వాన్ ఘరానాకు చెందిన ఉస్తాద్ నిస్సార్ హుస్సేన్ ఖాన్ సాహెబ్ వద్ద శిష్యరికం చేసి రాంపూర్ షహస్వాన్ ఘరానా సంగీతాన్ని కరతలామలకం చేసుకున్నాడు. అంటే గ్వాలియర్, రాంపూర్ షహస్వాన్ ఘరానా సంగీతాల సంగమ స్థలం ఉస్తాద్ గులాం ముస్తఫఖాన్ సాహెబ్ సంగీతం అనవచ్చు.



రాంపూర్ షహస్వాన్ ఘరానాకు చెందిన ఉస్తాద్ నిస్సార్ హుస్సేన్ ఖాన్ సాహెబ్ ప్రస్తావన వచ్చింది కనుక అతని గురించి ప్రముఖ సంగీత విశ్లేషకులు డా. సామల సదాశివ గారేమన్నారో ఇక్కడ చూద్దాం. **"ఉస్తాద్ నిస్సార్ హుస్సేన్ ఖాన్ పాడే తరానాలు వింటే ఆశ్చర్యం కలుగుతుంది. అతని నోట్లో నాలిక చేపపిల్ల తిరిగినట్లు ఎంత వేగంగా తిరుగుతుందో! ఆ లయకారీ, ఆ ఫిరత్ అనితర సాధ్యాలు..."** (సంగీత శిఖరాలు పు.సం. 154)

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ తన ఎనిమిది సంవత్సరాల వయస్సులోనే తొలి కచేరీ చేసినాడని చెప్పుకున్నాం. అది ఆంగ్లేయుల పాలన కనక ఆనాడు ప్రతి నగరానికి ఒక విక్టోరియా గార్డెన్ వుండేది. అది కూడా నగర పురపాలక సంస్థ అధీనంలో వుండేది. ప్రతి జన్మాష్టమి నాడు విక్టోరియా గార్డెన్‌లో సంగీత సభ జరపడం ఆనవాయితీ. అక్కడి పురపాలక సంఘాధ్యక్షుడు అలీమక్సూద్ సంగీత రసజ్ఞుడు కనుక పెద్ద పెద్ద సంగీతజ్ఞులను పిలిపించి, సభలను బ్రహ్మాండంగా జరిపేవాడు. అటువంటి సభలో అందరూ పెద్దల మధ్య ఎనిమిది సంవత్సరాల బాలుడైన గులాం ముస్తఫాను గానం చేయమన్నాడు. అతడు కూడా నిర్భయంగా గానం చేసి అందర్నీ ఆశ్చర్యచకితులను చేసినాడు. ఆనాటి నుంచి గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ ఇక వెనకకు తిరిగి చూసుకునే అవసరమే రాలేదు.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ అన్న ఉస్తాద్ హఫీజ్ అహ్మద్ ఖాన్ సాహెబ్ ఆకాశవాణి లక్నో స్టేషన్లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వున్న సమయంలో ఆకాశవాణిలో జరిగిన సంగీత సభలో గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ దాదాపు నాలుగు గంటలు ఏకధాటిగా గానం చేసినాడట. ఆ సభలో ముందు వరుసలో కూర్చున్న ఉస్తాద్ బడేగులామలీ ఖాన్ సాహెబ్ ముగ్ధుడై తనను ఆశీర్వదించినాడని చెప్పుకునేవాడు ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్.

1952 లో ఆనాటి రాష్ట్రపతి బాబూరాజేంద్ర ప్రసాద్ ఎదుట ఎందరో పేరున్న గాయికా గాయకుల మధ్య గానం చేసే అవకాశం ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్‌కు లభించింది. అతని గానం విన్న రాజేంద్రప్రసద్ గారు "జూనియర్ తాన్‌సేన్" అనే బిరుదును ప్రదానం చేసినాడు.

ఇక్కడొక విషయం మనవి చేస్తాను. డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ గారు గొప్ప సంగీత ప్రేమికుడు గనక ప్రతి శనివారం రాత్రి ఆకాశవాణి వారు ఒక సంగీత కచేరీ యేర్పాటు చేసేవారు. ఆనాడన్నీ లైవ్ ప్రోగ్రామ్‌లే కనుక రేడియోలో ప్రత్యక్ష ప్రసారం అయ్యేవి. అవే తరువాత జాతీయ సంగీత కార్యక్రమాలుగా మారినాయి. వాటినే ఈనాటికీ నేషనల్ ప్రోగ్రాం ఆఫ్ మ్యూజిక్ పేరిట ఆకాశవాణి వారు ప్రసారం చేస్తున్నారు. అయితే ఇవి లైవ్ ప్రోగ్రాములు కావు. విదుషి సునందా పట్నాయక్ గాత్రం విని ఆమెకు స్కాలర్‌షిప్ ఇప్పించి పండిత్ వినాయకరావు పట్వర్ధన్ వద్ద సంగీత శిక్షణ ఇప్పించినాడు. అదీ సంగీతం పట్ల అతనికున్న నిబద్ధత.

డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ గారు ఆస్తమాతో బాధపడేవారు. కనుక చలికాలం ఢిల్లీలో వుండటం మంచిది కాదని డాక్టర్లు సూచించగా, శీతాకాలంలో హైదరాబాద్ రాజ్‌భవన్‌లో క్యాంప్ ఆఫీస్ యేర్పాటు చేసేవారు. ఈనాడది ఆచారంగా మారిపోయి భారత రాష్ట్రపతి శీతాకాలం క్యాంప్ హైదరాబాద్‌లో యేర్పాటు చేస్తున్నారు. బాబూ రాజేంద్రప్రసాద్ గారి ఆరోగ్యం దృష్ట్యా యేర్పాటయిన క్యాంపులు ఆనవాయితీగా మారడం వెనక వున్న విషయమిదే. మన సంప్రదాయాలు అట్లాగే వుంటాయి.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్‌కు 1969 లో ప్రతిష్టాత్మకమైన హరివల్లభ సంగీత సభలో పాల్గొనే అవకాశం లభించింది. ఈ సంగీత సభలో పాల్గొనాలంటే అంత సులభం కాదు. రకరకాల పరీక్షల తర్వాత గొప్ప గొప్ప సంగీతజ్ఞులకు కూడా అందులో పాల్గొనే అవకాశం లభించదు. అందులో గానం చేస్తే తమ జన్మ ధన్యమైందని భావించే వారు ఎందరో ఈనాటికీ వున్నారు. అటువంటి సభలో పాల్గొనడానికి తన 38 సంవత్సరాల వయసులో గాన కచేరి చేయడానికి ఆహ్వానాన్ని అందుకొని తన గాన కళను ప్రదర్శించి మెప్పు పొందినాడు. అంతేగాక క్వీన్ లేడీ డయానా ఎదుట గాత్ర కచేరీ చేసే అరుదైన అవకాశాన్ని కూడా అందిపుచ్చు కున్నాడు. అందులో విజయం సాధించినాడని వేరే చెప్పవలసిన అవసరం లేదు.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ సంగీత పునాది చాలా గట్టిది. అతని సాధన కఠోరమైనది. కనుక ఎటువంటి క్లిష్టమైన బంధిష్ నైనా అతి సునాయాసంగా గానం చేసే నేర్పు అతని

సొంతమైంది. కనుక శాస్త్రీయ సంగీతంతో పాటు ఉప శాస్త్రీయ సంగీత ప్రక్రియలైన ఠుమ్రీలు పాడటంలో కూడా నిపుణతను సంపాదించినాడు.

ఈ నైపుణ్యమే ఉస్తాద్ గులాం ముస్తఫా ఖాన్ సాహెబ్‌ను బాలివుడ్ మకుటం లేని మహారాజుగా నిలిపింది. హిందీ చిత్రసీమలో గాయకునిగా సంగీత దర్శనికుగా, గురువుగా నీరాజనాలందు కున్నాడు. 1957లో "ఛంద్ ప్రీతీచా" అనే మరాఠీ చిత్రంలో ఒక 'లావణీ' పాడే అవకాశం వచ్చింది. అది బాగా ప్రచారం అయింది కనుక మరాఠీలోను, గుజరాతీలోనూ అసంఖ్యాకమైన పాటలు పాడినాడు. తరువాత విఖ్యాత దర్శకుడు మృణాల్ సేన్ నిర్మించి దర్శకత్వం వహించిన భువన్‌షోమ్, బద్‌నాం బస్తీ చిత్రాల్లో ఉస్తాద్ గులా ముస్తఫాఖాన్ పాడిన పాటలు బహుళ జనాదరణ పొందినాయి. ఈ చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించింది విఖ్యాత వేణువాదకుడు పండిత్ విజయ రాఘవరావు. అంతేగాక ముజఫరలీ నిర్మించిన 'ఉమ్రాన్ జాన్' చిత్రంలో ఉస్తాద్ గులాం ముస్తఫఖాన్ సాహెబ్ గానం చేసి 'జూలా' ఎంతో జనరంజకమైంది. ఈ పాట వినాలకునే వారు యూట్యూబ్‌లో వినవచ్చు.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ జర్మనీ భాషలో నిర్మితమైన "బైజుబావరా" డాక్యుమెంటరీ చిత్రంల నటించడమే గాక అందులో గానం చేసినవాడు. ఇంకా భారతీయ ఫిల్మ్ డివిజన్ వారు తయారుచేసిన దాదాపు 70 డాక్యుమెంటరీ చిత్రాల్లో పాటలు పాడి మాటలందించినాడు. అందులో చాలా మటుకు జాతీయ అంతర్జాతీయ పురస్కారాలందుకున్నాయి.

హిందీ, మరాఠీ చిత్ర సీమలో మహారాణిగా గౌరవాదరాలందు కుంటున్న లతా మంగేశ్కర్ ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్‌ను గురువుగా భావించి గౌరవిస్తుందని, సలహాలు, సూచనలు అందుకుంటూ వుండేదని ఉస్తాద్ మరణానంతరం ఆమె మీడియాకిచ్చిన ఇంటర్వ్యూ ద్వారా తెలిసింది కానీ ఉస్తాద్ తన నోట ఎక్కడా ఈ విషయం వెల్లడించలేదు. అదతని వినయానికి పరాకాష్ట.

ఆషాభోంస్లే – మన్నాడే – కమల్ బారూద్– వహిదా రహమాన్, రాణూ ముఖర్జీ, గీతాదత్ వంటి పేరు మోసిన వాళ్లందరూ ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ శిష్యులూ శిష్యురాండ్రే. ఇక ఆధునికుల్లో ఏ.ఆర్.రహమాన్, హరిహరన్, సోనూనిగం, షాన్ వంటి వారు కూడా ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ శిష్యులే అంటే ఆశ్చర్యం కలుగుతుంది కానీ అది వాస్తవం.

సోనూ నిగం అప్పటికే గొప్ప గాయకునిగా పేరు తెచ్చుకున్నాడు. కానీ ఎప్పుడైతే ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ వద్ద శిష్యునిగా చేరినాడో ఆనాడే తానెంత అల్పుడినో అన్న విషయం అర్థమైందని వినయంగా చెప్పుకుంటాడు. తానొక మహా సంగీత సాగర తీరంలో



నిలబడి దోసెడు నీళ్లు తాగాలని ప్రయత్నం చేస్తున్నాడంటాడు. ఉస్తాద్ శిష్యరికంతో తన గానానికి జవజీవాలు వచ్చాయని చెప్పుకుంటాడు.

మరో ప్రముఖ గాయకుడు షాన్ ది మరో కథ. అతని అసలు పేరు శంతను ముఖర్జీ. సంప్రదాయ సంగీత కుటుంబంలో జన్మించినాడు. అతని తండ్రి మానస్ ముఖర్జీ సంగీత దర్శకుడు. తాత జహర్ ముఖర్జీ రచయిత. షాన్ హిందీ, బెంగాలీ, మరాఠీ, తెలుగు చిత్రల్లో ఆకస్మిక మరణం వల్ల ఆ కుటుంబం అతలాకుతల మైంది. షాన్ నిర్వేదానికి గురైపోయినాడు. సంగీతాన్ని వదిలేసాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. అదిగో అటువంటి సమయంలో ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ అతన్ని శిష్యునిగా స్వీకరించి తన సంగీతం ద్వారా షాన్ కు పునర్జన్మ ప్రసాదించినాడు. తాను కోల్పోయిన తన తండ్రి స్వరూపాన్ని ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ సన్నిధిలో చూసుకుంటున్నానని షాన్ ఆనంద భాష్పాలతో చెప్పుకుంటాడు.

ఇంకా ఈనాటి గాయికా గాయకులు సాగరిక అలీషాచినయ్, శిల్పారావు, కల్పనా పాటోరి, అమితాబ్ నారాయణ్ మొదలైన వారందరూ ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ శిష్యులే.

ఉస్తాద్ గులాం మేనల్లుడు శిష్యుడు అయిన ఉస్తాద్ రషీద్ ఖాన& ఈనాడు గొప్ప గాయకునిగా పేరు సంపాదించుకున్నాడు. ఉస్తాద్ చిన్న తమ్ముడు ఉస్తాద్ ఆష్తాబ్ అహ్మద్ ఖాన్ కూడా గొప్ప గాయకుడే. అతడూ ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ శిష్యుడే. ఉస్తాద్ మరో సోదరుడు నదీం కూడా గాయకుడే. ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ తన నలుగురు కుమారులు ఇద్దరు మనుమళ్లను కూడా గాయకులుగా తీర్చిదిద్దినాడు. వాళ్లందరూ హిందీ సినిమాల్లో నేపథ్య గాయకులుగా శాస్త్రీయ సంగీత విద్వాంసులుగా పేరు తెచ్చుకుంటున్నారు.

ఉస్తాద్ రెండో కుమారుడు గులాం ఖదీర్ సంగీత గురువుగా రాణిస్తూ ఎందరికో సంగీతం నేర్పుతూ, టీవీ ఛానళ్లలో వచ్చే రియాలిటీ షోలలో పాల్గొంటున్నాడు. సోనీ టీవీ ఇండియన్ ఐడల్, స్టార్‌ప్లస్‌లో "మేరా స్టార్ సూపర్ స్టార్", జో జీతా వహీ సూపర్ స్టార్" వంటి ప్రోగ్రాంలు నడుపుతూ పేరు తెచ్చుకుంటున్నాడు.

# గణతంత్రమా వందనం




స్వాగతం పలికి వందనాలు చేస్తూ
మువ్వన్నెల కేతనం ఎగరవేయాలని
ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నాం గానీ
గణతంత్ర దినోత్సవమంటే
మన రాజ్యాంగాన్ని అమలు పరచుకున్న
విలువైన రోజని మనలో ఎంతమందికి తెలుసు?

దేశాన్ని కాపాడుదాం అమరుల త్యాగాలను గుర్తిద్దాం
జెండాలోని ప్రతిరంగు ప్రత్యేకతను తెలుసుకుందాం
అశోకచక్రం అందించే సందేశాన్ని స్వీకరిద్దాం!

అవినీతిని అంతానికి చేయీ చేయీ కలుపుదాం
కులమత భేదాలకు స్వస్తి వాచకం పలుకుదాం
గాంధి ఆశయాల సాధనకై ఐక్యంగా నిలబడుదాం

అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఔన్నత్యాన్ని
కాపాడుకోవడానికి మనమంతా ప్రతిన పూనుదాం!

ఈ గణతంత్ర దినోత్సవం వేళ మానవీయ విలువల కోసం
గొంతెత్తి నినదిద్దాం అడుగడుగునా జరుగుతున్న
అన్యాయాలను ఎదురిద్దాం!
స్త్రీలను గౌరవించి వారి రక్షణ కోసం
మనం బాధ్యత తీసుకుందాం!

మహిళల వదనాల్లో  చిరునవ్వులు పూయిద్దాం!
అపుడే మన త్రివర్ణ పతాకం
గగనవీధిన గర్వంగా రెపరెపలాడుతుంది!

**అనిత దావత్**

హైదరాబాద్, ఫోన్ : 9394 221 927

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ భార్య అమీనా బేగం. ఆమె పద్మభూషణ్ ఉస్తాద్ ముష్తాఖ్ హుసేన్ ఖాన్ సాహెబ్ కుమార్తె. వారి సంతానం నలుగురు కుమారులే. ముర్తుజా ఖదీర్ రబ్బానీ ఇంకా హసన్ వీరి పేర్ల చివర ముస్తఫా అని తండ్రి పేరును జోడించుకుంటారు. మనుమలు ఫైజ్, అమీర్.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ ప్రియ శిష్యుడు ఏ.ఆర్. రహమాన్. తన గురువు గారి గొప్పదనాన్ని; అతని మూడు తరాలను ప్రపంచానికి తెలియజేయాలని సంకల్పించుకొని ఒక సంగీత బాణిని కూర్చి ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ అతని నలుగురు కుమారులు 12 సంవత్సరాల మనుమడు ఫైజ్‌లను కలుపుకొని ఒక ఆల్బం తయారు చేసినాడు. దీనిని యూట్యూబ్‌లో చూడవచ్చు. అందులో ఉస్తాద్ అతని కుమారులు మనుమడు గానం చేశారు. చెప్పడం మరిచిపోయినాను రహమాన్ కుమారుడు అమీన్ రహమాన్. సోదరి రెహానా రహమాన్‌లు కూడా ఉస్తాద్ వద్ద అతని కుమారుడు గులాం ముర్తుజా ముస్తఫా వద్ద సంగీతం నేర్చుకుంటున్నారు.

ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ అందుకున్న పురస్కారాలకు అంతులేదు. భారత ప్రభుత్వం పద్మశ్రీ – పద్మభూషణ పురస్కారాలను అందించి గౌరవించింది. ఇంకా సంగీత నాటక అకాడమీ పురస్కారం. జాతీయ తాన్‌సేన్ సమ్మాన్ – పండిత్ దీనానాథ్ మంగేశ్‌కర్ పురస్కారం. వంటివి లెక్కకు మించి వున్నాయి. అన్నింటి కంటే ముఖ్యమైన విషయం ముందుగా చెప్పవలసింది చివరగా చెప్తున్నాను.

సంగీత నాటక అకాడమీ వారికోసం ఉస్తాద్ గులాం ముస్తఫా ఖాన్ సాహెబ్, ఆచార్య కేసీ బృహస్పతితో కలిసి మతంగ మహర్షి విరచిత నాట్యశాస్త్రం, బృహద్దేశి, శార్‌ఙ్గదేవుడు రచించిన సంగీత రత్నాకరం గ్రంథాల ఆధారంగా 'జతి – గాయన్' అనే పరిశోధనాత్మకమైన కార్యక్రమాన్ని తయారు చేసినారు. దానికోసం ఉస్తాద్ గులాం ముస్తఫాఖాన్ సాహెబ్ గానం చేసిన గానం రికార్డుల రూపంలో భద్రపరిచారు. 700 సంవత్సరాల క్రితం సంగీత పద్ధతులను ఈ తరం వారికోసం గానం చేసి చిరస్మరణీయుడైనాడు.

ప్రజ్ఞాశాలియైన ఉస్తాద్ గులాం ముస్తఫా ఖాన్ సాహెబ్ 17 జనవరి 2021 న ముంబైలోని తన స్వగృహంలో అనాయాస మరణం చెందినారు. అతనిది అనాయాస మరణం వినాదైన్యేన జీవనం. అతడు లేకపోయినా అతడందించి పోయిన సంగీతం అజరామరంగా నిలిచి వుంటుంది. అతనికి ఇష్టమైన గాలిబ్ గజల్ షేర్‌లోని ఒక పాదంతో ముగిస్తాను.

**"షమ హర్ రంగ్ మె జల్తీహై సహర్ హోనేతక్" దీపం తెల్లవార్లూ వెలుగుతూనే వుంటుంది అని భావం. అతని సంగీతపు కాంతులు కూడా సంగీతకాశంలో మెరుస్తూనే వుంటాయి. వాటికి చావెక్కడిదీ.**

కీ.శే. బి.ఎన్.శాస్త్రి
అముద్రిత సిద్ధాంత గ్రంథం

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

South indian inscript Vol iv, No.710 లో 1415 శాసమున్నలున్నవి. అందు తెలుగు శాసనముల సంఖ్య 624

అన్య దేశ్యములు గల తెలుగు శాసనములు -4

South indian inscript Vol v, No.710 లో 1414 శాసనములున్నవి. వానిలో తెలుగు శాసనముల సంఖ్య -519. అన్య దేశ్యములు గల శాసనములు -7

South indian inscript Vol vi, No.710 లో 1215 శాసనములున్నవి. అందలి తెలుగు శాసనములు - 707. అన్య దేశ్యములు గల శాసనములు 11

South indian inscript Vol vii, No.710 లో 1048 శాసనములున్నవి. అందలి తెలుగు శాసనములు -28, అన్య దేశ్యములు గల శాసనములు -6

South indian inscript Vol x, No.710 లో 781 శాసనములున్నవి. అందలి తెలుగు శాసనముల సంఖ్య 752, అన్య దేశ్యము పదములు గల శాసనములు -36

తెలంగాణ శాసనములులో 123 శాసనములున్నవి. అందలి తెలుగు శాస

తెలంగాణ శాసనములు రెండవ సంపుటములోని శాసనములందలి పదములు క్రొత్తవి కావు. మొత్తము 66 అన్యదేశ్యములు గల శాసనములున్నవి. ఇంకను భావి పరిశోధనల వలన క్రొత్త శాసనములు వెలువడవచ్చును.

ఈ 66 శాసనములందలి అన్యదేశ్య పదముల సంఖ్య 204. ఎపిగ్రఫీయా ఇండియా సంపుటములందన్య దేశ్య పదములు గల శాసనములు లేవు. ఈ అధ్యాయమున అరబ్బీ, పారసీ, ఉర్దూ, హిందీ, మరాఠీ, ఒరియా పదములు ఆంధ్ర దేశములందలి శాసనములలో నుపయోగింపబడినది చూపబడుచున్నది. అరబీ భాష, ఃఉమిటిరఖ భాషా కుటుంబమునకు జెందినది. ఉర్దూ భాష హిందీ అరబ్బీ ఫారసీక భాషల సంకీర్ణము వలన ఏర్పడిన భాష.

ఉర్దూ = మకాము= బస విడిది

మార్గమున రాజులు చేసిన విడిదిలో బయలుదేరిన స్థానిక భాషకు ఉర్దు అనుపేరు వచ్చినది. ఈ భాషా ప్రజా బాహుళ్యమున వ్యాపించి, ఆదరింపబడినది. తెలుగు దేశమును పాలించిన రాజులు సైతము ఈ ఉర్దూ భాషను రాజభాషగా గ్రహించి, పరిపాలనా వ్యవహారములీ భాషలోనే సాగించినారు. తెలుగు వారు సైతమీ భాషలో పాండిత్యము సంపాదించినారు. ప్రజలు అరబీ, ఉర్దూ భాషల నభ్యసించి, రాజ్య వ్యవహారములను నిర్వహించుచుండిరని తెలియుచున్నది. అక్కన్న మాదన్న సోదరులు గోలకొండ రాజ్యము నందమాత్య పదవులనలంకరించిన వారు. ఉర్దూ, అరబీ, పారసీ మున్నగు భాషలలో రాజకీయ వ్యవహారములను నిర్వహించుచుండెడివారు. ఈ అన్య భాషా పదములు క్రమముగా తెలుగు భాషలో కొన్ని స్థిరపడినవి.

గోలకొండ నవాబుల కాలము నందాంధ్ర భాష సర్వతో ముఖాభివృద్ధి గాంచినది. గోలకొండ నవాబులలో ఇబ్రహీంకు తుబ్షా ఆంధ్ర భాషకు మహోపకార మొనర్చెను. ఈతని తరువాత రాజ్యమునకు వచ్చిన నవాబులును ఆంధ్ర పండితులను కవులను పోషించిరి. ఈ రాజన్యులు స్వయముగా పండితులును, కవులును అగుట వలన కవి పండితుల నాదరించిరి. ఇబ్రహీం కుతుబ్షా కవులచే ఇభరాముషాయనియు, మల్కిభరాము అనియు కీర్తింపబడెను. అద్దంకి గంగాధరుడు ఈ కాలమున ప్రసిద్ధుడైన కవి. ఈతడు తపతీ సంవరణోపాఖ్యాన మను గ్రంథమును రచించి ఇబ్రహీంషా కంకిత మొసంగెను. ఈ గ్రంథమునందీతడు "శౌరిఘనుడై కరుణా రసవృష్టిచే నిరాయా సతబ్రోచు గావుత నృపాగ్రణి మల్కిభరాము" అని ఇబ్రహీం కుతుబ్షాను కీర్తించెను.

కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయ యక్షగానము, నిరంకుశో పాఖ్యానము, స్మరదీపిక, సరసజన మనోరంజనము, బలవదరీ శతకము, గువ్వలచెన్న శతకము, జనార్దన స్తోత్రాష్టకము, శృంగార జనార్దనాష్టకమను గ్రంథములు రచించి ఇబ్రహీం కుతుబ్షా యాస్థానము నలంకరించి యాతనిచే చింతల పాలెమను గ్రామున గ్రహారముగా బడసెనని తెలియుచున్నది.

దశరథ రాజనందన చరిత్రమను నిరోష్ఠ్య రామాయణ రచయిత యాసూరి మరింగంటి సింగరాచార్యులు ఇబ్రహీం కుతుబ్షా యాదరణకు పాత్రుడైనాడు. ఈ కవికి శతఘంటావధాన బిరుదముండెను.

పొన్నెగంటి తెలగన్న అచ్చ తెలుగులో యయాతి చరిత్రమను గ్రంథమును రచించి, ఇబ్రహీం కుతుబ్షా సర్వసేనానియగు అమీన్ ఖాన్‌కు అంకితమిచ్చెను. ఈ కాలముననున్న మల్లారెడ్డియను కవి షట్చక్రవర్తి చరిత్రము శివధర్మోత్తరము పద్మ పురాణమను గ్రంథములను వ్రాసెను.

గోల్కొండకు గరణము గానున్న సారంగు తమ్మయ ప్రసిద్ధ కవి. ఇతడు వైజయంతీ విలాసమను శృంగార ప్రబంధమును రచించి శ్రీరామున కంకిత మొసంగెను. కంచర్ల గోపన్న అబుల్ హసన్ కుతుబ్షా కాలమువాడు. దాశరథీ శతకమును రామదాసు కీర్తనలను భక్తిరస భరితంగా రచించెను. గణనాథ కవియను నాతడు గోలకొండ నవాబుల కాలములో నుండెను.

ఈ కాలపు శాసనములందు ఉర్దూ, పారసీక, అరబీ పదములు విశేషములుగా నున్నవి. గ్రామ నామములు సైతము మహమ్మదీయ రాజుల యొక్కయు వారి అనుయాయుల యొక్కయు పేళ్ళను సూచించు విధముగా నున్నవి.

1. బ్రహ్మపురి... S.i.i Vol x, No.743
2. శ్రీకొల్లపూండి.. S.i.i Vol x, No.743
3. యపూర.. S.i.i Vol x, No.746
4. రావిపూండి... S.i.i Vol x, No.747
5. వుండవెల్లి... S.i.i Vol x, No.748
6. మందారం... S.i.i Vol x No.748
7. వింగుట్టు... S.i.i Vol x, No.748
8. పెనుంబాక... S.i.i Vol x, No.748
9. తాడిపల్లి... S.i.i Vol x, No.748
10. పాతూరు.. S.i.i Vol x, No.748
11. తూములూరు... S.i.i Vol x, No.748
12. వెలగపూండి... S.i.i Vol x, No.748
13. బందం.. S.i.i Vol x, No.748
14. రావూరు... S.i.i Vol x, No.748
15. మదూరు.. S.i.i Vol x, No.748
16. నుదరుళపాడు.. S.i.i Vol x, No.748
17. చామలమూండి... S.i.i Vol x, No.748
18. మృత్తిజా నగరం.. S.i.i Vol x, No.752
19. మోకలాగుఖాన పురము.. S.i.i Vol x No.752
20. ఘండికోట... S.i.i Vol x, No.753
21. అనుప్పల్లె.. S.i.i Vol x, No.753
22. ఆనెగొంది... S.i.i Vol x No.757
23. చంద్రగిరి... S.i.i Vol x, No.757
24. దేవుల చెర్వు.. S.i.i Vol x, No.758
25. యెద్లపల్లి... S.i.i Vol x, No.758
26. హనుమ్తపల్లి.. S.i.i Vol x, No.767
27. బొలవరం... S.i.i Vol x, No.767
28. ఆముదానగరము.. S.i.i Vol x, No.774
29. కొనకొండ్లపేట.. S.i.i Vol x, No.777

వింత పదములు

వ్రట్టన.. S.i.i Vol x, No.743

పంగులు... S.i.i Vol x, No.743
తిరిపెల కుదరి వేసులకు.. S.i.i Vol x, No.743
పెయ్యాలగ లుపకును... S.i.i Vol x, No.743
కిదర బాజాగడీలంగర... S.i.i Vol x, No.745
దేవడుము సమాయస్తేరు... S.i.i Vol x, No.745
అంద్దిశతకై... S.i.i Vol x, No.745
అంద్దిశాత సుంఖం... S.i.i Vol x, No.745
ముసాబు కుందప్పిన... S.i.i Vol x, No.745
హత్తెసేసిన దోషానం... S.i.i Vol x, No.745
కురచకత్తు ప్రమాణాన.. S.i.i Vol x, No.745
యాపిడి మూరకమ్మిని పగ్గంకి.. S.i.i Vol x, No.745
కుచలకి... S.i.i Vol x, No.748
కుంటలు... S.i.i Vol x, No.748
హొజ్జరమానను.. S.i.i Vol x, No.748
యరీతల... S.i.i Vol x, No.748
హరాంఖోలను.. S.i.i Vol x, No.748
యదాయదలై... S.i.i Vol x, No.751
కాంలు ఇచ్చిన వివరం... S.i.i Vol x, No.751
సలాసుమింద్ద... S.i.i Vol x, No.751
కుళానకు... S.i.i Vol x, No.751
ఆయ మదుకోళ్ళకు.. S.i.i Vol x, No.751

# మూసీ పదవినోదం - 26

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 ఉ | 3 ల | 4 వ | ల | 6 గా | 7 రె | లు | X |
| 2 చి | ల | కా | క్షే | మ | మా | X | 9 క |
| 5 తా | నా | ల | ్ర | X | 8 హ | ర | ణ |
| 6 ను | జ | తు | హ | X | 10 ను | ల | క |
| 11 చి | నా | X | X | 15 సా | X | 16 గు | ణ |
| 13 తా | పాం | X | 14 క్రో | టి | 17 బు | డ | మ |
| 12 లే | గ | 19 దూ | డ | X | 18 ర | జ | ను |
| వి | X | 20 సి | లు | వ | కా | దు | X |

# 'రచన'కు అర్ధ శతాబ్దం

**నల్ల భూమయ్య,** ప్రముఖ రచయిత

(గత సంచిక తరువాతి భాగం....)

## మారుతున్న సామాజిక విలువలు - సమాజం పట్ల రచయితల బాధ్యత : శ్రీ గోరాశాస్త్రి

చాలా సంక్లిష్ట ప్రశ్న. అనేకానేక వృత్తులు చేపట్టినవారున్నారు గదా, అందరికీ అంతో యింతో బాధ్యతలు వుంటాయి గదా, వారందరి కంటే రచయిత ఉన్నతుడా? అనే ఎదురు ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది.

వీధిగాయకుడు అద్భుతమైన గాయకుడు కావచ్చు. వాడ వాడలా తిరిగి రోజంతా పాటలు పాడితే దొరికే బిచ్చం మహా అయితే రెండు రూపాయలు. చలనచిత్ర నిర్మాణ పరిశ్రమలో 'ప్లేబ్యాక్' గాయకుడికి ఒక పాటకు వేయి రూపాయిల ప్రతిఫలం దొరుకుతుంది. వినాయక చవితి పండుగ కోసం మట్టితో గణపతి ప్రతిమను ఎంతో విన్నాణంగా మల్చిన శిల్పికి ప్రతిమ 'సైజు'ను బట్టి యాభై పైసలో, ఒక రూపాయో, ధర గిడుతుంది. దేవీ ప్రసాద్‌రాయ్ చౌదరీ వంటి శిల్పి అదే 'సైజు' విగ్రహాన్ని ఏదైనా సరే, తయారు చేస్తే అథమపక్షం పదివేల రూపాయిలు రాలి పడతాయి.

ఇంక 'రచయిత' అని అనిపించుకున్న విచిత్రజీవి సంగతి? సాహితీ విపణివీథిలో ధరలు కూడా గమ్మత్తుగా వుంటాయి. ఇవాళ సాహిత్యానికి 'మహారాజ పోషకులు' 1. పత్రికలవాళ్ళు 2. పబ్లిషర్స్ 3. రేడియో అధికారులు 4. కొన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధిపతులు 5. సాహిత్య అకాడమీ సారథులు 6. చలనచిత్ర నిర్మాతలు.

అందరికన్నా పిసినార్లు, లుబ్ధాగ్రేసర చక్రవర్తులు రేడియోవారు. కృష్ణశాస్త్రి కవితకూ, చనుబాల కవి కిష్టయ్య కవితకూ ఒకటే రేటు. భేదం లేదు.

భారీ పత్రికలది 'క్లోజ్‌డ్ షాప్' వంటి విధానం. వాటికి ఆస్థాన రచయితలున్నారు. 'ఫలానా రచయిత / రచయిత్రి మార్కు నవలల్నీ, కథలనూ వాడండి' అదీ నినాదం. ప్రస్తుతం రచయిత్రుల రచనలకు గిరాకీ ఎక్కువ. ధారవాహికంగా నేడు వెలువడే 'నవీన కాశీమజిలీ' కథలు పునర్జన్మ ఎత్తాయి. వాటినే **'నవలలు'** అంటున్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కృపారసం **పింఛనీ** తీసుకోవాల్సిన రచయితలపైనా, **పైరవీ** రచయితలపైనా వర్షిస్తుంది. 'అకాడమీ' పాలసీ **డిటో.**

రచయితలకు నేటి భోజ మహారాజులు సినిమా నిర్మాతలు. ఆరు పంక్తులు దాటని చెత్త పాటకు వెయ్యిరూపాయలు కూడా యిస్తారు. నేటి భోజునికున్న అంధవిశ్వాసాలు అనంతం. ఫ్యూడలిజాన్ని నిరసించే "కొమ్ములు మొలచిన" రచయితలు సినిమా రంగంలోని ఫ్యూడలిజాన్ని మాత్రం కంటికి రెప్పవలె సంరక్షిస్తారు. సుబేదారుల వలె వ్యవహరించడానికి తహతహలాడుతారు.

తొంభై శాంతం రచయితలు సాహిత్యాన్ని వ్యాపారంగా మార్చివేశారు. సాహిత్య సభల నిర్వహణ కూడా ఒక వ్యాపారం. 'సాహిత్య రచనా' బేకారులు 'రంథోళ్ళు' వాయిస్తుంటారు.

ఇది పరిశోధనా వ్యాసం కాదు. పరిశీలనా వ్యాసం. ఇందులోని భావాలను, అభిప్రాయాలను **సవాల్** చేసేవారికి సమాధానంగా వెయ్యి పేజీల పరిశోధనా గ్రంథాన్ని వ్రాయడానికి భవదీయుడు సిద్ధంగా ఉన్నాడు.

జీవన విధానాన్ని సాహిత్యం ఎన్నడూ మార్చలేదు. రెండు రకాల రచయితలుంటారు. సర్వదా వుంటారు. కార్యక్షేత్రంలో దిగి సంఘసంస్కరణమో, రాజకీయ సంరంభమో చేపట్టి తమ కృషికి ప్రచార సాహిత్యాన్ని వినియోగించుకునేవారు ఒక రకం.

ఉదా. కందుకూరి వీరేశలింగం; రాజకీయ పార్టీల పత్రికలు, మత సంబంధ ప్రచార పత్రికలు మొ॥

అదే సమయంలో వడ్డాది సుబ్బారాయుడు గారు 'వేణీ సంహారం' నాటకం వ్రాశారు. ఎందుకు? నాటకాలాడే సమాజం కోసం. 'భక్త చింతామణి' పద్యాలు వ్రాశారు. దేనికి? ఆయన దైవచింతనాపరుడు గనుక, భక్తుడిగా తన ఆత్మ సంతృప్తికోసం వ్రాశారు.

కన్యాశుల్కం దురాచారాన్ని గురజాడ వారి కన్యాశుల్కం నాటకం అనాడు కొంతవరకైనా మాన్పించిందని ఆయన 'పరమభక్తులు' కూడా అనలేరు. యంత్రయుగం వచ్చింది, సాంఘిక వ్యవస్థ మారింది. ఈ కొత్త పరిణామాలకూ 'ఉద్యోగ విజయాల'కూ సంబంధం లవలేశమైన వున్నదా? సాంఘిక విలువల గొడవ ఎక్కడుంది? రచయితల బాధ్యత ప్రసక్తికి ఆస్కారమే లేదు కదా!

'భావ కవిత్వ' ఉద్యమం వచ్చింది. గాంధీజీ నాయకత్వాన రాజకీయ రంగంలో బ్రహ్మాండ వుద్యమం నడిచింది. దేనిదారి దానిదే. పార్వతీశుల జంట తెలుగు పంట అన్నారు జాషువా కవి. ఐతే, సాంఘిక జీవనవిధానాన్ని ఆయా రచయితలు ప్రభావితం చేసి మార్చగలిగారా? లేక, నవసమాజాన్ని చూసి కవులూ, రచయితలే కొత్త ప్రక్రియలను చేబట్టారా?

రాయప్రోలు, గురజాడ, విశ్వనాథ దేశభక్తి గీతాలు వ్రాశారు. నిజమే. కాని, వారు దేశభక్తి గేయాలు, పాటలూ వ్రాయకపోతే ఏం

జరిగేది? స్వాతంత్ర్యోద్యమం తపీమని చతికిల పడిపోయేదా? ఉద్యమాన్ని గాంధీజీ నడిపించాడు, లక్షలాది మంది కారాగారాలకు వెళ్ళారు. పోలీసుల లాఠీల ప్రహరణాల వల్ల కాళ్ళు, కీళ్లు, ఎముకలు విరిగినా ముందుకు సాగారు, ప్రాణాల నర్పించారు. అంతటి త్యాగాన్ని చేయించింది గాంధీజీ వాణి. అంతేగానీ, లయతాళబద్ధమైన దేశభక్తి గేయాలు **ఎంతమాత్రమూ** కావు. లక్షలాది జనావళికీ, స్వాతంత్ర్య సమర వీరులకు అలాంటి గీతాలను ఎవరు వ్రాశారో కూడా తెలియదు. కార్చిచ్చు వంటి ఉద్యమం చెలరేగుచున్నది గనుక కవులు తమ గీతాలు వ్రాశారు.

సాంఘిక, రాజకీయ పరిణామాలు ఉప్పెనవలె విజృంభించి రచయితలను మార్చాయా? లేక, రచయితలే సాంఘిక చైతన్యాన్ని జాగృతం చేశారా? అటునుండి యిటు తిప్పడం చరిత్రకు అపచారం చేసినట్లే అవుతుంది.

శివశంకర శాస్త్రి, రాయప్రోలు, నాయని, నండూరి, అబ్బూరి, కాటూరి మొదలైన మహాకవులకు తెలుగుజాతి ఎంతో ఋణపడి వున్నది. కొడాలి ఆంజనేయులూ, శివ శంకర శాస్త్రి, మరికొందరూ స్వాతంత్ర్యోదమంలో జైలుకు వెళ్ళారంటే వాళ్ళు దేశభక్తులుగా మాత్రమే వెళ్ళారని గమనించాలి. కవులుగా కాదు.

కావ్యరంగం (సాహితీరంగం), కార్యరంగం (రాజకీయ, సంస్కరణ రంగం)లలో కొన్ని సమయాలలో ఒక రంగంలో కృషి చేసే వ్యక్తిని రెండవ రంగం ప్రభావితం చేస్తుంది. **అది పూర్తిగా వైయక్తికం.** అనగా ఒక వ్యక్తిని ఉత్తేజం చేస్తుంది గానీ సమాజాన్ని కాదు. గాంధీజీని అమెరికా రచయిత థోరో రాసిన 'వాల్డెన్' అనే గ్రంథం, రష్యా రచయిత కౌంట్ లియో రచనలు ప్రభావితం చేశాయట. కానీ థోరో మహాశయుని జీవిత విధానం, అతని సిద్ధాంతాలు అమెరికాలో ఎలాంటి ఉద్యమాన్ని తీసుకురాలేదు. కారణం? నిఖిల ప్రపంచం నిన్నా, యివాళా, రేపూ నివాళులర్పించే రచయిత టాల్‌స్టాయ్. మానవ నాగరికత ఊపిరి పీల్చినంత కాలం ప్రపంచ సాహిత్యంలో ధ్రువతార వలె టాల్‌స్టాయ్ నిలుస్తాడు. బకూనిన్, బుఖారిన్, చెకోవ్, గోగోల్‌లు కూడా రష్యన్ మహారచయితలు.

గాంధీజీని హత్యచేసిన రాక్షస ప్రవృత్తి ఉన్మాది నాథూరాం గాడ్సే కూడా భగవద్గీతను 'దారి చూపే దీపకళిక'గా భావించాడు. గీతోపదేశం ప్రకారంగా గాంధీజీని హత్యచేయడమే 'ధర్మసంస్థాపన' అనుకున్నాడు. ఒకే గ్రంథం – ఆరాధకుల ప్రవృత్తులు ఉత్తర – దక్షిణ ధ్రువాల వంటివి.

మానవ సమాజం నిత్య పల్లవ శీలమైనది. మార్పు తెచ్చిన ఘనుడు **రచయిత మాత్రం** కాదు.

రాజరాజనరేంద్రుని ఆశయం వైదిక మత పునరుద్ధరణ. అది నెరవేరలేదు. ఇస్లాం వచ్చింది. (600) సంవత్సరాలు భారతదేశాన్ని పాలించింది. తరువాత బుడతకీచులు, ఫ్రెంచివారు, బ్రిటీష్‌వారు జాతీయ జీవనాన్ని, విధానాన్నీ, సంస్కృతినీ మార్చివేశారు. భారతీయులు అన్నింటికీ తలవంచారు.

సాహిత్యరంగంలో ఖేద,మోదాలతో సంబంధం లేకుండా జాతీయ జీవనం మార్పు చెందుతుంది. శ్రీశ్రీ మహాకవి – కమ్యూనిష్టు విప్లవం రావాలంటున్నాడు. కృష్ణశాస్త్రి గారు కవితాశిల్పంలో అద్వితీయుడు. అందరి రచనలనూ చదివి ఆనందిస్తున్నారు. మంత్రుల మీద పంచరత్నాలు రాసేవారున్నారు. అగ్నివర్షం కురిపించేవారున్నారు. శరపరంపరగా 'కాలక్షేపం బటాణీ'ల వంటి నవలల్ని వ్రాసి ప్రచురిస్తున్న నవలా మణులున్నారు. అందరూ సమకాలికులు. జీవన విధానాన్ని మార్చుతున్న 'పాపాన్ని' వారికి అంటగట్టడం పరమ అన్యాయం. సహగమనాన్ని సమర్థించే వారినుండి నక్సలైట్లను ప్రశంసిస్తూ 'కృతులు' రాసే రచయితల వరకూ అందరూ ఉన్నారు. 'దేవతా వస్త్రాలను' ధరించి తమ 'సెక్సు' రేడియేషను కిరణాలను ప్రసరింపజేయాలనే యువతీమణుల ఉత్కంఠనూ, నీతి బాహ్య రాజకీయాలనూ వగైరా వగైరాలనూ సృష్టిస్తున్నది కవులూ, రచయితలూ ఎంతమాత్రం కాదు.

తనకు తోచినది, ఆత్మ సంతృప్తి కలిగించేది రాయడం రచయిత బాధ్యత. తన రచన ద్వారా భూమి కంపించిపోయిందని రచయిత ఆనందిస్తే అతడి ఆనందాన్ని విమర్శించి 'సామాజిక బాధ్యతను విస్మరిస్తున్నావు' అంటూ హెచ్చరించడం దేనికి?

రచయిత తయారు చేసిన 'దినుసును' బాగుందనుకుంటే పబ్లిషర్ ప్రచురిస్తాడు, తన అభిరుచికి అనుగుణంగా వున్న రచనలను పాఠకులెవరూ లంచమిచ్చినా సరే చదవరు. పాఠకునికి వినోదం, ఉల్లాసం, తన విజ్ఞానం పెరిగిందనే సంతృప్తి కావాలి. సాహిత్య ప్రయోజనం అంతవరకే. ఒకరు రామాయణాన్ని మరోమారు రాస్తే మరొకరు 'దోపడీ దారులను' తిడుతూ సాహిత్యం వండుతున్నారు. నవ నాగరికతా వ్యామోహంలో పడి వింత పోకడలు పోయే మహిళల గురించి 'పురుష రచయితలు' వాపోతున్నారు. బోలెడంత వైవిధ్యం. సమకాలీన జీవిత విధానానికి ఈ రభసతో ప్రమేయం లేదు. అవసరాల ననుసరించి మారిపోతున్నారు.

**గోష్టిలో పాలుపంచుకున్న యువతీ యువకుల అభిప్రాయాలు :** సమస్యను హృద్యంగా చిత్రించడం వరకే రచయిత బాధ్యత కానీ పరిష్కరించడం కాదనీ, కోడి కూయకున్నా సూర్యోదయం జరుగుతుందన్న వాస్తవాన్ని రచయిత గుర్తించాలని చర్చలో పాల్గొన్న ఎక్కువమంది యువతీయువకులు అభిప్రాయపడ్డారు.

'రచన'ను, గోష్టిని సమీక్షిస్తూ శ్రీ సురమౌళిగారు 'ఇటువంటి గోష్టులు ప్రాధాన్యతను ఉగ్గడించిన విద్యామంత్రిగారు ఎన్నో పుస్తకాల ప్రచురణలకు విరాళాలిస్తున్న విద్యాశాఖ నుండి ధన సహాయం గురించిన మాట యింతవరకూ తెలియజేయలేదు. ప్రభుత్వం ఇంతవరకు ముందంజ వేయకపోవడం శోచనీయం' అన్నాడు.

మూసీ మాసపత్రిక సంపుటి -24 : సంచిక - 4 (57) ISSN 2457-0796 హైదరాబాద్ ఫిబ్రవరి : 2021

శ్రీ సురమౌళి గారి సమీక్ష ఆంధ్రభూమి 3.8.1970 నాటి సంచికలో ప్రచురింపబడింది.


'విశ్వరచన' మాస పత్రిక ఆగస్టు 1970 సంచికలో.. "మారుతున్న విలువలపై రచయితల బాధ్యతలు ఎంతగా నిర్దుష్ట పరచగలవో అన్నది వివాదాంశమే" అని ప్రచురించింది.

'భారతి' అక్టోబర్ -1970 సంచికలో - ఈ పుస్తకం చదవడం ఒక గుణం అనడం మాత్రమే కాదు, చదవక పోవడం ఒక లోపం అని కూడా చెప్పవచ్చు అని ప్రచురించింది.

ఆంధ్ర పత్రిక, దినపత్రిక : 9.8.1970 ఆదివారం సారస్వతానుబంధంలో : రచయిత తన భావ పరంపరలను కలంలో పోని సామాజికుని నెత్తిన రుద్దడం జరుగుతోందని ఇటీవలి కవిత్వాలు, రచనలు తేటతెల్లం చేస్తున్నాయి అని ప్రచురించింది.

# ప్రార్థనా శక్తి





**భక్తుడు ఆర్తితో, ఆర్ద్రతతో భగవంతుడికి చేసే విన్నపమే ప్రార్థన.**

ఆధ్యాత్మిక చింతన, భగవంతుడి పట్ల ఉన్న అపారమైన విశ్వాసం ఎలాంటి కష్టాన్నయినా తొలగిస్తాయని పెద్దల మాట. శరణుజొచ్చి ఆర్తితో భగవంతుడిని ప్రార్థిస్తే ఆయన తప్పక ఆదుకొంటాడని ఎందరో విశ్వసిస్తారు. ప్రార్థన అనేది గుండెల లోతుల్లోంచి పెల్లుబికి వచ్చే మనోభావం.

నోటితో ప్రార్థించలేనివారు మనసులో ప్రార్థించవచ్చు. నిజానికదే మేలైన ప్రార్థన. ఇలాంటి ప్రార్థనల వల్లే ఉత్తమ సంస్కారాలు అలవడతాయి. సాధనా ప్రణాళికలో ప్రార్థనకు విశిష్టస్థానం ఉంది. పరిశుద్ధ అంతఃకరణం, నిర్మలమైన భక్తికి భగవానుడు సంతుష్టుడవుతాడు.

ప్రార్థనకు శ్రద్ధాభక్తులతో పాటు దృఢమైన విశ్వాసం సైతం ముఖ్యం. ఇలాంటి ప్రార్థనలు శీఘ్రంగా ఫలవంతమవుతాయంటారు. ప్రహ్లాదుడు, గజేంద్రుడు, ద్రౌపది, మీరాబాయి, త్యాగయ్య, గోపయ్య మొదలైన మహాభక్తుల ప్రార్థనలే ఇందుకు తార్కాణాలు. భగవంతుడు దయామయుడు. మనసారా ప్రార్థిస్తే కోరినవన్నీ ప్రసాదిస్తాడని భక్తులు విశ్వసిస్తారు.

మనిషి కోరికలు ధర్మబద్ధమై ఉండాలి. స్వార్థపూరితమైన కోరికలు మనసుతో కోరిన కోరికలు మనిషి వినాశనానికి దారితీస్తాయి. ఘోర తపస్సు చేసి ఆ పరమాత్మ నుంచి వరాలు పొందిన హిరణ్యకశిపుడు, రావణాది రాక్షసుల జీవిత చరిత్రలే దీనికి నిదర్శనాలు.

ప్రార్థన మనో మాలిన్యాన్ని నిర్మూలిస్తుంది. భవభయాన్ని తొలగిస్తుంది. భవభయాన్ని తొలగిస్తుంది. ప్రార్థనల వల్ల మానసిక ఒత్తిడులన్నీ మటుమాయమవుతాయి. మనసులో ప్రశాంతత గూడు కట్టుకుంటుంది.

ప్రార్థనా సమయంలో మనసంతా ఒకచోట కేంద్రీకృత మవుతుంది. అప్పుడు సంశయాలన్నీ తొలగిపోతాయి. ఆందోళన తగ్గుతుంది. మనస్సు నిర్మల తటాకమవుతుంది.

భారతీయ సంస్కృతి మానవాళికి అందించిన అద్భుతవరం - ఈ ప్రార్థనాశక్తి. అనాది నుంచి తత్త్వవేత్తలు, ఆచార్యులు, యోగులు ప్రార్థన ద్వారానే పరిపూర్ణతను సాధించారు.

గాంధీజీకి ప్రార్థనాశక్తి మీద అపారమైన విశ్వాసం ఉంది. 'మన లక్ష్యాన్ని పరమాత్మగా భావించాలి. అందుకోసం త్రికరణ శుద్ధితో నిజాయితీగా కృషిచేస్తే ఆ భగవంతుడు తప్పక సహకరిస్తాడు. అదే అసలైన ప్రార్థన' అనేవారు గాంధీజీ.

రామకృష్ణ పరమహంస ప్రార్థన గురించి చెబుతూ - 'మనం భగవంతుణ్ణి ప్రాపంచిక కోరికలు కోరకుండా భక్తితో ఆయన అనుగ్రహం కోసం ప్రార్థన చేయాలి. అలా చేస్తే దుఃఖాలు శాశ్వతంగా తొలగిపోతాయి. అప్పుడే ఆయన ముక్తికి సరైన మార్గం చూపిస్తాడు' అని బోధించేవారు.

కొందరు లౌకిక సంపదలతోనే చిరశాంతి లభిస్తుందని భావిస్తారు. ఆ సంపదలకోసం దైవాన్ని ప్రార్థిస్తారు. నిజానికి లౌకికమైనది ఏదైనా శాశ్వత శాంతిని, మానసిక ఆనందాన్ని ప్రసాదించలేదు. రాగద్వేషాలకు అతీతంగా లోకకల్యాణం కోసం, పరహితం కోసం చేసే ప్రార్థనలే మహత్తరమైనవి. అవే ఉదాత్తమైనవి. ఈ ప్రార్థనలు చేసే వారి మనసులు కూడా ప్రేమానురాగాలతో నిండి ఉంటాయి.

ప్రార్థన మనిషిలో మంచిని పెంచుతుంది. వ్యక్తిత్వంలో మార్పు తెస్తుంది. ప్రార్థన ఎప్పుడైనా చేయవచ్చు. సమయం నియమం లేదు. ఎవరిని ప్రార్థిస్తున్నామో వారిమీద సంపూర్ణమైన విశ్వాసం వుండాలి. వేదం ప్రతిపాదించిన 'వ్యాసవిద్య' ఇది. ఉపనిషత్తులు విశదీకరించిన 'ప్రపత్తి' ఇది.

సర్వేజనాః సుఖినోభవంతు అనే మహత్తరమైన ప్రార్థనను ఈ లోకానికి అందించిన సంస్కృతి మనది.

మూసీ సాహిత్యధార
పుస్తక సమీక్ష

# కొండవీటి సత్యవతి కొన్ని మెరుపులు – కొన్ని ఉరుములు

**ఆవుల రేణుక,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉ.వి.వి. ఫోన్ : **93982 68976**

సృష్టికి మూలం స్త్రీ. స్త్రీని త్యాగశీలి, ఇంటికి దీపం అంటూనే బానిసగా, వ్యక్తిత్వం, స్వేచ్ఛ లేకుండా చేశారు. ప్రస్తుతం స్త్రీలు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా, ఎంత అభివృద్ధి సాధించినా రోజురోజుకి వారి మీద హింస పెరుగుతూనే ఉంది. ఒక స్త్రీ యొక్క పరమావధి ఏమిటి? ఆమె చిన్ననాటి నుండి తండ్రి, భర్త, కొడుకుల అధీనంలో ఉంటుంది. ఆమె చుట్టూ హద్దులు గీసి నువ్వు ఆడదానివి, ఇలా చేయకూడదు, అలా చేయకూడదు; ఇలా ఉండాలి, అలా ఉండాలి అంట ఆమెను బంధాలతో బందీని చేసి ప్రతిక్షణం పితృస్వామ్య భావజలంతో అణచివేస్తున్నారు. ఇలాంటి సమస్యలతో రచించిన కథా సంపుటే కొండవీటి సత్యవతిగారి **'కొన్ని మెరుపులు, కొన్ని ఉరుములు.'** ఈ కథల్లోని వస్తు వైవిధ్యాన్ని కుటుంబ, వివాహ, సామాజిక, వ్యక్తిగత సమస్యలుగా చిత్రించారు.

స్త్రీలకు నిర్ణయాధికారం ఉండదు. వారు చిన్ననాటినుండి పురుషుల ఆధీనంలో ఉంటారు. స్త్రీలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండదు. వారు ప్రతిదానికి పురుషుల మీద ఆధారపడి బతకాల్సొస్తుంది. వారికి ఏదైనా చిన్న కోరికా ఉన్నా అది తీరడానికి సంవత్సరాలు పట్టొచ్చు. అసలు తీరకపోవచ్చు. ఇలాంటి ఇతివృత్తంతో వచ్చిన కథ **'ఆమె కల'.** ఈ కథలో ప్రధాన పాత్ర సుందరమ్మ. ఆమెకు వాచీ పెట్టుకోవాలనే కోరిక ఉండేది. ఆ మాట భర్తకు చెప్తే అతను హేళన చేస్తూ మాట్లాడతాడు. అతనికి, అతని పిల్లలకు చాకిరీ చేయడమే ఆమె జీవిత లక్ష్యం అనుకుంటాడు. ఆమెను ఒక మనిషిగా గూడా గుర్తించడు. సుందరమ్మ వాచీ పెట్టుకోవాలనే కోరిక తన చిన్నకోడలి వల్ల తీరుతుంది. అప్పుడు ఆమె **'ఇంత చిన్న కోరిక తీరడానికి నలభై సంవత్సరాలు పట్టింది'** అనుకుంటుంది. ఆడవారు ఎప్పుడూ పురుషుల అదుపాజ్ఞలలో ఉంటారు. వారిని మరమనుషులుగా భావిస్తారేమో, వారు మనుషులేనని, వారికి చిన్న చిన్న ఇష్టాలు, కోరికలు, ఆశలు ఉంటాయని గుర్తించాలి.

తాగుడుకు బానిసైన భర్తను భరిస్తూ చదువు లేని గ్రామీణ స్త్రీలు కుటుంబభారాన్ని మోసుకుంటూ గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ వారు పడే బాధను తెలిపే కథ 'కువాయిట్ క్యాసెట్'. కువాయిట్ నుండి తల్లి పంపిన క్యాసెట్‌ను తీసుకొని పొరుగింటికి వెళ్లి తల్లి పంపిన సందేశం వినిపించమని అడగడం, ఆ ఇంట్లో వాళ్లందరి ముందే తల్లి పంపిన సందేశం వినడం, ఆ కుటుంబానికి సంబంధించిన ఆర్థిక విషయాలు, కలతలు, కన్నీళ్ళు అన్నీ బహిరంగ రహస్యాలవడం సక్కు దుస్థితిని తెలియజేస్తుంది. **'దూరపు కొండలు నున్నగా కనపడతాయి. నాయినా! కొయిటా ఎల్లిపోయి లచ్చులు లచ్చులు సంపాయించాలనుకునేటోళ్ళందరికీ ఇంతే. ఈ చాకిరీ పగోళ్లక్కూడ ఒద్దు. రోగమొత్తే మందిచ్చే దిక్కునేదు"** అంటూ సిమెంటు పనివల్ల రెండు ఊపిరితిత్తులు పాడైపోయిన సక్కు తల్లి చెప్పిన మాటలివి. ఆమె తన పిల్లల్ని మళ్ళీ కలుస్తుందో లేదో తెలియక పిల్లలముందే ఏడ్వలేక, దుఃఖాన్ని దిగమింగుకొని పిల్లలకు మంచి చెడులు, జాగ్రత్తలు చెప్పే విధానం హృదయాన్ని ద్రవింపజేస్తుంది.

ఆడవారికి ఆశలు, ఆశయాలు, ఇష్టాలు ఉంటాయి. కానీ పెళ్లి తర్వాత వాటన్నింటిని సమాధి చేయాలి. భర్తే దైవం. ఇల్లే ప్రపంచం అనుకుంటూ బావిలో కప్పలా బతకాలి. భర్తకి ఎదురుచెప్పకూడదు. ఆమె ఒక యంత్రంలా బ్రతకాలనుకుంటారు. ఆమె పురుషుల అధికార పరిధి దాటొద్దు అనుకుంటాడు. ఈ విధమైన ఇతివృత్తంతో వచ్చిన కథ **'అపూర్వం'.** తన ఇష్టాలను, వ్యాపకాలను, ఆలోచనలను గౌరవించి ఇష్టపడి పెళ్లి చేసుకున్న మిత్రుడు ఒక్కసారిగా భర్తస్థానంలోకి రాగానే ఎలా అధికారాన్ని చలాయిస్తాడో విశ్లేషించేది ఈ కథ. **"స్నేహితుడిగా ఉన్నప్పుడు కల్మశం లేని సెలయేరులా స్వచ్ఛంగా ఉండేవాడు. ఏరోజైతే మొగుడి అవతారమెత్తాడో ఆరోజే అధికార సంబంధాల్లోకి జారిపోయాడు. అతనిలోని మార్పు తనని ఎంతగా హింసించింది"** అంటూ హరిత ఎంతో బాధ పడుతుంది.

**"నువ్వు నాతో సమానంగా అడుగులేయడం మొదలు పెట్టగానే నిన్ను వెనక్కి నెట్టేయడానికి నా శాయశక్తులా కృషి చేశాను. నువ్వు నన్ను దాటి వెళ్లిపోతావేమో అనే భయం అనుక్షణం నన్ను పీడించేది. నిటారుగా ధైర్యంగా నడిచే నిన్ను భరించలేక అణచివేయడానికి అనేకరకాలుగా ప్రయత్నించాను"** అంటాడు హరిత భర్త. ఆడవారిని ఎంత అణచివేసినా, చులకనగా చూసినా వారుమాత్రం భర్తను గౌరవంగానే చూస్తారనే విషయం గ్రహించాలి.

స్త్రీలు అమాయకంగానో, మోసపూరితంగానో, పరిస్థితుల వల్లనో వేశ్యలుగా మారిన వారి వ్యథను వివరించే కథ **"ఆ గుండెల చప్పుడు"** వ్యభిచార కూపంలో తప్పనిసరి పరిస్థితుల్లో జీవించే స్త్రీలకు కూడా గౌరవంగా బతకాలనే ఉంటుంది. వారు ఆ నరక కూపం నుండి బయట పడలేక ఒకవేళ బయటపడి మంచిగా బతుకుతున్నా వారిని ఈ సమాజం వేశ్యలుగానే చూస్తుంది. ఈ కథలో చంద్రకళ ప్రధానపాత్ర. ఆమె తన భర్త మోసం వల్ల వేశ్యగా మారింది. తర్వాత ఆ నరక కూపం నుండి బయటపడి మిత్రుడి సహకారంతో ఒక కంపెనీకి డైరెక్టర్ అయ్యింది. దుర్భర జీవితం నుండి బయటకు వచ్చి ఒక ఉన్నతస్థానాన్ని అధిరోహించిన మహిళగా ఆమెను ఇంటర్వ్యూ చేసిన ఒక జర్నలిస్టు 'ఇంకా మీరు సెక్స్‌వర్క్‌లో ఉన్నారా? కొనసాగుతారా?' అని ప్రశ్నించాడు. **"నేను నా జీవితం**

**మొత్తం మీముందించితే నాకు జరిగిన అన్యాయం మీకు కనబడలేదు, అభివృద్ధి పేరుతో ధ్వంసమౌతున్న స్త్రీల జీవితాలు మీకు కనబడలేదు. నా భర్త దుర్మార్గం మీకు కనబడలేదు. సెక్స్‌వర్క్ మాత్రమే మీకు అర్థమైంది. అదే ప్రముఖంగా అడగాల్సిన అంశంగా మీరు అనుకోవడం నిజంగా చాలా విషాదకరం"** అంటుంది చంద్రకళ. ఒక పురుషుడు స్త్రీని మోసం చేస్తే దానిగురించి సమాజం పట్టించుకోదు. కానీ ఒక పురుషుడు స్త్రీకి సహాయం చేస్తే మాత్రం దాన్ని భూతద్దంలో చూస్తూ, పలురకాలుగా అర్థం చేసుకుంటుంది. **"ఈ సంతోష్ మీకు ఏమవుతారో చెబుతారా"** మళ్ళీ ప్రశ్న. **"ఇతనా? నాకేమీ కాడు. రక్త సంబంధం లేదు. కానీ అంతకుమించి ఆత్మీయబంధం ఉంది"** అంటుంది చంద్రకళ. సమాజం ఇలాంటి దుర్మార్గపు ఆలోచనా విధానం నుండి బయటపడాలి. సమాజం స్త్రీని చూసే దృక్పథం మారాలి. స్త్రీ పురుష సంబంధాలను అర్థం చేసుకునే విధానం మారాలి. స్త్రీలను స్వేచ్ఛగా, గౌరవంగా బ్రతకనివ్వాలి.

స్త్రీవాదం మీద ఎన్నో విమర్శలున్నాయి. స్త్రీవాదులు అందరూ పురుష ద్వేషులని కొందరి అభిప్రాయం. కానీ స్త్రీల తిరుగుబాటు ధిక్కారం పురుషుల మీద కాదు. పితృస్వామ్య భావజాలంతో పురుషులు స్త్రీల మీద చెలాయించే ఆధిపత్య ధోరణి, అణచివేత, వివక్షతల మీద మాత్రమే. వారు కుటుంబంలోను, సమాజంలోను గౌరవంగా స్వేచ్ఛగా బతకాలని కోరుకుంటారు. స్త్రీవాదం స్త్రీలమీద జరిగే హింసను వ్యతిరేకిస్తుంది. స్త్రీలను స్త్రీత్వపు ఆధీనంలో బతకమని పరిధులు గీసిన పితృస్వామ్యం మీదనే స్త్రీల తిరుగుబాటు. స్త్రీవాదం స్త్రీ పురుష సమానత్వాన్ని కోరుకుంటుంది. ఈ విషయాలన్నీ ఎరిగిన సత్యవతిగారి కథలలో సతీష్, చంద్రశేఖర్ వంటి ఉన్నతమైన వ్యక్తులు మనకు కనబడతారు. ఆమె తన కథలలో స్త్రీ పురుషుల ఆలోచనా ధోరణి, వారి మనస్తత్వాలను మనకళ్ళ ముందు నిలబెట్టారు.

# దినకరుని హృదయాన్ని పరచిన శతక రాజం

**సిద్ధాంతపు ప్రభాకరా చార్యులు,** అశ్వారావు పేట, ఫోన్ : 9491357842

**ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర!**
**దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే॥**

అంటూ ఆ లోక బాంధవుడికి నమస్సులర్పిస్తుంది వేదం. విశ్వంలోని సమస్త గ్రహ రాశులకు మూలమైనవాడు, ఈ లోకంలోని సకల జీవరాశులకు ఆధారమైన వాడు, చీకట్లను చీల్చే కాంతి పుంజాలను వెదజల్లే వెలుగుల ఱేడు, కువలయానందకరుడు అయిన సూర్య భగవానుని కష్టాన్ని, నిరంతర శ్రమను, కార్యదీక్షను, 101 ఆటవెలది పద్యాలతో "సూర్య శతకం"గా మలచి మనముందుంచాడు కవి మిత్రుడు చిగురుమళ్ల శ్రీనివాస్.

శత శతక రచనా యజ్ఞాన్ని చేపట్టి 101 శతకాలను అలవోకగా పూర్తి చేసి తెలుగు సాహిత్యంలో శతక రచనలో తిరుగులేని వ్యక్తిగా శత శతక కవిగా స్థానాన్ని సంపాదించిన చిగురుమళ్ల ప్రకృతి ప్రేమికుడు, సామాజిక చైతన్యశీలిగా తన రచనల ద్వారా కనిపిస్తాడు. మొక్క ప్రాధాన్యాన్ని తెలిపే వృక్ష శతకం, నీటి అవసరాన్ని తెలిపే చెఱువు శతకం, అమ్మ ప్రేమను పంచే అమ్మ శతకం, తెలుగు భాషా శతకం వంటివి ఇప్పటికే అంతర్జాతీయ అవనికపై సాహితీ ప్రియుల మస్తిష్కాల్లోనే కాక, ఎంతో మంది పిల్లల మనసుల్లో గూడు కట్టుకున్నాయి.

"సూర్యుడతడు ఇలకు శూరుడతడు" అనే మకుటంతో రాసిన ఈ శతకంలో సూర్య శక్తిని గురించి అనేక పద్యాల్లో అక్షరీకరించాడు. "కాంతి వంతుడతడు కాంతి పంచునతడు/ పరమ దివ్యశక్తి పంచునతడు/ పుష్టినొసగుచుండు పుడమి తల్లికతడు/ సూర్యుడతడు ఇలకు శూరుడతడు" అనే పద్యంలో పంచభూతాలలోని భూమి, అగ్నిల సంబంధాన్ని వివరించాడు కవి.

సముద్రపు నీరు సూర్యుని వేడికి ఆవిరై, మేఘమై, వర్షించి, తిరిగి సముద్రాన్ని చేరే విధమే జలచక్రం. ఈ జలచక్రం ఆగితే పంటలేదు, జీవకోటికి ప్రాణమే లేదు. అందుకే అంటాడు కవి **మబ్బులెట్లు విరియు వానలెట్లు కురియు/ పరవశించి ఎట్లు పంట మరియు/ జగతి కాంతి లేక జరుగునా ఇవియన్ని**....అని ప్రశ్నిస్తూ సైన్సుని కూడా ఇందులో ఇమిడ్చాడు. మరో పద్యంలో **పచ్చదనము లేదు పత్ర హరితమేది?/ పసిడి పంటలేదు ప్రకృతి లేదు/ కిరణ జన్యమేది కిరణాలు లేనిచో** అంటూ కిరణజన్య సంయోగక్రియను గూర్చి చక్కగా వివరించాడు.

**క్రమము తప్పకుండా కర్తవ్య దీక్షలో**
**నిలిచియుండి విధులునిర్వహించు**
**అతని కార్యదీక్ష అవనికాదర్శమ్ము**
**సూర్యుడతడు ఇలకు శూరుడతడు**

కార్యదీక్షలో సూర్యున్ని మించువారు లేరు. ఎన్ని అవరోధాలైనా అతని దినచర్యలో ఎటువంటి లోపమూ రాదు. ఉదయాస్తమయాలు క్రమం తప్పవు. అందుకే కార్యదీక్షాపరులకు సూర్యుడే ఆదర్శ

# శరణుదేవీ శరణు! శరణు!!

## (వలిగొండ త్రిశక్తి స్వరూపిణికి దండకం)

**ఫిబ్రవరి 16 నుండి 27 వరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా**

శ్రీశక్తి శ్రీదేవి శ్రీవాణి చిచ్ఛక్తి ఐంకారి ఓంకారి సౌవర్ణ హ్రీంకారి బీజంబు శ్రీకారి, త్రైలోక్య సంచారి శ్రీపీఠ సామ్రాజ్ఞి కాత్యాయనీ బైందవీ సిద్ధ వేదాళి సూత్రంబు శ్రీ భాను శ్రీసోమ పుంజంబువై, సర్వ ప్రభావరూపివై గంగాది పుణ్యాల సంద్రాన జీవంపు సంజీవివై

గీర్వాణ పౌరాణ దీపంబు కావ్యాన పూర్ణేందు శ్రీకాంతివై, దుర్మార్గ ఖేదంబు నందించు, సన్మార్గ మోదంబు కల్గించు, మోక్షార్థి కైవల్య సంధాయివై, దీనార్త నాదాల హరించి, కల్యాణ సౌభాగ్య సంపత్తులన్ గూర్చు శ్రీగీతివై

లోకాల లాలించు, పాలించు సత్యంపు దండంబు చేబూని ధర్మంబు కాపాడు శ్రీకాళివై

జీవాల జీవంబు నిల్పంగ తోయంబు ధాన్యంబు సుక్షీర ధారాసుజాలంబు రూపాన నిల్చేటి యాహార శ్రీలక్ష్మివై

ధ్యానంబు చేకూర్చి నీరూపు జూపించి జన్మంబు ధన్యంబు గావింప శ్రీ జ్ఞాన మందించి మోక్షంబు కల్గించు శ్రీ భారతీ తీర్థమై

శ్రీకంఠు రాగంబు శ్రీ విష్ణు డెందంబు శ్రీధాత మోహంబువై, సన్మంగళాకారి, సన్మోహనాకారి, భక్తాళి మందార సౌందర్య శోభాల వాల్లభ్య దుర్గాన వెల్వర్తి వాసంబుగా

వల్గొండ గ్రామాన త్రిశక్తి సంపత్ ప్రదానంబు జేయంగ జేగీయ మానంబుగా నీవు దీపించి శాసించు శాస్త్రంబుగా, ముచ్కుంద తీరాన యద్వైత తత్త్వంబుగా వెల్గు శ్రీమూర్తివిన్

ధూపంబు దీపంబు నైవేద్య తాంబూల నీరాజనం మంత్ర పుష్పంబు సాష్టాంగ ప్రణామ మర్పింతు,

నా నోట పల్కించు వర్ణాలతో నిన్వేడి, నిన్బూడ నర్తింతు దాసుండుగా నీ యాజ్ఞతో నిల్తు నమ్మమ్మ నా పల్కు నా కర్మ కార్యంబులన్ కర్తవై భాసించు నారాయణీ వందనం నీకు దండంబు, కైమోడ్పు సేవించు భాగ్యంబు యీ జీవితంలోన నందించు సర్వజ్ఞ రాణీ జగన్మాత శ్రీమాత శ్రీమంగళం నీకు సన్మంగళం తల్లి జై మంగళం.

హరి హర త్రిశక్తి జగదంబార్పణం.

**డా. వొజ్జల శరత్ బాబు** , ఫోన్ : **9494183937**

మంటాడు. ఈ పద్యం ద్వారా కవి యొక్క నిశిత పరిశీలనా దృష్టి తేటతెల్లమవుతుంది. సూర్యునికి ఉన్న మానవీయ గుణాల్ని తెలిపే పద్యాలు ఇందులో మిక్కిలిగానే ఉన్నాయి.

**జీవులన్నిటికి జీవత్వమును పంచు**
**వింత శక్తి ఏది విశ్వమందు?**
**అపరశక్తి ఏది? ఆదిత్యుడే కదా!**
**సూర్యుడతడు ఇలకు శూరుడతడు**


దైవము కంటికి కనిపించడు. కదిలే కాలమూ కంటికి కనిపించదు. అయితే కనిపించని కాలాన్ని మనకు తెలియజెప్పేది ఆ కనిపించని దైవమే. అదే కాలానికి, దైవానికి ఉన్న అవినాభావ సంబంధం. మరి...ఆ దైవం ఎవరు? ఇంకెవరు? సూర్య భగవానుడే. ఆయన కదలికయే కాలం కదలిక. కాలచక్రాన్ని నడిపే ఆ సూర్యుడే ప్రత్యక్ష దైవం అనే విషయాన్ని శ్రీనివాస్ పై పద్యం ద్వారా చక్కగా చెప్పాడు. నిశిత పరిశీలన చేస్తే ఈ పద్యంలో అంతర్గతంగా గతితార్కిక భౌతిక వాదం ఇమిడి ఉంది.

**పచ్చదనము త్రుంచ పగగొనుదతగాడు**
**ప్రాణమగునతనికి పచ్చదనము**
**పచ్చదనమె తనకు పరమ ప్రియంబగున్**
**సూర్యుడతడు ఇలకు శూరుడతడు!**


సైన్సు ప్రకృతి ప్రయోజనాన్ని తెలిపితే, ఆధ్యాత్మికత ద్వారా ప్రకృతిని కాపాడుకునే మార్గాన్ని తెలుసుకోవచ్చు. ఆదిత్య హృదయ శ్లోకాలను అందించిన ఆర్షవాఙ్మయం ప్రకృతి పరవశించడానికి కారకుడైన దినకరుని సేవించడం ద్వారా మనల్ని మనం కాపాడుకోవచ్చని వివరిస్తుంది. కాని మనం అభివృద్ధి పేరుతో ఈ ప్రకృతిని నాశనం చేస్తూ, పర్యావరణాన్ని కలుషితం చేస్తూ, ఓజోన్ ఛిద్రం చేస్తూ సూర్య తాపానికి మనమే కారకులమవుతున్నాము. తద్వారా నిప్పులుగక్కే ఆదిత్యుని సెగలకు విలవిలలాడుతున్నాము. ఆ కోపాగ్నిని చల్లార్చాలంటే భూమి నిండా పచ్చదనాన్ని పర్చాలి. సూర్యోపాసనలోని అంతరార్థమిదే. ఈ విషయాన్నే కవి పామరులకు సైతం అర్థమయ్యేలా పై పద్యం ద్వారా చెప్పాడు. నేను ఇక్కడ వివరించింది మచ్చుకు కొన్నే... తినబోతూ రుచులెందుకు? ఆసాంతం చదివి అవగతం చేసుకోండి.

సూర్యలోకం ప్రాశస్త్యాన్ని తెలిపే ఈ శతకం ద్వారా ఆదిత్య హృదయాన్ని గెలుచుకోవాల్సిన అవసరాన్ని మానవ మనుగడకు ప్రకృతి చేసే సేవల్ని తెలియజేసి ప్రతీ ఒక్కరి ఇంట్లో ఉండాల్సిన మంచి శతకాన్ని అందించిన చిగురుమళ్ల శ్రీనివాస్‌కు అభినందనలు. మిత్రుని కలం నుండి మరిన్ని శతకాలు రావాలని ఆకాంక్ష.


**పుస్తకం పేరు : సూర్యశతకం; రచన : చిగురుమళ్ళ శ్రీనివాస్; ప్రతులకు : ఫోన్ : 7893 22 92 69**






**శ్రీ విశ్వకర్మ పురాణము**
డా. కపిలవాయి లింగమూర్తి
**పుటలు :** 54 **వెల :** 50
**ప్రతులకు :** కపిలవాయి అశోక్‌బాబు, ఫ్లాట్ నెం. 404, సి బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ ఫామ్స్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్, హైదరాబాద్
ఫోన్ : 87907 27772





**ఆంధ్రసాహిత్య పరిషత్తు తెలుగు భాషా సాహిత్య సేవ**
డా. మంగళగిరి శ్రీనివాసులు
**పుటలు :** 230 **వెల :** 300
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం.1-67, బోయిన్‌పల్లి గ్రామం, మిడ్జిల్ మం, మహబూబ్‌నగర్ జిల్లా - 509357
ఫోన్ : 9491 388 662










**శ్రీ శివరామ బ్రహ్మేంద్ర స్వామి చరిత్ర**
డా. కపిలవాయి లింగమూర్తి
**పుటలు :** 160 **వెల :** 200
**ప్రతులకు :** కపిలవాయి అశోక్‌బాబు, ఫ్లాట్ నెం. 404, సి బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ ఫామ్స్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్, హైదరాబాద్
ఫోన్ : 87907 27772





**సోషల్ సైంటిస్ట్ సావిత్రిబాయి**
సంగిశెట్టి శ్రీనివాస్
**పుటలు :** 112 **వెల :** 100
**ప్రతులకు :** రచయిత, ఫ్లాట్ 212, నందనవనం అపార్ట్‌మెంట్స్, అత్తాపూర్, హైదరాబాద్ - 500 048.
ఫోన్ : 98492 20321






**తొలి రాజకీయ చైతన్యం - గాజుల లక్ష్మీనరసు శెట్టి**
సంగిశెట్టి శ్రీనివాస్
**పుటలు :** 100 **వెల :** 100
**ప్రతులకు :** రచయిత, ఫ్లాట్ 212, నందనవనం అపార్ట్‌మెంట్స్, అత్తాపూర్, హైదరాబాద్ - 500 048. ఫోన్ : 98492 20321



## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | | |
|---|---|---|
| 1. | భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. 2875 - 00 |
| 2. | బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. 1200 - 00 |
| 3. | నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. 350 - 00 |
| 4. | మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. 100 - 00 |
| 5. | శాసన సంపుటి | రూ. 150 - 00 |
| 6. | కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి | రూ. 100 - 00 |
| 7. | షబ్నవీస్ శతజయంతి సంచిక | రూ. 100 - 00 |
| 8. | విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | 90 - 00 |
| 9. | త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. 75 - 00 |
| 10. | పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. 75 - 00 |
| 11. | దేవాలయ వాస్తుశిల్పము | రూ. 50 - 00 |
| 12. | మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. 50 - 00 |
| 13. | మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. 75 - 00 |
| 14. | 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. 100 -00 |
| 15. | మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. 100 - 00 |
| 16. | ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. 175 - 00 |

## చిరునామా

### మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్‌అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# తెనుగు భారతి

శ్రీకర వరసిత ముఖ వాసినిని – చదువు
లమ్మను – శ్రుతదేవిని – అమృతవల్లి
ని – మధుకలిత వాగీశ్వరీ నేత్రిని – సిత
నలువరాణిని – నుడుగుల చెలిని – అమృత
వర్షిణిని – నీలవేణిని – పద్మముఖిని
భాసుర జగజ్జనని గొల్చి ప్రస్తుతింతు!

పలుకుఁ జిలుకుల కుల్కిని, బ్రహ్మసతిని
భారతిని, భగవతిని, విశ్వాత్మ వశను
నిఖిల వేదాగ్రణిని, భాషనిధిని, సితను
చతుర సంగీత సాహిత్య ఛాయను, లలి
త కళా సంధాయినిని, లతాతన్విని, శుభ
దంతిని, విలాసవతిని, సీమంతిని, రమ
ణి లలితను, హంసగామినిని, కలకంఠి
చెలిని, పద్మాసనను, చిలుకల కొలికిని,
సుమధుర సుహాసినిని గాంతు, సొబగు మివుల

శారదను శారదాబ్జ విశాల ముఖిని
శ్రీ విలసితరాణిని, వాక్కు చేడియను, స
నాతనిని, సిరివాణిని, నా తలంపు
లందు నిల్పి తలంచెద, నమల మతిని!

కోమల శ్యామలైశిని, గుహజననిని
అదరిని సరస్వతిని, ధవళాంగినిని, మృ
గీ విలోకన చార్విని కృతి రచింప
ధారధారణ మతియింప ధారవోసి
నియతి గూర్పుము; నిరతమ్ము నెగడుకొన ను
తింప మతి నిరతి వహించె తివురమివుల !

శ్రీ శ్రుతిదేవి! సౌశీల్య నలువరాణి
    వాక్సుధా రసమిమ్ము; బ్రహ్మసతివి!
దివ్యవాణిగ నాకు దేదీప్య సద్బోధ
    వెల్గొంద జేయుమా! వీణ పాణి!
బ్రహ్మమానస రాణి ! భాసిల్లు శర్వాణి!
    సప్తస్వర వికాస సమతవేణి!
శారదా! సకల విశారదా! వాగ్దేవి!
    క్షేమమ్ముతో! గాంచి ప్రేమ! జూపు;

భారతివి చదువుల భాగవతివి మదిని
నిల్పి, మధుర పలుకు నేర్చునటుల
వినుతి జేసి గొలుతు; వేదాగ్రపాణివి!
తెనుగు భారతీవు – తేజమొసగు!

శ్రీ 'వసంత పంచమి' మీఱి జీవులందు
జీవమగుచు మనుగడకై స్నిగ్ధమాయె;
తెనుగు భారతీ! జ్ఞానమ్ము కలుగజేయ
మూర్ఖతతిని బ్రోవగ ఆంధ్ర పుడమి కొఱకు
రమ్ము! సాహితీ విజ్ఞాన రశ్మితోడ!

అక్షరాస్యతకు ప్రతీక! అనఘ చరిత!
ఆంధ్ర జగతికి దర్పణమై రహించు;
తెలుగు భాషామతల్లివే! తేజునింపు
పద్మలాంఛనవే! తేట పలుకుల నిడు;

మాఘశుద్ధ పంచమి మహిమాన్వితమయి
జగతి బ్రతుకులందున దివ్య ప్రగతి కాంతు
లిడగ అరుదెంచవే దేవి! రీతిని గనుచు
చేరి సకల విజ్ఞానాంధ్ర సీమ కొరకు
తత సమైక్యతా రాగముల్ తనరునట్లు
తెలుగు భాషకు జీవమై వెలుగులొసగు;

ఈ విశాలాంధ్ర ధరను రక్షింపజేయ
భవ జయంత్యుత్సవపు వెల్గు పరిఢవిల్లు;
అక్షరాస్యతపు జిలుగులై రహింప
ఆంధ్ర సాహిత్య సంప్రదాయములు దిద్ది
దేశ కల్యాణ సాధన దీక్ష తోడ
కప్పు తొలగంగ వెల్గులు క్రమ్మినట్లు
మబ్బు విడువంగ వెన్నెలల్ మలయునట్లు
రాగదే! తెన్గు భారతీ! రమ్యమివుల!
**(ఫిబ్రవరి 16 ... శ్రీపంచమి సందర్భంగా ..,)**

**ఆచార్య శ్రీవత్స**
**తిరుపతి రూరల్, ఫోన్ : 9000324024**